సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 65
సోమవారం 27-5-2024
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'



రన్నరప్ సింధు
మలేసియా ఓపెన్ టోర్నీ ఫైనల్లో ఓడిన భారత స్టార్ షట్లర్. -12లో



ప్రీమియం భారమైతే..
రేట్లను ఏటా సవరిస్తున్న బీమా సంస్థలు.. పోర్టతో కంపెనీ మారే చాన్స్.. -13లో


పపువా న్యూ గినియా విషాదం
పసిఫిక్ ద్వీప దేశం పపువా న్యూ గినియాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతులు 670కిపైనే అని ఐవోఎం తెలిపింది.
వివరాలు 6లో ▸


మానవ తప్పిద మహావిషాదం
రాజ్‌కోట్ గేమ్‌జోన్‌లో ప్రమాద ఘటనపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. మానవ తప్పిద మహా విషాదంగా అభివర్ణించింది.
వివరాలు 6లో ▸


'ఇండియా' కూటమి గెలిస్తే..
మెజార్టీగా ఉన్న హిందువులను రెండో తరగతి పౌరులుగా మార్చేందుకు 'ఇండియా' కూటమి కుట్ర పన్నుతోందని మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸


ఢిల్లీ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం..
వివేక్ విహార్‌లోని బేబీ కేర్ న్యూ బోర్న్ హాస్పిటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడుగురు పసికందులు ప్రాణాలు కోల్పోయారు.
వివరాలు 6లో ▸


నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలంలోని అంబం (ఆర్) శివారులో ఆటో, బైక్‌లపై కూలిన చెట్టు

గాలి బీభత్సం..

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు చిన్నారులు సహా 13 మంది మృత్యువాత

- ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలోనే ఇద్దరు చిన్నారులు సహా ఏడుగురు మృతి
- కీసరలో మోటార్ సైకిల్‌పై కూలిన భారీ వృక్షం..ఇద్దరి దుర్మరణం
- పలు ప్రాంతాల్లో విరిగిపడిన చెట్లు..నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- మరోవైపు మండిపోయిన ఎండలు
- అత్యధికంగా జగిత్యాల జిల్లా జైనలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత

2 లో

న్యూస్‌రీల్

'అడ్వాన్స్‌డ్' ఈసారి పర్లేదు


దేశవ్యాప్తంగా ఐఐటీల్లో ప్రవేశానికి ఆదివారం జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 2 లక్షల మంది హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి 50 వేల మంది పరీక్ష రాశారు. ఐఐటీ మద్రాస్ నిర్వహించిన పరీక్ష ఈసారి కాస్త తేలికగానే ఉందని విద్యార్థులు తెలిపారు.
- వివరాలు 14లో▶

రాష్ట్రంలో గుట్కా, పాన్‌మసాలాపై నిషేధం



ప్రజారోగ్యం దృష్ట్యా రాష్ట్రంలో పొగాకు, నికోటిన్ కలిగిన గుట్కా, పాన్‌మసాలా తయారీ, రవాణా, సరఫరా చేయడం, విక్రయించడంపై నిషేధం విధిస్తూ ఫుడ్ సేఫ్టీ విభాగం కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.
- వివరాలు 14లో▶

'మీషో' పేరిట సైబర్‌మోసం!


ఆన్‌లైన్ షాపింగ్‌లో ప్రముఖ సంస్థ 'మీషో' పేరిట సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసానికి తెర తీస్తున్నారని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీషో కంపెనీ నుంచి వచ్చిందని భ్రమపడేలా ఓ ఫామ్‌ను, స్క్రాచ్ కార్డును డిజైన్ చేసి నేరగాళ్లు పోస్ట్ చేస్తున్నారు.
- వివరాలు 14లో▶

13 నిమిషాలు యథాతథం


తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రముఖకవి అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ' ను యథాతథంగా ఉంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. 13 నిమిషాల నిడివి గల ఆ పాట సాహిత్యం, ప్రతి చరణం అదేవిధంగా కొనసాగించాలని స్పష్టం చేశారు.
- వివరాలు 2లో▶

ఇదండీ సంగతి


ఏదైతేనేం! మీరు చరిత్ర సృష్టించారు చాలు!


శ్రేయస్, వెంకటేశ్ అయ్యర్‌ల విజయానందం

నైట్‌రైడర్స్‌కు ఐపీఎల్ టైటిల్
ఫైనల్లో సన్‌రైజర్స్‌కు నిరాశ

కోల్‌కతాకే కిరీటం

టోర్నీ ఆద్యంతం అద్భుతంగా ఆడిన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) జట్టు ఐపీఎల్ 17వ సీజన్‌లో చాంపియన్‌గా అవతరించింది. చెన్నైలో ఆదివారం జరిగిన ఫైనల్లో శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని కోల్‌కతా జట్టు 8 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును ఓడించింది. తద్వారా మూడోసారి ఐపీఎల్ టైటిల్‌ను కోల్‌కతా సొంతం చేసుకుంది. గతంలో 2012, 2014లలో కూడా కోల్‌కతా జట్టుకు ఐపీఎల్ ట్రోఫీ లభించింది. ఫైనల్లో ప్యాట్ కమిన్స్ సారథ్యంలోని సన్‌రైజర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. కోల్‌కతా బౌలర్ల ధాటికి సన్‌రైజర్స్ 18.3 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. అనంతరం కోల్‌కతా 10.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి గెలిచింది. మిచెల్ స్టార్క్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్', టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన విరాట్ కోహ్లికి (బెంగళూరు) 'ఆరెంజ్ క్యాప్'... టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన హర్షల్ పటేల్‌కు (పంజాబ్ కింగ్స్) 'పర్పుల్ క్యాప్' అవార్డులు లభించాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్ర జట్టు క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి 'ఎమర్జింగ్ ప్లేయర్' అవార్డును గెల్చుకున్నాడు.

- వివరాలు 12లో

రెండ్రోజులు మరింత వేడి

ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీల మేర పెరుగుతాయన్న వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి బంగాళాఖాతంలోని చాలా ప్రాంతాలు, మధ్య, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లోకి ఆదివారం రుతుపవనాలు విస్తరించాయని వివరించింది. ఇలావుండగా రాష్ట్రంలో ఆదివారం చాలాచోట్ల



అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా జైనలో 46.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అదే జిల్లా బుద్దేశిపల్లిలో 46.1 డిగ్రీల సెల్సియస్, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 45.8 డిగ్రీ సెల్సియస్, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 45.7 డిగ్రీల సెల్సియస్, జగిత్యాల జిల్లా నేరెళ్ల, ఐలాపూర్‌లో 45.6 డిగ్రీల సెల్సియస్, ఆదిలాబాద్ జిల్లా మిగతా 2వ పేజీలో ▶

'రింగు' పరిహారానికి రుణం



రూ. 2,600 కోట్లు అప్పు తెచ్చుకొనేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు

- రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా హడ్కోకు దరఖాస్తు
- ఇటీవలి సమీక్షలో ఈ మేరకు ప్రాథమికంగా నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగురోడ్డు ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణలో సగం వాటా భరించడం ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద భారంగా మారింది. ప్రాజెక్టు నిర్మాణ ఖర్చు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భరించనుంది. భూసేకరణలో సగం ఖర్చు కూడా కేంద్రమే భరిస్తుంది. మిగతా సగం మాత్రం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. అయితే ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేని ప్రస్తుత తరుణంలో భూసేకరణ వ్యయంలో సగం భరించడం కూడా ప్రభుత్వానికి కష్టంగా మారింది. సొంత ఆదాయవనరుల నుంచి నిధులు కేటాయించే పరిస్థితి లేకపోవడంతో రుణం తీసుకోవాలని నిర్ణయించింది. వాస్తవానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా రుణం వైపే మొగ్గుచూపింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాలో వెళ్తోంది.

హడ్కో వైపు చూపు: భూసేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను ఒకేసారి చెల్లించాలంటూ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) గతంలో ఒత్తిడి చేసింది. దీన్ని నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ విషయంలో మిగతా 5వ పేజీలో ▶

పోలింగ్‌లో టాప్!

2024 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మెజారిటీ స్థానాల్లో పెరిగిన పోలింగ్

- దేశంలోని టాప్ 25 స్థానాలకుగాను 9 స్థానాలు తెలంగాణలోనే నమోదు
- 3.6 లక్షల ఓటర్ల పెరుగుదలతో దేశంలోనే మూడో స్థానంలో చేవెళ్ల
- మరో 8 చోట్ల కూడా కనీసం 1.8 లక్షల చొప్పున పెరిగిన ఓటర్లు
- పెరిగిన ఓట్లు ఏ పార్టీకి లాభం చేకూరుస్తాయన్న విషయమై సర్వత్రా ఆసక్తి
- నాలుగో దశ పోలింగ్ ముగిశాక ఎస్‌బీఐ రీసెర్చ్ టీమ్ అధ్యయనంలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ రాష్ట్రంలో ముగిసిన దాదాపు 15 రోజుల తర్వాత విడుదలైన ఓ అధ్యయనం ఆసక్తి కలిగిస్తోంది. ఈ నెల 13న నాలుగు దశల పోలింగ్ తర్వాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిర్వహించిన అధ్యయనం ప్రకారం 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే 2024 లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల సంఖ్య భారీగా పెరిగింది. ఈ జాబితాలో అస్సాంలోని ధుబ్రీ లోక్‌సభ తొలి స్థానంలో నిలవగా మూడో స్థానంలో చేవెళ్ల నియోజకవర్గం నిలిచింది. దేశవ్యాప్తంగా భారీగా ఓట్లు పెరిగిన 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో 9 తెలంగాణలోనే ఉన్నాయి. చేవెళ్లతోపాటు మల్కాజిగిరి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, భువనగిరి, మెదక్, నాగర్‌కర్నూల్, జహీరాబాద్, వరంగల్‌లో పోలైన ఓట్ల సంఖ్య పెరిగినట్లు ఎస్‌బీఐ అధ్యయన నివేదిక వెల్లడించింది. మరోవైపు దేశవ్యాప్తంగా మహిళా ఓటర్ల సంఖ్య పెరిగిందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ప్రతి ఎన్నికల సమయంలో కొత్తగా ఓటర్లు చేరడం, పోలైన ఓట్ల సంఖ్య పెరగడం సాధారణమే అయినా, ఈసారి దేశంలోనే టాప్ 25 నియోజకవర్గాల్లో 9 తెలంగాణలోనే ఉండడం ఆసక్తిని కలిగిస్తోంది. దీంతో పెరిగిన మిగతా 3వ పేజీలో ▶



మన బడుల్లో చేరండి

విద్యార్థులను ఆకర్షించేందుకు సర్కారు ప్రణాళిక

- జూన్ 1 నుంచి 11వ తేదీ వరకు 'బడిబాట'కు శ్రీకారం
- పక్కాగా కార్యక్రమం అమలు చేయాలని టీచర్లకు విద్యాశాఖ ఆదేశం
- విద్యార్థుల చేరికలు పెంచాలని స్పష్టీకరణ
- ఈ ఏడాది రూ. 1,907 కోట్లు ఖర్చు చేయనున్న ప్రభుత్వం
- గత రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న చేరికలు పెంచడమే లక్ష్యం -2లో▶

పట్టభద్రుల పట్టమెవరికి?



వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక బరిలో 52 మంది ఉన్నా, ప్రధానపోటీ మాత్రం ముగ్గురి మధ్యే నెలకొంది. ఈ ఎన్నికలో ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీలతోపాటు కొందరు స్వతంత్రులు పెద్దఎత్తున ప్రచారం చేశారు. సోమవారం పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 3 లో

మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి, పొన్నాల, శంభీపూర్ రాజు



'పౌర సరఫరా'లో రూ.1,000 కోట్ల స్కాం!

35 ఎల్‌ఎంటీల ధాన్యం సేకరణ పేరుతో రూ.700 కోట్ల స్కాం: కేటీఆర్

- 2.20 ఎల్‌ఎంటీల సన్న బియ్యం కొనుగోలు పేరిట మరో 300 కోట్లు
- గ్లోబల్ టెండర్ల పేరిట దోపిడీకి తెరతీశారు
- టెండర్ మొత్తానికంటే అదనంగా చెల్లించాలని మిల్లర్లపై కంపెనీల ఒత్తిళ్లు
- రాష్ట్రంలో బి-ట్యాక్స్, యు-ట్యాక్స్, ఆర్‌ఆర్- ట్యాక్స్

సాక్షి, హైదరాబాద్: పౌర సరఫరాల శాఖలో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అన్నారు. మిల్లుల్లో నిల్వ ఉన్న 35 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యం సేకరణ పేరుతో రూ.700 కోట్ల నుంచి రూ.750 కోట్లు, మధ్యాహ్న భోజన పథకం కోసం 2.20 ఎల్‌ఎంటీల సన్న బియ్యం కొనుగోలు పేరిట మరో రూ.300 కోట్లు..మొత్తం రూ.1,000 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో బి-ట్యాక్స్, యు-ట్యాక్స్, ఆర్‌ఆర్-ట్యాక్స్ రాజ్యమేలుతున్నాయని ధ్వజమెత్తారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మిగతా 3వ పేజీలో ▶

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి



గింజ సన్నబియ్యం కొనలేదు.. పైసా ఖర్చు చేయలేదు

ఏ ప్రక్రియ ప్రారంభించక ముందే స్కామ్ జరుగుతుందా?

- అర్థరహిత ఆరోపణలతో ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు
- కిలో సన్నబియ్యం రూ.42కు కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- పౌరసరఫరాల సంస్థను అప్పుల ఊబిలో నెట్టింది గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమే
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు గింజ సన్నబియ్యం కూడా కొనుగోలు చేయలేదని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సన్నబియ్యం కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు పైసా ఖర్చు చేయలేదన్నారు. అలాంటప్పుడు కుంభకోణానికి ఆస్కారమే ఉండదని వివరించారు. ఈ అంశంపై ఏమాత్రం అవగాహన లేని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ అర్థరహితంగా ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్నబియ్యం కొనుగోలులో ఏకంగా రూ.300 కోట్ల స్కామ్ జరిగిందని చెప్పడం అత్యంత హాస్యాస్పదంగా మిగతా 3వ పేజీలో ▶

ఇమేజ్ టవర్స్ ఒప్పందాన్ని పునఃసమీక్షించండి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.నారాయణరెడ్డి



సాక్షి, హైదరాబాద్: నగరంలో ఐకానిక్ ఇమేజ్ టవర్ల నిర్మాణానికి సాలార్‌పురియా సత్వ గ్రూప్‌తో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని పునఃసమీక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణ రెడ్డి ఆదివారం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒప్పందాన్ని సవరించి తద్వారా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని ఆయన ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై విచారణ జరిపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలతో రాజీపడి సత్వ గ్రూప్‌తో ఒప్పందం కుదుర్చుకుందని నారాయణరెడ్డి ఆరోపించారు. ఏదైనా అభివృద్ధి ఒప్పందంలో భూస్వాములు తమకు కనీసం 40 నుంచి 50 శాతం ఆదాయం వచ్చేలా చూస్తారని కానీ ఈ ఒప్పందంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాయితీదారుకి 75% ప్రయోజనాన్ని ఉదారంగా ఇచ్చిందని నారాయణరెడ్డి తెలిపారు.

నేటి భవితలో..

- టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1: ప్రిలిమ్స్ గట్టెక్కేలా..! టీఎస్‌పీఎస్సీ జూన్ 9న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించనుంది. రాష్ట్ర స్థాయిలో డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ వంటి ఉన్నత స్థాయి పోస్టులను భర్తీ చేసే ఈ పరీక్షలో మొత్తం 563 పోస్టులకు నాలుగు లక్షలకుపైగానే దరఖాస్తులు వచ్చాయి. గతంలో రెండుసార్లు ప్రిలిమ్స్ రాసిన వారు, సివిల్స్ అభ్యర్థులతోపాటు ఫ్రెషర్స్ కూడా పోటీ పడే అవకాశముంది. కాబట్టి ప్రిలిమ్స్‌లో అర్హత సాధించడం అత్యంత కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమ్స్ గట్టెక్కేందుకు నిపుణుల ఎగ్జామ్ డే టిప్స్..
- గ్రూప్స్ ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ: పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. నిపుణులు రూపొందించిన ఇండియన్ పాలిటీ స్టడీమెటీరియల్.
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

మన బడుల్లో చేరండి

విద్యార్థులను ఆకర్షించేందుకు సర్కారు ప్రణాళిక

జూన్ 1 నుంచి 11వ తేదీ వరకు 'బడిబాట'కు శ్రీకారం	పక్కాగా కార్యక్రమం అమలు చేయాలని టీచర్లకు విద్యాశాఖ ఆదేశం	విద్యార్థుల చేరికలు పెంచాలని స్పష్టీకరణ	ఈ ఏడాది రూ.1,907 కోట్లు ఖర్చు చేయనున్న ప్రభుత్వం	గత రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న చేరికలు పెంచడమే లక్ష్యం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక క్రమంగా తగ్గుతోంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చేరికలు కొంత ఆశాజనకంగానే ఉన్నా ఆ తర్వాత క్లాసుల్లో ఎన్‌రోల్‌మెంట్ పడిపోతోంది. ఆరో తరగతి నుంచి విద్యార్థులు ప్రైవేటు బాటపడుతున్నారు. దీన్ని సరిదిద్దేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. తాజాగా సమగ్ర శిక్ష ప్రాజెక్టు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఎన్‌రోల్‌మెంట్ పెంచాల్సిన అవసరం ఉందని సూచించింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని జూన్ 1 నుంచి 11 వరకు బడిబాట కార్యక్రమాన్ని అధికారులు చేపట్టనున్నారు. ఏటా పాఠశాలలు తెరిచే ముందు ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టడం సాధరణమే అయినప్పటికీ ఈసారి విద్యార్థుల శాతాన్ని ఎక్కువగా పెంచాలని విద్యాశాఖకు స్పష్టమైన ఆదేశాలు అందాయి.



సమస్యలు పరిష్కరిస్తేనే..

ఈ ఏడాది రూ. 1,907 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రచించింది. ఈ నిధులతో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలతోపాటు భవనాల మరమ్మతులు, స్మార్ట్ క్లాస్‌రూంలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సిబ్బంది జీతాలకు ఖర్చు చేయనుంది. గతంలో మన ఊరు–మన బడి కార్యక్రమం కింద స్కూళ్లలో మౌలికవసతులు కల్పించాలని నిర్ణయించగా ప్రభుత్వం మారడంతో ఈ కార్యక్రమం నత్తనడకన నడుస్తోంది. దీంతోపాటు టీచర్ల కొరత ప్రభుత్వ పాఠశాలలను వేధిస్తోంది. ప్రధానంగా ఈ రెండు సమస్యలను పరిష్కరిస్తే తప్ప ప్రభుత్వ బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరిగే అవకాశం లేదని అధ్యాపక వర్గాలు అంటున్నాయి.

ప్రభుత్వ స్కూళ్ల పరిస్థితి ఇది..

- రాష్ట్రంలో 30,023 ప్రభుత్వ స్కూళ్లు ఉన్నాయి. వాటిలో 1,213 స్కూళ్లలో గతేడాది జీరో ఎన్‌రోల్‌మెంట్ నమోదైంది. 13,364 పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ సంఖ్య 50లోపే ఉంది.
- రాష్ట్రంలో 21 వేల టీచర్ పోస్టుల ఖాళీలున్నాయి. 5,821 స్కూళ్లు ఒకే టీచర్‌తో నడుస్తున్నాయి. 80 శాతం స్కూళ్లలో సబ్జెక్టు లేదా భాషా పండితుల కొరత ఉంది.
- దివ్యాంగులకు టాయ్‌లెట్స్ లేని స్కూళ్లు 15.45 శాతం ఉన్నాయి. బాలికలకు టాయ్‌లెట్స్ లేని బడులు 9.44 శాతం ఉన్నాయి.
- 18, 19 పాఠశాలల్లో సమీకృత సైన్స్ లేబొరేటరీలు లేవు. ఐసీటీ ల్యాబ్‌లు లేని స్కూళ్లు 11.7 శాతం. స్కిల్ ఎడ్యుకేషన్ ల్యాబ్‌లు లేని బడులు 71 శాతం ఉన్నాయి.
- ఎస్‌సీఈఆర్‌టీలో మంజూరైన పోస్టుల్లో 46.15 శాతం పోస్టులు, డైట్ కాలేజీల్లో 67.83 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కోవిడ్ కాలంలో పెరిగి.. మళ్లీ తగ్గి..

రాష్ట్రవ్యాప్తంగా ఒకటి నుంచి పదో తరగతి వరకు 60 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. వారిలో 28 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుంటే మిగతా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరిగింది. 2020 నుంచి 2022 వరకూ ఏటా 2.5 లక్షల మంది కొత్తగా ప్రభుత్వ బడుల్లో చేరారు. కానీ 2023 నుంచి మళ్లీ క్రమంగా ఏటా లక్ష మంది ప్రభుత్వ పాఠశాలల నుంచి నిష్క్రమిస్తున్నారు.

మెరుగైన విద్య లేనందుకేనా?

రాష్ట్రంలోని స్కూళ్లలో విద్యార్థుల హాజరుపై సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఇటీవల ఓ నివేదిక రూపొందించింది. దీని ప్రకారం 44 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 50 మంది విద్యార్థులు కూడా ఉండటం లేదు. ఐదో తరగతి వరకు ఒక్కో క్లాసులో 40 నుంచి 60 మంది విద్యార్థులు ఉన్నారు. ఆ తర్వాత నుంచి విద్యార్థుల చేరికలు క్లాసుకు 46 నుంచి 35కు పడిపోయాయి. ప్రభుత్వ పాఠశాలలు సక్రమంగా నడవకపోవడం, ఉపాధ్యాయుల కొరత, సకాలంలో పుస్తకాలు అందకపోవడం వల్ల బోధన కుంటుపడుతోంది. దీంతో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తమ పిల్లలకు మెరుగైన విద్యను అందించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు పట్టణాలకు తరలుతున్నాయని నివేదిక పేర్కొంది.

విస్తృత ప్రచారం కల్పించేలా..

ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, నాణ్యతా ప్రమాణాలు పెంచుతున్న తీరుపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని విద్యాశాఖ క్షేత్రస్థాయి టీచర్లకు సూచించింది. జూన్ ఒకటి నుంచి 11వ మధ్య చేపట్టే బడిబాట కార్యక్రమంలో స్కూళ్లను ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా తీర్చిదిద్దుతున్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పాలని, ఉపాధ్యాయ నియామకాలు చేపడుతున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొంది.

13 నిమిషాలు యథాతథం



ఆదివారం ఓ స్టూడియోలో కీరవాణితో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి, అందెశ్రీ, వేం నరేందర్‌రెడ్డి

- జయజయహే తెలంగాణ గీతంపై సీఎం రేవంత్ నిర్ణయం
- బాణీలు, సంగీత కూర్పుపై అందెశ్రీ, కీరవాణిలతో చర్చ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రముఖకవి అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ' ను యథాతథంగా ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. 13 నిమిషాల నిడివి గల ఆ పాట సాహిత్యం, ప్రతి చరణం అలాగే కొనసాగించాలని స్పష్టం చేశారు. 'జయజయహే తెలంగాణ గేయానికి బాణీలు, సంగీతకూర్పుపై ఆదివారం ఓ స్టూడియోలో గేయ రచయిత అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్య ప్రజా సంబంధాల అధికారి బోరెడ్డి అయోధ్యరెడ్డిలతో రేవంత్ సమావేశమయ్యారు. ఈ భేటీలో అందెశ్రీ, కీరవాణిలకు ఆయ న పలు సూచనలు చేశారు. వాటికి అనుగుణంగా మార్పుల అనంతరం మరోమారు సమావేశమై గేయానికి తుది రూపం ఇవ్వాలని నిర్ణయించారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై 13 నిమిషాలు గేయం ఆలపించడం అతిథులకు ఇబ్బంది కలిగిస్తుందేమోననే అభిప్రాయంతో షార్ట్ వర్షన్ రూపొందించాలనే అభిప్రాయం చర్చకు వచ్చిందని, ఈ షార్ట్ వర్షన్ బాధ్యత అందెశ్రీకి అప్పగించారని తెలుస్తోంది.

నిమ్స్ వైద్యులకు సీఎం ప్రశంసలు

గిరిజన యువకుడ్ని కాపాడినందుకు అభినందన

లక్డీకాపూల్ (హైదరాబాద్): ప్రజల్లో నిమ్స్ ఆస్పత్రిపై ఉన్న నమ్మకాన్ని మరోసారి నిరూపించారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిమ్స్ వైద్యులను ప్రశంసించారు. గిరిజన యువకుడు సోది నంద ఛాతీలో దిగిన బాణాన్ని చాకచక్యంగా, అత్యంత నైపుణ్యంతో తొలగించి నిండు ప్రాణం కాపాడిన వైద్యులకు ఎక్స్ వేదికగా సీఎం అభినందనలు తెలిపారు. ఈ క్రమంలో పేదల దేవాలయంగా పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు.

నిమ్స్ డైరెక్టర్‌కు పురస్కారం

నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్పకు ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పురస్కారం వరించింది. ఈ పురస్కారాన్ని ఆదివారం రత్నదీప్ హెల్త్ కేర్ కేటగిరీలో నిమ్స్ డైరెక్టర్‌కు ప్రదానం చేశారు.

నేడు కేరళకు సీఎం రేవంత్

సీఎం రేవంత్ రెడ్డి సోమవారం కేరళ రాష్ట్రానికి వెళ్లనున్నారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) కేరళ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కోజికోడ్ పట్టణంలోని రవీజ్ కడవు రిసార్ట్‌లో జరిగే స్నేహ సదస్ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరు కానున్నారు. సినీనటుడు నందమూరి బాలకృష్ణ ఆదివారం తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆదివారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో బాలకృష్ణ తన సన్నిహితులతో పాటు రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మావోయిస్టుల విధ్వంసం

ఛత్తీస్‌గఢ్ మార్గంలో భారీగా చెట్ల నరికివేత

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లకు నిరసనగా ఆదివారం ఆ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన మావోయిస్టులు విధ్వంసానికి దిగారు. ఈక్రమంలో ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే రహదారిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల – పూసుగుప్ప మార్గంలో శనివారం అర్ధరాత్రి దాటాక పెద్ద సంఖ్యలో చెట్లను నరికేసి రోడ్డుకు అడ్డంగా పడవేశారు. పూసుగుప్ప – వద్దిపేట మధ్య రోటింతవాగు సమీపాన ఇరువైపులా భారీ వృక్షాలను నరికి ప్రధాన రహదారిపై పడవేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు చెట్లను తొలగించడంతో రాకపోకలు మొదలయ్యాయి. చెట్లను నరకడంతో కొన్ని చోట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడి స్తంభాలు విరిగి పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



ఆదివారం సాయంత్రం వనస్థలిపురంలో కారుపై కూలిన చెట్టు, గోడ



చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కుప్పల నడుమ నిలిచిన వర్షపునీరు



నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరులో నలుగురి మృతికి కారణమైన రేకుల షెడ్ ఇదే



నల్లగొండ పట్టణంలోని ఇందిరా నగర్‌లో భిక్షపతి ఇంటి పై కప్పు కూలిపోయిన దృశ్యం

గాలి బీభత్సం

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం

సాక్షి, నెట్‌వర్క్: హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో పెనుగాలులు వీచాయి. దీంతో అనేకచోట్ల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, నాగర్‌కర్నూల్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఉమ్మడి నల్లగొండ, సిద్దిపేట, వికారాబాద్ తదితర జిల్లాల్లో గాలివాన హడలెత్తించింది. వేర్వేరు ఘటనల్లో మొత్తం 13 మంది మృత్యువాత పడ్డారు. ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలోనే ఏడుగురు మరణించారు. మరోవైపు తగ్గేదేలే అన్నట్టు పలు ప్రాంతాల్లో ఎండలు మండిపోయాయి. 45 డిగ్రీ సెల్సియస్‌కు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం

నాగర్‌కర్నూల్ జిల్లాలో అకాల వర్షాలు పెను విషాదం నింపాయి. ఆదివారం సాయంత్రం వేర్వేరు ఘటనల్లో ఏడుగురు మృతి చెందారు. తాడూరుకు చెందిన రైతు బెల్లె మల్లేష్ (38) గ్రామ శివారులోని తన సొంత పొలంలో రేకుల షెడ్ నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం మల్లేష్, పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లికి చెందిన కూలీలు చెన్నమ్మ (45), రాములు (53) షెడ్‌పై పని చేస్తుండగా ఈదురుగాలులతో కూడిన వర్షానికి షెడ్ ఒక్కసారిగా కుప్ప కూలిపోయింది. దీంతో ఈ ముగ్గురు, అదే సమయంలో తండ్రి వద్దకు వచ్చిన మల్లేష్ కూతురు అనూష (12) అక్కడికక్కడే చనిపోయారు. అక్కడే పనిచేస్తున్న మరో నలుగురు.. చిన్న నాగులు, పార్వతమ్మ, బి.రాజు, రాజు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అయితే పార్వతమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మరోవైపు నాగర్‌కర్నూల్ మండలంలోని మంతటి గేట్ వద్ద ఈదురుగాలుల ప్రభావంతో రేకుల షెడ్‌పై ఉన్న రాయి వచ్చి వికారాబాద్ జిల్లా బషీర్‌బాగ్ మండలం నలవెల్లి గ్రామానికి చెందిన క్రూజర్ వాహన డ్రైవర్ వేణుగోపాల్ (38)కు తగలడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వేణుగోపాల్ కిరాయికి శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఇక ఇదే జిల్లాలోని తెలకపల్లికి చెందిన దండు లక్ష్మణ్ (12), మారేపల్లికి చెందిన వెంకటయ్య (52) పొలంలో పిడుగుపాట్లకు గురై మరణించారు. ఇలావుండగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామంలో శనివారం రాత్రి ఎడ్ల బండిపై పిడుగు పడింది. ఈ ఘటనలో రెండు దుక్కిటెడ్లు మృతిచెందగా రైతు ఎల్కరి సత్తన్నకు గాయాలయ్యాయి.

ఇద్దరు మిత్రుల విషాదాంతం

మేడ్చల్ జిల్లా కీసరలో ఈదురుగాలులకు భారీ వృక్షం విరిగి మోటార్ సైకిల్‌పై పడటంతో దానిపై ఉన్న యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన నాగిరెడ్డి రాంరెడ్డి (60), అదే మండలంలోని దన్‌రెడ్డిగూడెంలో ఉంటున్న ఏపీలోని తూర్పు గోదావరిజిల్లాకు చెందిన ధనుంజయ్ (46) అనే ఇద్దరు స్నేహితులు మరణించారు. శామీర్‌పేటలో ఉన్న తమకు తెలిసిన వారికి మామిడికాయలు ఇచ్చేందుకు వెళ్తుండగా..కీసర మండలం తిమ్మాయిపల్లి గ్రామ సమీపంలో ఈ దుర్ఘటన జరిగినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

గోడలు కూలి బాలుడు, వ్యాపారి మృతి

హైదరాబాద్‌లోని మియాపూర్, ఓల్డ్ హాఫిజ్‌పేట సాయినగర్‌లో ఆదివారం గాలివానకు గోడ కూలి పడటంతో అబ్దుల్ సమద్ (3) మృతి చెందాడు. డ్రై క్లీనింగ్ చేయడంతో పాటు రోడ్ల ప్రక్కన దుస్తులను అమ్ముకుంటూ జీవించే యూపీకి చెందిన నసీముద్దీన్ కనోదియా, షబానా దంపతుల కుమారుడు సమద్ ఆదివారం సాయంత్రం రేకుల గదిలో నిద్రిస్తుండగా, పక్కనే ఉన్న రఫీయుద్దీన్ బిల్డింగ్‌పై నుండి ఇటుక గోడకూలి రేకులపై పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సమద్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. మరో ఘటనలో ఓ భవనం పై నుండి ఇటుక గోడకూలి ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యాపారి రషీద్ (45)పై పడటంతో తీవ్రంగా గాయపడిన అతను స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ దుర్ఘటన కూడా ఆదివారం మియాపూర్ ఓల్డ్ హాఫిజ్‌పేటలోని సాయినగర్ కాలనీలోనే చోటు చేసుకుంది. నగరంలోని ఎల్‌బీనగర్, వనస్థలిపురం, ఉప్పల్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో కూడా గాలివాన బీభత్సం సృష్టించింది. హయత్‌నగర్ ఆర్టీసీ డిపోలో పెద్ద వృక్షం కూలిపడటంతో బస్సు ధ్వంసమైంది.

కోళ్లఫారం గోడ కూలి ఇద్దరు మృతి

సిద్దిపేట జిల్లా ములుగు మండలం క్షీరసాగర్‌లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి కోళ్ల ఫారం గోడకూలడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. తూప్రాన్ మండలం ఘన్‌పూర్‌కు చెందిన గంగ గౌరిశంకర్ (30), గంగ మాధవి, విభూతి శ్వేత, ఇంద్రజ, చంద్రిక, చంద్రాయణగుట్టకు చెందిన భాగ్యమ్మ(40) క్షీరసాగర్ గ్రామంలోని శ్రీనివాస్ ఇంటికి చుట్టం చూపుగా వచ్చారు. అంతా కలిసి సరదాగా పొలంలోని బావి వద్దకు వెళ్లారు. తిరిగి వస్తుండగా వర్షం కురవడంతో తల దాచుకునేందుకు దారిలో ఉన్న ఓ కోళ్ల ఫారం వద్దకు వెళ్లారు. గాలుల ధాటికి ఫారం గోడ కూలి వీరిపై పడింది. ఈ ఘటనలో గంగ గౌరిశంకర్, భాగ్యమ్మ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో నలుగురు మాధవి, శ్వేత, ఇంద్రజ, చంద్రిక తీవ్రంగా గాయపడ్డారు.



ఆదివారం సాయంత్రం జరిగిన గాలివాన బీభత్సానికి హయత్‌నగర్ ఆర్టీసీ బస్ డిపోలో చెట్టు కూలి ఆర్టీసీ బస్సు ధ్వంసం అయిన దృశ్యం



రాములు (ఫైల్)



మహమ్మద్ అబ్దుల్ సమద్



అనూష (ఫైల్)



వేణుగోపాల్ (ఫైల్)



బెల్లె మల్లేష్ (ఫైల్)



లక్ష్మణ్ (ఫైల్)



వెంకటయ్య (ఫైల్)



రషీద్ (ఫైల్)

అంతర్రాష్ట్ర రహదారిపై రాకపోకలకు అంతరాయం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో రుద్రూర్, బాన్సువాడ, బీర్కూర్ మండలాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. రుద్రూర్‌లో కారుపై, అంబం శివారులో ఆటో, రెండు బైకులపై చెట్లు విరిగిపడ్డాయి. బాన్సువాడలోని కల్కి చెరువు కట్టపై ఉన్న హైమాస్ట్ విద్యుత్ స్తంభంతో పాటు పలు కరెంటు స్తంభాలు పడిపోయాయి. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పలు గ్రామాల్లో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. హస్నాపూర్ గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై భారీ వృక్షం పడిపోవడంతో 3 గంటల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు ఇళ్లు, కోళ్ల ఫారాల రేకులు లేచిపోయాయి. కరెంట్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. ధర్మారెడ్డిపల్లి గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో కాంటా చేసిన వెయ్యి బస్తాల ధాన్యం పాక్షికంగా తడిసింది. కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లిలో పిడుగుపాటుకు 2 గడ్డివాములు దగ్ధమయ్యాయి. వికారాబాద్ జిల్లాలో గాలివానకు పలు ప్రాంతాల్లో రహదారులు, ఇళ్లపై చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. పరిగి మండల పరిధి రూప్‌సింగ్ తండాలో పిడుగుపాటుకు ఓ ఎద్దు మృత్యువాత పడింది.

రెండ్రోజులు మరింత వేడి

▶ మొదటి పేజీ తరువాయి

అర్లిలో 45.2 డిగ్రీ సెల్సియస్ చొప్పున నమోదయ్యాయి. ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్టంగా ఆదిలాబాద్‌లో 44.8 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత, కనిష్టంగా నల్లగొండలో 25.4 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయ్యాయి. రాష్ట్రానికి పశ్చిమ, వాయవ్య దిశల నుంచి బలమైన గాలులు వీస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 డిగ్రీ సెల్సియస్ నుంచి 3 డిగ్రీ సెల్సియస్ మేర అధికంగా నమోదవుతాయని హెచ్చరించింది.

ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
ఆదిలాబాద్	44.8
భద్రాచలం	39.0
దుండిగల్	40.0
హకీంపేట్	39.8
హనుమకొండ	40.0
హైదరాబాద్	40.2
ఖమ్మం	41.0
మహబూబ్‌నగర్	40.9
మెదక్	41.2
నల్లగొండ	40.5
నిజామాబాద్	42.3
రామగుండం	42.0



అంతర్రాష్ట్ర రోడ్డుపై విరిగిపడిన భారీ వృక్షం

క్లుప్తంగా...

రూ.30 కోట్లతో ఎమ్మెల్సీ ఓట్ల కొనుగోలు

- ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ అక్రమాలు
- సీఈసీకి రఘునందన్ రావు ఫిర్యాదు



తూప్రాన్ (మెదక్ జిల్లా)/హైదరాబాద్: ఖమ్మం -వరంగల్-నల్లగొండ పట్టభద్రుల ఎన్నికల్లో ఓట్ల కొనుగోలుకు బీఆర్ఎస్ పార్టీ రూ.30 కోట్లు వెచ్చించిందని బీజేపీ నేత రఘునందన్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఢిల్లీలోని ముఖ్య ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారిక బ్యాంకు ఖాతా ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా (నంబర్ 26610100002075) నుంచి.. బీఆర్ఎస్ ఇన్‌చార్జిలుగా ఉన్న 34 మంది మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ జెడ్పీటీసీలకు రూ.30 కోట్లు బదిలీ చేశారని ఆరోపించారు. ప్రతి ఓటుకు రూ.500 పంపిణీ చేసేలా ఈ డబ్బును 24, 25 తేదీల్లో బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. అంతకుముందు మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన రఘునందన్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓట్ల కొనుగోలుకు బీఆర్ఎస్ డబ్బు బదిలీ చేసినట్టు తన వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి వికాస్‌రాజ్‌కు ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

బాలారెడ్డికి శంకర రత్న పురస్కారం



సాక్షి, హైదరాబాద్: అమెరికాకు చెందిన ఇంజనీర్ బాలారెడ్డి ఇందుర్తికి శంకర నేత్రాలయ సంస్థ శంకర రత్న–2023 పురస్కారాన్ని ప్రదానం చేసింది. భారతదేశంలోని మారుమూల పల్లెల్లో వెనుకబడిన వర్గాల ప్రజలకు నేత్ర వైద్య సేవలను అందించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు ఆయనను ఈ పురస్కారం వరించింది. నాగర్‌కర్నూలు జిల్లా వంగూరు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన బాలారెడ్డి, అమెరికాకు చెందిన శంకర నేత్రాలయ సౌజన్యంతో ఇటీవల పది రోజుల పాటు నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శంకర నేత్రాలయ ప్రతిపాదిత 'మొబైల్ ఐ సర్జికల్ యూనిట్'లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. తెలంగాణ రోడ్లు భవనాల శాఖ ఈఎన్‌సీ గణపతిరెడ్డి సోదరుడైన బాలారెడ్డి తన కుటుంబ సభ్యుల సహకారంతో ఈ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

మల్లన్నకు బీసీల మద్దతు

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు బీసీ సంఘాలు మద్దతు తెలుపుతున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీ వర్గానికి చెందిన తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

'పౌరసరఫరాల శాఖలో అక్రమాలు వాస్తవం'

సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల శాఖలో ఎలాంటి అవకతవకలు జరగలేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పినవన్నీ ఉత్తి మాటలేనని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆ శాఖలో వందల కోట్ల స్కాం జరగడం వాస్తవమేనని, పూర్తి వివరాలు సోమవారం వెల్లడిస్తానని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధారాలతో సహా తాను ప్రశ్నించిన 19 అంశాలకు సమాధానం చెప్పకుండా దాటవేయడంతోనే.. మంత్రి డొల్లతనం బయటపడిందని ఏలేటి పేర్కొన్నారు.

పట్టభద్రుల పట్టమెవరికి ?

- బరిలో 52 మంది ఉన్నా... ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ
- నేడు వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక బరిలో 52 మంది ఉన్నా, ప్రధానపోటీ మాత్రం ముగ్గురి మధ్యే నెలకొంది. ఈ ఎన్నికలో ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీలతోపాటు కొందరు స్వతంత్రులు పెద్దఎత్తున ప్రచారం చేశారు. సోమవారం పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. వారి తరఫున ఆయా పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహించాయి. తమకు మద్దతు ఇవ్వాలని వాయిస్ కాల్స్ ద్వారా ఆయా పార్టీల అధినేతలతోపాటు అభ్యర్థులు పట్టభద్రులను కోరారు. మిగతా గుర్తింపు పొందిన పార్టీలతోపాటు స్వతంత్రులు పోటీలో ఉన్నా, ప్రధాన పార్టీలకు పోటీగా ప్రచారం చేయలేకపోయారు.

నిరుద్యోగులకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందంటూ కాంగ్రెస్

నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా, నియామకాల విషయంలో సరైన నిర్ణయాలు తీసుకోలేదని, నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని, ఉద్యోగులది అదే పరిస్థితి అంటూ కాంగ్రెస్ ఆరోపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీలు అమలు చేయడంతోపాటు ఎన్నికల తర్వాత పాలనలో పారదర్శకత, ఉద్యోగ కల్పన, జాబ్ క్యాలెండర్ తీసుకొచ్చి ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెబుతోంది. ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, తమ పార్టీ అభ్యర్థిని గెలిపించడం ద్వారా ప్రభుత్వానికి మద్దతు ఇస్తే ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని చెబుతూ ప్రజల్లోకి వెళ్లింది.



నల్లగొండ పట్టణంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

కాంగ్రెస్ మోసం చేసిందంటున్న బీఆర్ఎస్

ఆరు గ్యారంటీలతోపాటు ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులతోపాటు ఉద్యోగులను కూడా మోసం చేసిందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. జాబ్ క్యాలెండర్ లేదని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి చేయలేదని, తమ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ల ఉద్యోగాలను తాము భర్తీ చేశామని కాంగ్రెస్ చెబుతూ మోసం చేస్తోందని ఆరోపిస్తోంది. ఉద్యోగాలకు ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చిందో ఎప్పుడు పరీక్షలు పెట్టిందో కాంగ్రెస్ పార్టీ చెప్పాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈ ఎన్నికలో పట్టభద్రులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే పెద్దలసభలో ప్రభుత్వంపై పోరాడి ఉద్యోగాల కల్పనకు జాబ్‌క్యాలెండర్ ప్రకటించేలా ఒత్తిడి తెస్తామని, పోరాడే పార్టీకి పట్టం కట్టాలంటూ పట్టభద్రులకు బీఆర్ఎస్ విజ్ఞప్తి చేస్తోంది.

రెండూ మోసకారి పార్టీలే అంటున్న బీజేపీ

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ మోసకారి పార్టీలేనని, వాటి వల్ల నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని బీజేపీ ఆరోపిస్తోంది. నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ వాటిని విస్మరించి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుందని, ఆరు గ్యారంటీలతోపాటు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ కంటే అధికంగా అబద్ధాలు చెబుతూ మోసం చేస్తోందని బీజేపీ అంటోంది. నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగాల నియామకంలో బీఆర్ఎస్ విఫలం కాగా, కాంగ్రెస్ పార్టీ నోటిఫికేషన్ ఇవ్వకుండా, పరీక్షలు నిర్వహించకుండా 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధపు మాటలతో ప్రజలు, పట్టభద్రులను మోసం చేస్తోందని ప్రచారంలో ఆరోపణలు గుప్పించింది. ఇలాంటి పార్టీలకు బుద్ధిచెప్పి బీజేపీకి మద్దతు ఇస్తే నిరుద్యోగుల తరఫున పోరాడుతామని పట్టభద్రులకు బీజేపీ విజ్ఞప్తి చేసింది. మొత్తానికి త్రిముఖ పోటీలో పట్టభద్రులు ఎవరికి పట్టం కడతారో మరికొద్ది రోజుల్లో తేలనుంది.

పోలింగ్‌లో టాప్!

▶ మొదటి పేజీ తరువాయి

ఓట్లు ఎవరికి లాభం చేకూరుస్తాయి? ఎవరికి నష్టం చేకూరుస్తాయన్నది కూడా మరింత ఆసక్తికరంగా మారింది. మహిళల ఓట్లు ఎక్కువగా పెరిగాయన్న ఎస్‌బీఐ అధ్యయనం బట్టి ఈసారి మహిళా ఓటర్లు రాజకీయ పార్టీల తలరాతలను మార్చడంలో కీలకపాత్ర పోషించనున్నారని అర్థమవుతోంది. కొత్తగా ఓట్లు నమోదు చేసుకున్న వారిలో ఎందరు ఓటేశారు? పెరిగిన ఓట్లలో వారి శాతం ఎంత? పాత ఓటర్లలో ఎందరు ఓటేశారు? పెరిగిన ఓట్లలో వారి శాతం ఎంత? మహిళల్లో కొత్త ఓటర్లు ఎక్కువగా ఓటేశారా లేక పాత ఓటర్లే పోటెత్తారా? ఈ ట్రెండ్స్ ఎవరిని విజయతీరాలను చేరుస్తాయన్నది బ్యాలెట్ బాక్సులు తెరిస్తేనే తేలనుంది.

మల్కాజిగిరిలో చూస్తే!: 2019 లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీ స్థానం పరిధిలో 15,63,063 ఓట్లు పోలవగా ఈసారి 19,19,131 ఓట్లు పోలయ్యాయి. అయితే 2019లో ఈ నియోజకవర్గంలో మొత్తం 31,49,710 మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఈ ఏడాది ఓటర్ల సంఖ్య 37,79,596కు పెరిగింది. అంటే 6.3 లక్షల మంది కొత్త ఓటర్లు నమోదు చేసుకున్నారు. ఈ లెక్కన 2024లో పోలైన 50.78 శాతం ఓట్ల లెక్క ప్రకారం దాదాపు 3.2 లక్షల ఓట్లు ఎక్కువ రావాలి. కానీ 3.56 లక్ష ఓట్లు అధికంగా పోలయ్యాయి. అంటే ఈ పెరుగుదల ప్రస్తుత పోలింగ్ శాతం కంటే ఎక్కువ ఉందన్నమాట. అయితే కొత్తగా ఓట్లు నమోదు చేసుకున్న వారి నుంచే ఈ ఎక్కువ పోలింగ్ జరిగిందా? పాత ఓటర్లు పెరిగారా? పెరిగిన ఓటర్లలో పురుషులు ఎంతమంది? మహిళలు ఎంతమంది? అనేది కూడా ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముంది.

ఎస్‌బీఐ అధ్యయనంలో వెల్లడైన అంశాలు

- నాలుగు దశల్లో కలిపి 2019లో 21.95 కోట్ల మంది పురుషులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోగా 2024లో 22.80 కోట్ల మంది ఓటేశారు. 2019లో 20.59 కోట్ల మంది మహిళలు ఓటేయగా 2024లో 21.53 కోట్ల మంది ఓటేశారు. అంటే 85 లక్షల మంది పురుషులు ఈసారి ఓటు హక్కు ఎక్కువ వినియోగించుకోగా మహిళా ఓటర్ల సంఖ్య మాత్రం 94 లక్షలు పెరిగింది.
- 2019తో పోలిస్తే తొలి నాలుగు దశల్లో 2024లో పోలింగ్ శాతం తగ్గింది. 2019లో తొలి నాలుగు దశల సగటు పోలింగ్ 68.15 శాతంకాగా 2024లో అది 66.95 శాతంగా నమోదైంది. అదేంటి.. పోలింగ్ శాతం తగ్గితే ఓటర్ల సంఖ్య కూడా తగ్గాలని అనుకుంటున్నారా? 2019తో పోలిస్తే 2024లో ఓటర్ల సంఖ్య పెరిగినందున గతం కంటే పోలింగ్ శాతం తగ్గినా ఓటర్ల సంఖ్య పెరిగింది.
- 90 శాతం నియోజకవర్గాల్లో 2019లో పోలైన ఓట్ల సంఖ్యతో సమానంగా లేదంటే అంతకంటే ఎక్కువ ఓట్లు 2024లో పోలయ్యాయి. 181 పార్లమెంటు స్థానాల్లో 50 వేల కంటే ఎక్కువ ఓట్లు పోలవగా 156 చోట్ల 50 వేల లోపు ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. కేవలం 36 నియోజకవర్గాల్లో 50 వేల కంటే తక్కువ ఓట్లు నమోదయ్యాయి.

ఎస్‌బీఐ అధ్యయనం ప్రకారం తెలంగాణలో పోలింగ్ పెరిగిన లోక్‌సభ స్థానాలు

లోక్‌సభ స్థానం	2019తో పోలిస్తే పోలైన ఎక్కువ ఓట్లు (లక్షల్లో)
చేవెళ్ల	3.6
మల్కాజిగిరి	3.6
మహబూబ్‌నగర్	2.3
మెదక్	2.2
నాగర్‌కర్నూల్	2.2
హైదరాబాద్	2.0
వరంగల్	2.0
జహీరాబాద్	1.8
భువనగిరి	1.8

ఎస్‌బీఐ అధ్యయనం ప్రకారం వివిధ రాష్ట్రాల్లో పెరిగిన ఓటర్ల వివరాలు (లక్షల్లో)

రాష్ట్రం	2019	2024	పెరిగింది	శాతం
కర్ణాటక	351.1	386.6	35.5	10.1%
తెలంగాణ	186.3	218.1	31.9	17.1%
మహారాష్ట్ర	410.0	430.0	20.0	4.9%
ఛత్తీస్‌గఢ్	136.1	150.4	14.3	10.5
అసోం	84.6	96.2	11.6	13.7%

నేటి నుంచి 'మేడిగడ్డ' బొరియల్లో గ్రౌటింగ్

- యంత్రాలను సిద్ధం చేసిన నిర్మాణ సంస్థ



7వ బ్లాక్ వద్ద కాంక్రీటు నింపే యంత్రం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ(లక్ష్మీ)బ్యారేజీలో ఏర్పడ్డ బొరియల్లో గ్రౌటింగ్ పనులు చేసేందుకు ప్రత్యేక యంత్రాలను నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసింది. గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల ద్వారా 7వ బ్లాక్‌లో మాత్రమే బొరియలు ఏర్పడినట్లు నిర్మాణ సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీనికోసం డ్రెడ్జర్ యంత్రాలను బ్లాక్ 7లో ఏర్పాటు చేశారు. 19, 20, 21 గేట్ల సమీపంలో ఏర్పడిన బొరియల్లో సోమవారం నుంచి కాంక్రీటు, ఇసుక మిశ్రమాన్ని నింపడానికి అన్నీ సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే బొరియల్లో మట్టిని నింపి నిషేధిత ప్రాంతంగా సైన్ బోర్డులు పెట్టారు. గేట్ల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేశారు. 7వ బ్లాక్‌లో మొరాయించిన గేట్లను ఆర్మ్ గ్రౌగింగ్ పరికరంతో కట్ చేసి తొలగిస్తున్నారు. అదే విధంగా ఆ బ్లాక్‌లోని పియర్‌ల దిగువన 10మీటర్ల లోతు వరకు ఇసుక వరద తాకిడికి తరలిపోకుండా షీట్‌పైల్స్ వేయడానికి ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సీసీ బ్లాక్ పనులు, ఇసుక మేటల తొలగింపు చేపట్టారు.

ఔషధాల కన్నా.. అవగాహన మిన్న

- డయాబెటిస్ ఎక్స్‌పోలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ



ప్రొఫెసర్ బీకే సహాయ్‌కు పురస్కారం అందజేస్తున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఔషధాలు మాత్రమే కాదు.. అవగాహన కూడా పెంచుకోవాలని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సూచించారు. మధుమేహంపై అవగాహన పెంచే ఉద్దేశంతో మోహన్ డయాబెటిక్ సెంటర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జేఆర్‌సీ సెంటర్‌లో ఆదివారం డయాబెటిస్ ఎక్స్‌పో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమణ మాట్లాడుతూ తనకు డయాబెటిస్ వచ్చిన తొలిరోజుల్లో వ్యాధి నియంత్రణ గురించి వైద్యులు కల్పించిన అవగాహన ఎంత ముఖ్యమైనదో..తర్వాత తనకు అర్థమైందన్నారు. ఈ మధ్య కొందరు డయాబెటిస్ రివర్స్ చేస్తామంటున్నారని, అయితే అది అసాధ్యమని అభిప్రాయపడ్డారు అవగాహనతోనే దీనికి అడ్డుకట్ట వేయగలమని, రోగి మాత్రమే కాకుండా రోగి కుటుంబసభ్యులు కూడా ఈ వ్యాధి పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మోహన్ డయాబెటిక్ సెంటర్ నిర్వాహకుడు డా.మోహన్ తమకు సీనియర్ అని, అప్పట్లోనే రీసెర్చ్ పేపర్లు రాసేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలు తమకు స్ఫూర్తిని ఇచ్చాయన్నారు. రెడ్డీస్ లేబరేటరీస్ చైర్మన్ డా.కె.సతీష్ రెడ్డి మాట్లాడుతూ జెనటిక్ పరీక్షల ద్వారా డయాబెటిస్ వస్తుందో రాదో తెలుసుకోవచ్చునన్నారు. మోహన్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ చైర్మన్ డాక్టర్ వి.మోహన్ మాట్లాడుతూ ఐసీఎంఆర్ అధ్యయనం ప్రకారం తెలంగాణలో పట్టణ ప్రాంతాల్లో 12.3 శాతం మందికి, గ్రామీణ ప్రాంతాల్లో 6.1% మంది డయాబెటిక్ బాధితులున్నట్టు తేలిందన్నారు. గతంలో తాము చేసిన అధ్యయనంలో హైదరాబాద్ డయాబెటిక్ క్యాపిటల్‌గా మారిందని చెప్పామని, ప్రస్తుతం తాము అంచనా వేసిన దానికన్నా బాధితుల సంఖ్య ఎక్కువే ఉంటుందని భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉచిత కన్సల్టేషన్, పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా వైద్య కళాశాల మాజీ ప్రొఫెసర్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ బి.కె..సహాయ్‌కు జీవితసాఫల్య పురస్కారం అందించారు.

రవ్వా శ్రీహరి పేరిట పరిషత్ ఏర్పాటు అభినందనీయం

- పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి



ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో శలాక రఘునాథశర్మకు జీవన సాఫల్య పురస్కారం అందజేస్తున్న జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి

నాంపల్లి(హైదరాబాద్): విద్య..వినయం..సంస్కారం మూర్తీభవించిన మహనీయుడు ఆచార్య రవ్వా శ్రీహరి అని పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అన్నారు. ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారాల ప్రదానోత్సవ సభ జరిగింది. శ్రీహరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన పేరిట ప్రత్యేకంగా ఒక పరిషత్‌ను నెలకొల్పి, సంస్కృతభాష సాహిత్య పరిశోధన రంగంలో విశేషంగా కృషి చేసిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు, ప్రముఖ సంస్కృత పండితుడు శలాక రఘునాథశర్మ, తెలుగు సాహిత్య పరిశోధకుడు డాక్టర్ నలిమెల భాస్కర్‌లకు ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారాలను అందజేశారు. ఒక్కొక్కరికి రూ.50 వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. సంస్కృత అధ్యయనంలో ప్రతిభ కనబరిచిన పది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,116 నగదు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి మాట్లాడుతూ భాష పట్ల ఆదరణ పెరగాలని ఆకాంక్షించారు. భాష, సాహిత్యాల వికాసానికి రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్ర పరిషత్ మంచి వేదిక కావాలని, ముందుందు మంచి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం ఆచార్య రవ్వా శ్రీహరి రచించిన 'ఆంధ్రపద నిధానం'గ్రంథావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ వెల్చాల కొండలరావు, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయ సంస్కృత శాఖ పూర్వ అధ్యక్షులు ఎ.రాములు, సాహిత్య పరిశోధకుడు డాక్టర్ శ్రీరంగాచార్య, రవ్వా శ్రీహరి కుమారుడు ఆచార్య రవ్వా రమేష్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్ర సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్ పాండయ్య పాల్గొన్నారు.

'పౌర సరఫరా'లో రూ.1,000 కోట్ల స్కాం!

▶ మొదటి పేజీ తరువాయి

మీడియా సమావేశంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, పార్టీ నేతలు శంభీపూర్ రాజు, పెద్ది సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులతో కలిసి కేటీఆర్ మాట్లాడారు.

4 కంపెనీలకే టెండర్లు వచ్చేలా చేశారు..

'బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2022–23 యాసంగిలో రైతుల నుంచి సేకరించి మిల్లర్ల దగ్గర నిల్వ ఉంచిన 35 ఎల్ఎంటీల ధాన్యాన్ని విక్రయించేందుకు 3 నెలల కిందట రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ గ్లోబల్ టెండర్ల కహానీకి తెరలేపింది. అధికారంలోకి వచ్చి 50 రోజులైనా కాకముందే ఈ దోపిడీకి తెరలేపి జనవరి 25 న కమిటీ వేసి, మార్గదర్శకాలు జారీ చేశారు. క్వింటాలుకు రూ.2,100 చొప్పున కొనుగోలు చేయానికి రైస్ మిల్లర్లు ముందుకు వచ్చినప్పటికీ తిరస్కరించి గ్లోబల్ టెండర్లు పిలిచారు. ప్రత్యేక నిబంధనలతో కేవలం 4 కంపెనీలకే టెండర్లు వచ్చేలా చేశారు. కేంద్రీయ భండార్, ఎల్జీ ఇండస్ట్రీస్, హిందూస్తాన్ కంపెనీ, నాకాఫ్ అనే 4 సంస్థలు బిడ్లను దక్కించుకున్నాయి. గురుకులాల్లో కాంట్రాక్ట్ దక్కించుకున్న తర్వాత సరిగ్గా పనిచేయనందుకు కేంద్రీయ భండార్‌ను 2023లో గత ప్రభుత్వం బ్లాక్ లిస్ట్ చేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సంస్థ కోసం నిబంధనలు సడలించింది..'అని కేటీఆర్ విమర్శించారు.

అదనంగా వసూళ్లు

'మిల్లర్లు క్వింటాలు రూ.2,100కు కొంటామన్నప్పటికీ సగటున రూ.200 తగ్గించి రూ.1,885–రూ.2,007 మధ్య ఆ 4 సంస్థలు కొనేలా ఒప్పందం చేశారు. టెండర్ మార్గదర్శకాల ప్రకారం 90 రోజుల్లో 35 ఎల్ఎంటీల ధాన్యాన్ని తీసుకుని ప్రభుత్వానికి రూ.7,500 కోట్లు చెల్లించాలి. మిల్లర్లతో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు చేయకూడదు. కానీ మిల్లర్లతో ఆయా సంస్థలు నేరుగా ఆర్థిక లావాదేవీలు చేస్తూ మనీలాండరింగ్‌కు పాల్పడ్డాయి. గోదాముల్లోని ధాన్యాన్ని తీసుకుపోకుండా రైస్ మిల్లర్లపై బెదిరింపులకు పాల్పడ్డాయి. టెండర్లు వేసిన మొత్తానికి కాకుండా అదనంగా చెల్లించాలంటూ రాష్ట్రంలోని 4 వేల మంది రైస్ మిల్లర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. 'సీఎం పేషీకి ఖర్చయ్యింది.. ఢిల్లీకి పోవాలి.. పార్లమెంటు ఎన్నికలు'అంటూ క్వింటాలుకు రూ.150 నుంచి రూ.236 అదనంగా చెల్లించి తీరాలని ఒత్తిడి చేస్తున్నారు. క్వింటాలుకు రూ.236 ఎక్కువగా ఇస్తే ధాన్యం లిఫ్ట్ చేయకపోయినా చేసినట్టు క్లియరెన్స్ ఇస్తామంటూ బంపరాఫర్ కూడా ఇచ్చారు. ఈ మేరకు జలసౌధలో అనధికారికంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. దాదాపు 35 ఎల్ఎంటీలకుగాను కింటా లుకు రూ.200 చొప్పున రూ. 700 కోట్ల అదనపు డబ్బు మనీలాండరింగ్ ద్వారా మిల్లర్ల దగ్గర వసూలు చేస్తున్నారు. మరోవైపు ధాన్యం లిఫ్ట్ చేసేందుకు గడువు ఈ నెల 23తో అయిపోయింది. ఇప్పటికీ 20 శాతం కూడా లిఫ్ట్ చేయలేదు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి. కానీ తమకు రావాల్సిన రూ.700 కోట్లు మొత్తం వాళ్ల చేతికి రాలేదు కాబట్టి ఈ డెడ్‌లైన్ పెంచే ప్రయత్నం చేస్తున్నారు..'అని కేటీఆర్ ఆరోపించారు.

సన్న బియ్యం పేరిట మరో స్కాం

'రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకానికి 2.20 ఎల్ఎంటీల సన్న బియ్యం కావాలి. వీటి కోసం కూడా పౌరసరఫరాల శాఖ గ్లోబల్ టెండర్ పిలిచింది. ఇందులో కూడా అవే నాలుగు కంపెనీలు పాల్గొన్నాయి. బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం ధర కిలో రూ.42–45 ఉంది. కానీ బహిరంగ మార్కెట్, మిల్లర్లను పక్కనబెట్టి టెండర్లు పిలిచారు. కిలోకు రూ.15 అదనంగా అంటే రూ.57కు టెండర్ ఖరారు చేశారు. 2.20 ఎల్ఎంటీలకు కిలోకు అదనంగా రూ.15 చొప్పున రూ. 300 కోట్ల స్కామ్ జరిగింది. ఇలా మొత్తంగా రూ. 1,000–1,100 కోట్ల స్కామ్ జరిగింది..'అని కేటీఆర్ వివరించారు. 'మా ప్రభుత్వం హయాంలో కొనుగోలు చేసిన దాంట్లో 1.6 ఎల్ఎంటీల సన్న ధాన్యం ఉంది. దాన్ని మిల్లింగ్ చేసి విద్యాశాఖకు ఇస్తే.. కేవలం 60 వేల టన్నులే కొనాల్సి వచ్చేది. కానీ 1.6 ఎల్ఎంటీల సన్న ధాన్యం కిలో రూ.22.59 పైసలకు అమ్మేశారు..' అని విమర్శించారు.

గింజ సన్నబియ్యం కొనలేదు.. | పైసా ఖర్చు చేయలేదు

▶ మొదటి పేజీ తరువాయి

ఉందని వ్యాఖ్యానించారు. ఆదివారం గాంధీభవన్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఏ.లక్ష్మణ్, సంజీవరెడ్డి, టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. రూ.30 రూపాయలకు కిలో ఉన్న సన్నబియ్యాన్ని ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని కేటీఆర్ మాట్లాడుతున్నాడని, సన్నబియ్యం రూ.42కు కిలో చొప్పున ఎంత స్టాక్ ఉన్నా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఆమేరకు సమాచారం ఉంటే ఇవ్వాలని కేటీఆర్‌కు సూచించారు. పౌరసరఫరాల శాఖలో రూ.వెయ్యికోట్ల స్కామ్ జరిగిందంటూ చేస్తున్న మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదని, సత్యదూరమైన వ్యాఖ్యలతో ప్రజల్లో లేనిపోని అనుమానాలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.58వేల కోట్ల అప్పుల భారం మోపిందని, రైస్‌మిల్లర్ల వద్ద ఎలాంటి సెక్యూరిటీ లేకుండా రూ.11వేల కోట్ల బియ్యం పెట్టిందని, వాస్తవానికి ఆ స్టాకు ఎక్కడుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని చెప్పారు. అత్యంత పారదర్శకంగా పాలన సాగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తోందని, తాము మిల్లర్ల దగ్గర బేరాలు, వసూళ్లకు పాల్పడే రకం కాదని స్పష్టం చేశారు. కొంతమంది మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరించామని, కొన్నింటిని డిఫాల్టర్ జాబితాలో చేర్చామని, మరికొన్ని యాజమాన్యాలను అరెస్టు చేశామన్నారు. అరెస్టులు చేసి వేధించే విధానం తమ ప్రభుత్వానికి లేదని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. కేంద్రీయ బండార్‌ను బ్లాక్ లిస్టులో పెట్టింది..ఆ తర్వాత తొలగించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విషయంలో ఏమాత్రం సంబంధం లేదన్నారు. సరైన అవగాహనతో కేటీఆర్ మాట్లాడాలని హితువు పలికారు. బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డిఅధిష్టానం వద్ద మంచి మార్కులు కొట్టేసేందుకు ఓవర్‌స్పీడుతో అర్థం లేకుండా మాట్లాడడం సరికాదని సూచించారు. బాధ్యతతో మాట్లాడాలని, ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోనని హెచ్చరించారు. ఢిల్లీలో డబ్బులు ఇచ్చి ఫ్లోర్‌లీడర్ పదవి తెచ్చుకున్నాడేమో...అందుకే దూకుడుతో ఉన్నాడని వ్యాఖ్యానించారు. డీఫాల్టర్ అయిన రైస్ మిల్లుల తరఫున బీఆర్ఎస్, బీజేపీ పోటాపోటీగా మాట్లాడుతున్నాయని, దీనిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు.

మార్పు కావాలని ప్రజలు కోరుకున్నారు: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రాష్ట్రంలో మార్పు కావాలని ప్రజలు కోరుకున్నారని, అందుకే కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు రావనే అక్కసుతో ఇష్టానుసారంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వ పనితీరే సమాధానమన్నారు.సూర్యాపేట సభకు అసలు కరెంటు కనెక్షన్ తీసుకోలేదని, జనరేటర్ల ఆధారంగానే ఆపార్టీ నేతలు ఏర్పాటు చేశారన్నారు. కరెంటు తీసుకోనప్పుడు కోతలు ఎలా జరుగుతాయని, అక్కడ సరైన ఏర్పాట్లు చేయకుండా డిస్కంలను బద్నాం చేయొద్దన్నారు. గతేడాది వరంగల్ ఎంజీఎంలో 121 సార్లు పవర్ బ్రేక్‌డౌన్ అయ్యిందని, రోగులను ఎలుకలు పీక్కుతిన్నాయని, వాటిపై మాట్లాడని కేటీఆర్ ఇప్పుడు డయాలసిస్ యూనిట్‌లో విద్యుత్ సమస్యపై మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

– ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ మహేశ్వర్‌రెడ్డి బీజేపీలో చేరగానే ఆ పార్టీ చేసిన తప్పులు, కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రజావ్యతిరేక విధానాలన్నీ ఒప్పులు అయ్యాయా అని ప్రశ్నించారు. పౌరసరఫరాల సంస్థ అప్పులపాలు కావడానికి గత బీఆర్ఎస్, కేంద్ర ప్రభుత్వాలే కారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలల్లోనే రుణమాఫీ చేయనుందని, ఎన్నికల కోడ్ ఉండడంతో జాప్యం జరిగిందని, ఆగస్టు 15లోగా మాఫీ ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

పర్యాటకులను ఆకట్టుకున్న నేచర్‌క్యాంప్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే పర్యావరణ పర్యాటక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రెండు రోజుల నేచర్ క్యాంపు ఆదివారం ముగిసింది. వాన్డేరింగ్ బీ హాలిడేస్ ఆర్గనైజషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సందర్శకులు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా ట్రెక్కింగ్ , క్యాంప్ ఫైర్ నిర్వహించి వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బర్డ్‌వాక్‌లో 17 రకాల పక్షులను తిలకించారు. అడ్వెంచర్స్‌లో భాగంగా రివర్‌క్రాసింగ్, వాలీక్రాసింగ్, క్లైంబింగ్ తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సందర్శకుల స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఇకపై నిరంతరం నేచర్ క్యాంపులు, ట్రెక్కింగ్, బర్డ్ వాచింగ్, అడ్వెంచర్ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రకృతి పర్యాటకానికి పెద్ద పీట వేసి (మద్య నిషేధిత) నేచర్ క్యాంపులను ప్రోత్సాహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎకో టూరిజం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎకో టూరిజం ప్రాజెక్ట్స్ మేనేజర్ కె.సుమన్,వాండేరింగ్ బీ రంఘవేంద్ర ప్రసాద్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, బోటనిస్ట్ డాక్టర్. వీరకిషోర్, నేచురలిస్ట్ లు, శ్రీకాంత్, భాస్కర్, అడ్వెంచర్ ట్రైనర్స్ సంతోష్, నరేష్, బాబు, వెంకటేష్, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



“నేను ఆలోచించటానికి ప్రయత్నిస్తున్నాను. వాస్తవాలతో నన్ను కంగారు పెట్టవద్దు.
– ప్లేటో

సాక్షి
సోమవారం, 27 మే 2024

ఆంగ్ల ఆధ్యాత్మికవాది

ఒక మనిషి ఇంత రాయగలడా అని ఆశ్చర్యానికి గురిచేసే రచయిత జి.కె. చెస్టర్‌టన్. ఇరవయ్యో శతాబ్దపు ఈ సుప్రసిద్ధ ఆంగ్ల రచయితకు ఇది 150వ జయంతి సంవత్సరం. 1874 మే 29న లండన్‌లో జన్మించిన గిల్బర్ట్ కీత్ చెస్టర్‌టన్ నవలలు, కథలు, నాటికలు, కవితలు, సాహిత్య విమర్శ, కళా విమర్శ, చరిత్ర, వ్యాసాలతో సుమారు 80 పుస్తకాలను వెలువరించారు. ‘నెపోలియన్ ఆఫ్ నాటింగ్ హిల్’, ‘ద మ్యాన్ హూ వజ్ థర్స్‌డే’ ఆయన గొప్ప నవలలు. ‘ది ఇల్లస్ట్రేటెడ్ లండన్ న్యూస్’ పత్రికకు ఏకంగా 30 ఏళ్లపాటు; ‘డైలీ న్యూస్’కు 13 ఏళ్లపాటు వీక్లీ కాలమ్స్ రాశారు. మొత్తంగా సుమారు 4,000 వ్యాసాలు! ఆరడుగుల నాలుగు అంగుళాల ఎత్తు, 130 కిలోల బరువుండే ఈ భారీకాయుడు స్టేషన్లలో కూడా రాసేవారు. రాతలో ఎంతగా మునిగిపోయేవాడంటే, ప్రతిసారీ ఎక్కాల్సిన రైలును మిస్సయ్యేవారు. పలు కార్యక్రమాల్లో తలమునకలుగా ఉంటూ, తర్వాత ఏం చేయాలో మరిచిపోయేవారు. ఒకసారైతే, ‘హార్బరో మార్కెట్‌లో ఉన్నాను. నేనెక్కడ ఉండాల్సింది?’ అని భార్యకు టెలిగ్రామ్ పంపారు. భర్త అన్ని వ్యవహారాలనూ చూసుకునే ఫ్రాన్సెస్ ‘ఇంటికి వచ్చెయ్యండి’ అని జవాబిచ్చారు.

‘ఆయన ప్రతిదాని గురించి ఎంతో కొంత, అలాగే దాన్ని అందరికంటే మెరుగ్గా చెప్పారు’ అంటారు చెస్టర్‌టన్ భావజాలాన్ని ప్రచారం చేయడానికి నెలకొల్పిన ‘అమెరికన్ చెస్టర్‌టన్ సొసైటీ’ సహవ్యవస్థాపకుడు డేల్ అహ్లీక్విస్ట్. క్రైస్తవ మతంలోని థీమ్స్, సింబాలిజం చెస్టర్‌టన్ రచనల్లో ఎక్కువగా కనబడతాయి. క్రైస్తవంలోని ప్రేమ, కారుణ్యం వైపు ఎందరినో ఆయన ఆకర్షించారు. నాస్తికుడైన బ్రిటిష్ రచయిత సీ.ఎస్.లూయిస్‌ను తిరిగి క్రైస్తవుడిగా మారేట్టుగా చెస్టర్‌టన్ రచనలే ప్రభావం చూపాయి. సతతం విశ్వాసిగా మసలుకోవడమే కాక, ఎంతోమందిని విశ్వాసం వైపు మళ్లించడం, శత్రువులను కూడా ద్వేషించకపోవడం వంటి అంశాలను చూపుతూ చెస్టర్‌టన్ బీటిఫికేషన్‌కు యోగ్యమైన కారణాలున్నాయని వాదిస్తారు క్యాథలిక్ రచయిత జోసెఫ్ పియర్స్. భిన్న భావజాలానికి చెందిన జార్జ్ బెర్నార్డ్ షా, హెచ్.జి.వెల్స్, బెర్ట్రాండ్ రసెల్ లాంటి రచయితలతో విభేదిస్తూ చెస్టర్‌టన్ తీవ్రమైన వాదాలు జరిపేవారు. అయినా వాళ్ల స్నేహం చెడలేదు. శత్రువును కూడా ప్రేమించమనే భావనే ఆయన్ని అలా మసలుకునేట్టు చేసింది. ఆయన ఈ ప్రేమగుణంలోంచి పుట్టిందే ప్రీస్ట్ డిటెక్టివ్ ‘ఫాదర్ బ్రౌన్’ పాత్ర. శాస్త్రీయ పరిశోధనల ఆధారంగా కేసులను పరిశీలించే షెర్లాక్ హోమ్స్‌లా కాకుండా అనుమానం, ఆధ్యాత్మిక అవగాహనల ఊతంతో నేరస్థుల మనసుల్లోకి చొచ్చుకెళ్లి వారిని పట్టుకుంటాడు ఫాదర్ బ్రౌన్.

చెస్టర్‌టన్ పారిశ్రామికీకరణను వ్యతిరేకించారు. ధార్మిక జీవితాన్ని ప్రవచించారు. ఐరిష్ జాతీయోద్యమానికి ఊతమిచ్చారు. ఐరిష్ ప్రజలు ఇంగ్లిష్‌వారికి భిన్నమైనవారనీ, వారు తమవైన సంప్రదాయాలను కాపాడుకుంటూ తమ సొంత దేశంలో సొంత విధానంలో స్వతంత్ర పాలనకు అర్హులనీ వాదించారు. అయితే, ఆయన్ని ఇరవయ్యో శతాబ్దపు విలువైన థింకర్‌గా పరిగణించడానికి ఒక కారణం– ‘డిస్ట్రిబ్యూటిజం’ (పంపిణీవాదం)ను ఆయన ఎత్తుకున్న తీరు! చెస్టర్‌టన్ సోదరుడు సిసిల్, అతడి స్నేహితుడు హిలైర్ బెల్లోక్ ‘డిస్ట్రిబ్యూటిజం’ ఆర్థిక తత్వాన్ని వృద్ధి చేశారు. మొదటి ప్రపంచ యుద్ధంలో సిసిల్ చనిపోయాక చెస్టర్‌టన్ దీనికి ప్రధాన ప్రచారకర్తగా మారడమే కాక, ప్రధానంగా ఈ భావధార ప్రచారం కోసం ‘జీకేస్ వీక్లీ’ నడిపారు. నియంత్రణ లేని క్యాపిటలిజం, సోషలిజాలకు భిన్నమైన మూడో పంథాగా ఉంటూ, ఆస్తులు, రాజకీయాధికారాల పంపిణీ జరగాలంటుంది ఈ వాదం. ‘మూడు ఎకరాలు – ఆవు’ అనేది వీరి స్లోగన్.

సూత్రప్రాయంగా జాతీయవాదానికి చెస్టర్‌టన్ వ్యతిరేకి కాకపోయినా, తన మూలాలను విస్మరించే జాతీయవాదానికి అర్థం లేదంటారు. అందుకే భారత జాతీయోద్యమాన్ని ‘అది భారతీయమూ కాదు, అంత జాతీయమూ కాదు’ అని నిరసించారు. 1909లో ‘ది ఇల్లస్ట్రేటెడ్ లండన్ న్యూస్’లో చెస్టర్‌టన్ రాసిన ఒక వ్యాసం మహాత్మా గాంధీ మీద ‘పిడుగుపాటు’లా పడింది. వెంటనే దానికి చిన్న పరిచయం రాస్తూ ‘ఇండియన్ ఒపీనియన్’లో పునర్ముద్రింపజేశారు. ‘వాళ్ల దేశానికి మన పార్లమెంట్ కావాలి, మన జ్యుడీషియరీ కావాలి, మన పత్రికలు కావాలి, మన సైన్స్ కావాలి. భారత జాతీయవాదులు ఇవన్నీ కోరుకోవడమంటే వాళ్లు ఇంగ్లిష్‌వారిలా ఉండాలనుకుంటున్నారు’ అన్నారు చెస్టర్‌టన్. అది సహేతుకమని గాంధీజీ బలపరుస్తూ, ‘స్వతంత్రంగా ఉండాలంటే ఇండియా తనకు తానుగా ఉండాలి, బ్రిటన్‌లా మారకూడదు. అదే పనిగా అనుకరిస్తే మన దేశం హిందుస్థాన్ కాదు, ఇంగ్లిషిస్థాన్ అవుతుంది’ అని రాశారు.

విస్తృతిలో, భావధారలో తెలుగు సాహిత్య శిఖరం విశ్వనాథను కొంతవరకూ స్ఫురింపజేసే చెస్టర్‌టన్‌కు రావాల్సినంత కీర్తి రాలేదన్నది కొందరి వాదన. ఇరవయ్యో శతాబ్దపు గొప్ప రచయిత, ఆలోచనాపరుడు అయినా చెస్టర్‌టన్ విస్మరణకు గురికావడానికి ఆయన అన్ని రకాలుగా రాయడమే కారణమన్నది దీనికి వివరణ. ‘ఒక్కమాటలో రచయితలు ఫలానా వర్గంలోకి ఇట్టే ఒదగకపోతే వాళ్లు చీలికల్లోంచి కిందికి జారిపోయే ప్రమాదం ఉంది’ అంటారు అహ్లీక్విస్ట్. అయినా ఆయన్ని తలకెత్తుకునే వాళ్లు ఉంటూనే ఉన్నారు. చెస్టర్‌టన్‌ను ఎడ్గార్ అలెన్ పోతో పోల్చారు బోర్హెస్. ‘చెస్టర్‌టన్‌కు ప్రపంచం తగినంత కృతజ్ఞత చూపలే’దని అన్నారు జార్జ్ బెర్నార్డ్ షా. అయితే జాన్ పైపర్ వ్యాఖ్యానం చెస్టర్‌టన్‌కు తగిన నివాళి: ‘చెస్టర్‌టన్ కోసం నేను దేవుడికి కృతజ్ఞత చెబుతాను’ అన్నారాయన.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.చవితి సా.4.44 వరకు, తదుపరి పంచమి **నక్షత్రం:** పుర్వాషాఢ ఉ.10.25 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** సా.6.11 నుండి 7.44 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.23 నుండి 1.15 వరకు తదుపరి ప.2.58 నుండి 3.50 వరకు, **అమృతఘడియలు:** ఉ.5.41 నుండి 7.15 వరకు, తదుపరి రా.3.31 నుండి 5.05 వరకు.

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం: 6.24
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

ప్రధాని ఇంటర్వ్యూలు ఇలా ఉన్నాయా?



కామెంట్
కరణ్ థాపర్

ఒక ప్రధానమంత్రితో ముఖాముఖి అన్నది ఆయన విమర్శకులపై దాడి చేయటానికి వేదికగా ఉండకూడదు. అంతేకాదు, సరైన విమర్శలకు ఆయన్ని స్పందింపజేసేలా ఉండాలి. స్పందింప ‘చేయటం’ అనే క్రియ ముఖ్యం. ప్రశ్నడిగి వదిలేస్తే ఏ ప్రధాని అయినా ఆ ప్రశ్నను తప్పించటానికి, సమాధానాన్ని దాటవేయటానికి చూడొచ్చు. అలా చేయకుండా, సమాధానం కోసం పదే పదే ఒత్తిడి తేవడం ఇంటర్వ్యూ చేసేవారి బాధ్యత. అంతేకాదు, వీక్షకుల తరఫున ప్రశ్నలు అడుగుతున్నామన్న స్పృహను వారు కలిగి ఉండాలి. అలాగే ఇంటర్వ్యూ చేసేవారు బెరుకుగా, ప్రధానికీ తనకూ వ్యత్యాసం ఉందన్న గ్రహింపుతో ఉన్నట్లుగా ప్రశ్నలు అడగకూడదు. ప్రధానిని తను కఠినమైన ప్రశ్నలు కూడా అడగగలడు అనే భావన వీక్షకులలో కలిగించాలి.

ఇప్పటి బి.బి.సి. ఛైర్మన్ సమీర్ షా ఒకప్పుడు ‘లండన్ వీకెండ్ టెలివిజన్’ లో నా మొదటి బాస్. టెలివిజన్ ఇంటర్వ్యూలలో ప్రశ్నలు అడగటం గురించి నాకు తెలిసిన చాలా విషయాలు ఆయన నేర్పించినవే. వాటిలో ముఖ్యమైన పాఠం... వీక్షకుల తరఫున ప్రశ్నలు అడుగుతున్నామన్న స్పృహను మనం కలిగి ఉండటం. అందుకే మీ ప్రశ్నలు సందర్భోచితంగా ఉండాలి. సమాధానం వచ్చేవరకు మీరు పట్టుపట్టి ఉండాలి. లేదంటే మీరు సమాధానం రాబట్టలేక పోతున్నారని వీక్షకులకు స్పష్టమైపోతుంది.



కనుక టీవీలో ప్రధానమంత్రి ఇంటర్వ్యూలను చూస్తున్నప్పుడు నేను ఏం వినాలని కోరుకుంటాను? ఏముందీ, వీక్షకుడిగా నా తరఫున ఆ ప్రశ్నలు అడుగుతున్నట్లుంటే కనుక, నా ప్రశ్నలు ఎలా ఉండి ఉండాలి అని ఆలోచిస్తుంటాను.

ముందుగా, ప్రధాని వేటిని తన విజయాలుగా భావిస్తున్నారో వాటి గురించి తెలుసుకోవాలనుకుంటాను. ఆయనకు ఎదురైన సవాళ్లకు, బహిర్గతమైన వాస్తవాలకు, చేసిన తప్పులకు, కప్పిపుచ్చుకునేందుకు చేసిన ప్రయత్నాలకు ఆయన ఏ విధంగా స్పందిస్తారో కూడా తెలుసుకోవాలని అనుకుంటాను. సంభాషణ ఏకపక్షంగా కాకుండా రెండు వైపుల నుండీ ఉండాలని కోరుకుంటాను. కాబట్టి సంభాషణలో ప్రధానిని అంతరాయపరచటం ఉంటుంది. కొన్నిసార్లు అంతరాయాలు అవసరం కూడా!

రెండోది – ఒక ప్రధానమంత్రితో ముఖాముఖి అన్నది ఆయన విమర్శకులపై దాడి చేయటానికి వేదికగా ఉండకూడదు. అంతేకాదు, సరైన విమర్శలకు ఆయన్ని స్పందింపజేసేలా ఉండాలి. స్పందింప ‘చేయటం’ అనే క్రియ ముఖ్యం. ప్రశ్నడిగి వదిలేస్తే ఏ ప్రధాని అయినా ఆ ప్రశ్నను తప్పించటానికి, సమాధానాన్ని దాటవేయటానికి చూస్తారు. అలా చేయకుండా, సమాధానం కోసం ఒత్తిడి తేవడం ఇంటర్వ్యూ చేసేవారి బాధ్యత.

మూడవది – ఇంటర్వ్యూ ఆసాంతం.. ఇంటర్వ్యూ చేసేవారు, ప్రధానీ ఇద్దరూ కూడా సమానమే. అలాంటప్పుడు మాత్రమే ఇంటర్వ్యూ ప్రధానిని బాధ్యుడిని చేస్తుంది. కనుక ఇంటర్వ్యూ చేసేవాళ్లు ఆయన్ని ‘సర్’ అని పిలవకూడదు. అలా అనడం అంటే ఆయన్ని ఉన్నత పీఠం మీద ఉంచినట్లు! అలాగే ఇంటర్వ్యూ చేసేవారు బెరుకుగా, ఆయనకూ తనకూ వ్యత్యాసం ఉందన్న గ్రహింపుతో ఉన్నట్లుగా ప్రశ్నలు అడగకూడదు. ప్రధానిని తను కఠినమైన ప్రశ్నలు కూడా అడగగలడు అనే భావన వీక్షకులలో కలిగించాలి.

నాల్గవది – అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తప్పనిసరిగా ఇంటర్వ్యూ చేసేవారు లేవనెత్తిన అంశాలకు సంబంధించినవై ఉండాలి. కొద్దిపాటి ఊకదంపుడును అర్థం చేసుకోవచ్చు కానీ, అడగని వాటికి జవాబు చెబుతూ, అడిగిన వాటికి విరుద్ధమైన సమాధానం ఇస్తూ పీఎం పూర్తిగా దారి మళ్లేందుకు అనుమతించకూడదు. అలా జరిగితే మర్యాదపూర్వకమైన బలవంతపు అంతరాయం అవసరం. పీఎం అదే పనిగా దారి మళ్లుతూ ఉంటే ఒకటి కంటే ఎక్కువ సార్లు అంతరాయాలు ఉండొచ్చు.

ఐదవది – ఇంటర్వ్యూయర్‌కు వ్యూహం అవసరం. ఏదో అడగటానికి అన్నట్లుగా ప్రశ్నలు అడగకూడదు. ఒక స్పష్టమైన లక్ష్యం ఉండాలి. ఎప్పుడూ కూడా అడగకూడని ఒక ప్రశ్నకు ఉదాహరణ: ‘ఈసారి మీరు కచ్చితంగా గెలుస్తారు, అయితే 2029లో కూడా గెలుస్తారా?’

ఇప్పుడు, సంబంధిత పీఎం స్వభావం, వ్యక్తిత్వాలకు అనుగుణంగా స్పందించేందుకు తగిన సామర్థ్యాన్ని ఇంటర్వ్యూ చేసే వ్యక్తి కలిగి ఉండాలి. ఉదాహరణకు, ఒక ప్రధాని తను చేసిన ప్రతి పనీ దేశం కోసమే చేశానని దేశభక్తి ఢంకాను బజాయిస్తుంటే... ప్రధాన మంత్రులందరి విషయంలోనూ అది సహజమే కదా అని అనండి. అలా అనడం ఆయన్ని ప్రత్యేకమైన వ్యక్తిగా నిలిపి ఉంచదు. లేదా, అందరికీ తెలిసి ప్రధాని చెప్పిన ఒక విషయం గురించి, లేదా ఆయన చేసిన ఒక పని గురించి నిర్ద్వంద్వంగా ప్రధాని తాను అనలేదని, చేయలేదని వాదిస్తుంటే... అప్పుడు దానిని సమయ సందర్భ, స్థల కాలాలతో సహా గుర్తు చేసే స్థితిలో ఇంటర్వ్యూయర్ ఉండాలి. ఆ విషయంలో స్పష్టంగా ఉండాలి. ఎందుకంటే అది ప్రధానమంత్రిని సవాలు చేయటం వంటిది. ఇంటర్వ్యూయర్ సిద్ధపడి ఉండాల్సిన వాటిలో ఇదొక సహేతుకత కలిగి ఉండాల్సిన భాగం.

కొన్నిసార్లు స్పష్టమైన ప్రశ్నలు లేవనెత్తాలి. ఎందుకంటే అవి ఆ ఇంటర్వ్యూ ఇస్తున్న ప్రధానికి సంబంధించినవై ఉంటాయి. వాటిని విస్మరించలేము. ఉదాహరణకు, ఆ ప్రధాని తను భగవంతుని వాహకమని విశ్వసిస్తుంటే ఇంటర్వ్యూ చేసే వ్యక్తి కొంతవరకైనా ఆయన్ని శంకిస్తున్నట్లుగా.. అది మీకెలా తెలుసు? మీరలా అనడం హేతుబద్ధమేనా? అని అడిగి తీరాలి. లేదా, ప్రధానిని అనుకరిస్తూ జీవనం సాగించే హాస్యగాడికి ఆయనపై పోటీ చేసేందుకు అనుమతి లభించకపోతే మీరు అందుకు అనుమతిస్తారా అని ఆ ఇంటర్వ్యూయర్ అడగాలి. ఆయన చికాకు పడుతూ కోపగించుకుంటున్నా కూడా పట్టు వదలక అడిగి తీరాలి. అంతేకాదు, ప్రధాని ఎల్లప్పుడూ తనను తాను తృతీయ పురుషలోనే ఎందుకు చెప్పుకుంటారు? గొప్ప కోసమా? అని ఇంటర్వ్యూయర్ ప్రశ్నించాలి.

చివరిగా – నేనిక్కడ రాసిన వాటిని ఒక స్వచ్ఛమైన మనసు గల, గౌరవనీయులైన ప్రధాని అంగీకరిస్తారన్న నమ్మకం నాకుంది. గుర్తుంచుకోండి! ప్రజలను ఆకట్టుకోవటానికి తన ఇంటర్వ్యూను ఉపయోగించుకోవాలని ఆయన అనుకుంటారు. వాళ్ళకు చీకాకు తెప్పించాలనుకోరు. ఆ సంగతి మర్చిపోవద్దు. సమీర్ నాతో చెప్పిన మరొక మాట ఇది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అదిగో.. నవలోకం...



మరో ప్రపంచాన్ని నిర్మించటం సాధ్యమే! మొదట అదెలా ఉండాలన్నది ఊహించుకోవాలి. అది – ద్వేషం వ్యవస్థీకృత స్వభావం కాని ప్రపంచం అయ్యుండాలి. ద్వేషం చివరికి ద్వేషించే వారినే భస్మం చేస్తుంది.

– సామిత్ర, విజిటింగ్ ఫెలో

ఏకపక్ష ధోరణి



ఇజ్రాయెల్, దాని మిత్ర పక్షాలు గాజాపై దాడులను తక్షణం నిలిపివేయాలని ఐ.సి.సి. తాజాగా కోరింది. మంచిదే! మరి అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడులలో అనేకమంది అమాయకులు, మహిళలు, పిల్లలు మరణించటంపై ఐ.సి.సి. ఎందుకని ఒక్క ప్రకటన కూడా చేయలేకపోయింది?

– సుబ్రహ్మణ్యస్వామి, రాజకీయ నేత

పోరాట ఉపశమనం



బ్రిజ్ భూషణ్‌పై అభియోగాలు నమోదు అవటం గౌరవ న్యాయస్థానంపై నమ్మకం కలిగిస్తోంది. మహిళా రెజ్లర్ల పోరాటానికి ఇది పెద్ద విజయం. ఆడపడుచులు కష్ట సమయాలను గడపాల్సి వచ్చినా పోరాడాలన్న వారి నిర్ణయం ఉపశమనాన్ని కలిగిస్తుంది. మహిళా రెజ్లర్‌లను ట్రోల్ చేసిన వారు కూడా సిగ్గుపడాలి. సత్యమేవ జయతే!

– భజరంగ్ పూనియా, ఒలింపిక్ మెడలిస్ట్

అవేం మాటలు?!



మీ నాయకుడిని తెలివిగా ఎన్నుకోవడం ఈ మాటల డయేరియాను అంతం చేయటానికి ఏకైక మార్గం. మన నాయకులు ఒకరిని ఒకరు విమర్శించుకుంటున్న స్థాయిని బట్టి చూస్తే భారత రాజకీయ చరిత్రలోనే ఈ ఎన్నికలు ఓ కీలక ఘట్టం కానున్నాయి.

– డాక్టర్ పి. కామత్, కార్డియాలజిస్టు

ఇంత కాలమా!!



డాక్టర్ నరేంద్ర దాభోల్కర్‌ను హత్య చేసిన ఇద్దరికి జీవిత ఖైదు పడింది. పది సంవత్సరాలుగా వారు ‘అనుమానిత నేరస్థులు’గానే ఉన్నారు. ఇన్నాళ్లకు (అసలైన) దోషులుగా జైల్లో ఉండబోతున్నారు. మన దర్యాప్తు, న్యాయ వ్యవస్థ ఇంత నిదానంగా ఉంటే ఎలా?

– స్వాతీ వైద్య, టీచర్

తర్కమే అంతిమం



న్యాయవాదులం, కనీసం మా సర్కిల్‌లో ఉన్నవాళ్లమైనా... చట్టపరమైన అంశాల విషయంలో ఉద్వేగ రహితంగా ఆలోచిస్తాం. మా వ్యక్తిగత రాజకీయ భావాలు మా తార్కిక బుద్ధిని మబ్బులా కమ్మేయకుండా జాగ్రత్త పడతాం. చాలు కదా!

– నవరూప్ సింగ్, న్యాయవాది

నిజం లేదు



లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేయటానికి వెళ్లే ముస్లిములకు దుబాయ్‌కి చెందిన ఒక ‘ముస్లిం సంస్థ’ ఆర్థిక సహాయం ప్రకటించినట్లుగా సోషల్ మీడియాలో ఒక లేఖ వైరల్ అవుతోంది. అందులో వాస్తవం లేదు.

– ప్రతీక్ సిన్హా, ఎడిటర్, ఆల్ట్ న్యూస్

వేషధారులు



అజీత్ భారతి, సింఘా అనేవారు స్త్రీ వేషధారణలో అట్టారి– వాఘా సరిహద్దులో నిర్బంధించబడ్డారు. కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌ను ఇచ్చిన తీర్పుపై వారిద్దరూ కలత చెందారట. భారత న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం లేనందున పాకిస్తాన్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో వారు తెలిపారు!!

– డాక్టర్ గౌరవ్ కుమార్, సోషల్ యాక్టివిస్ట్

నాజీలే ‘నాజీ... నాజీ’ అని తిడితే!

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

మే 4న అమెరికన్ రిపబ్లికన్ పార్టీ కమిటీ సమావేశం జరిగింది. అక్కడ ‘జనవరి 6 ఖైదీలు’ పాడిన ‘జాతీయ’ గీతానికి పూర్వ అధ్యక్షుడు ట్రంప్ ఆకర్షితులయ్యారు. 2020 ఎన్నికల్లో ఓడినా ట్రంప్‌ను అధ్యక్షునిగా కొనసాగించాలని పార్లమెంటు, సుప్రీంకోర్టుల కేంద్ర స్థలం కాపిటల్‌పై 2021 జనవరి 6 న దాడి జరిగింది. జో బైడెన్ గెలుపు నిర్ధారణకు ఏర్పాటైన పార్లమెంటు ఉభయ సభల సమావేశం విచ్ఛిన్నం దీని లక్ష్యం. ఈ దాడిలో వెయ్యి మంది ట్రంప్ మద్దతుదారులు 9 మంది అధికారులను చంపారు. రికార్డులు, జాతీయ ఆస్తి ధ్వంసమయ్యాయి. ఆ దుశ్చర్యలో నిర్బంధించబడ్డ 20 మందితో ట్రంప్ ‘అందరికీ న్యాయం’ దాతృత్వ సంస్థను స్థాపించారు. జనవరి 6 ఖైదీల పాట కచేరీలతో వచ్చే లాభాలను కాపిటల్ దాడి నిందితుల చట్టపర ఖర్చులకు వినియోగిస్తారు. అనామక కళాకారుడు ఈ పాట రికార్డును చేశారు. జాతీయ జెండాపై విశ్వాస ప్రతిజ్ఞతో ట్రంప్ పాడే పాట ఇది. 6 సార్లు ‘అమెరికా’ పదంతో ముగిసే ఈ పాట కచేరీని ట్రంప్ చాలా సార్లు ఏర్పాటుచేశారు.

మే 4 సభలో బైడెన్ పై ట్రంప్ తిట్ల వర్షం కురిపించారు. బైడెన్ నాజీ ‘గెస్టపో’ పాలన చేస్తున్నారన్నారు. గెస్టపో అపఖ్యాతి పాలైన హిట్లర్ రాజకీయ రహస్య పోలీసు వ్యవస్థ. అది ఐరోపా దేశాల నుంచి యూదులను బహిష్కరించింది. యూదుల నరమేధానికి తోడ్పడింది. బహిరంగ తిట్ల పురాణం ట్రంప్ అలవాటు. ట్రంప్ నేరాలపై న్యూయార్క్ కోర్టు విచారణ సాగుతోంది. ట్రంప్ మోసాల పుట్టని న్యాయవాదుల వాదన. బైడెన్ పాలన కూడా కార్పొరేట్లను, ఆయుధ వాణిజ్యవేత్తలను ప్రోత్సహించేదే. కాని ఈ పాలనను నాజీ– పాశవిక ఫాసిస్టు పాలనతో, అమానవీయ గెస్టపో దురంతాలతో పోల్చడం అన్యాయం. మన ప్రధాని మోదీ దేశ ముస్లింలను చొరబాటుదారులు, అధిక సంతానవంతులన్నట్లు బైడెన్ ఎవరినీ తిట్టలేదు. ట్రంప్ పాలనే హిట్లర్ పాలనకు దగ్గరగా ఉంది. శ్వేతేతర మహిళా పార్లమెంటు సభ్యులను మీ దేశాలకు పొమ్మని తిట్టారు. అమెరికా పరువు రక్షణ, ఘనత పునరుద్ధరణ వంటి జాత్యహంకార నినాదాలను ఎత్తిచూపినవారిని మాతృ సంభోగులన్నారు.

జర్మన్ జాతి పవిత్రతను, రక్తాన్ని యూదులు అపవిత్రం చేస్తున్నారని హిట్లర్ అనేవారు. అమెరికా రక్తాన్ని వలసజీవులు విషమయం చేస్తున్నారని, దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారని, రాజకీయ ప్రత్యర్థులు చీడపురుగులని ట్రంప్ మంట రేపారు.

బవరియ రాజ్య ప్రభుత్వాన్ని పడగొట్టి అధికారాన్ని చేజిక్కించుకోడానికి హిట్లర్ 1923 నవంబర్ లో తిరుగుబాటుచేశాడు. అది విఫలమయ్యింది. అయితే కుట్రలో చనిపోయినవారిని అమరవీరులని హిట్లర్ కీర్తించేవారు. వారి పేర వేడుకలు జరిపేవారు. 2021 జనవరి 6 ట్రంప్ కాపిటల్ దాడి అలాంటిదే. అందుకే ట్రంప్ కాపిటల్ దాడి ఘటనను వేడుకగా జరుపుకుంటున్నారు. టైమ్స్ పత్రిక ఇంటర్వ్యూ లో జనవరి 6 దాడిలో పోలీసులను చంపినవారిని దేశభక్తులని ట్రంప్ పొగిడారు. ట్రంప్, మోదీ ఏకభావజాల ‘దేశభక్తులు, రాజ్యాంగ, ప్రజా రక్షకులు.’

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, I 94902 04545

ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు జరుగుతున్న వేళ, యావత్ ప్రపంచం ఈ ఎన్నికల ప్రక్రియను నిశితంగా గమనిస్తున్న సమయంలో ఎలక్షన్ కమిషన్ (ఈసీ) చుట్టూ విమర్శలు రాజుకుంటూ ఉండటం ఆందోళనకరం. తాజా సార్వత్రిక ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం 7 ఫేజుల్లో నిర్వహిస్తోంది. ఒక్కో దశ పోలింగ్ ముగిసిన వెంటనే ఈసీ పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తోంది. అయితే తుది అంకెల ప్రకటన వెల్లడించటానికి మొదటి దశలో ఈసీ 11 రోజులు, రెండో దశలో 4 రోజుల సమయం తీసుకోవటం వివాదాస్పదంగా మారింది. పైగా అంకెల్లో కూడా భారీ మార్పు కనిపించింది. 5–6శాతం ఓటింగ్ శాతం తేడా ఎందుకు వచ్చింది.



దీనిపై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ సుప్రీం కోర్టు తలుపుతట్టింది. ప్రతి పోలింగ్ బూత్‌కు సంబంధించి ఆ రోజు జరిగిన ఓటింగ్ వివరాలు ఉండే ఫారమ్–7సీ అంశం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈసీ వ్యవహార శైలి అనుమానాలు రేకెత్తిస్తోంది. అందరిలో కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అవి:


1. మాచర్ల ఉదంతం తీసుకుంటే వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎమ్‌ను ధ్వంసం చేసిన వీడియో ఆధారంగా ఈసీ ఆయనపై పలు కేసులు దాఖలు చేసింది. వెంటనే అరెస్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈవీఎమ్‌ను ధ్వంసం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందే. ఎవరూ కాదనరు. అదే సమయంలో టీడీపీ నాయకులు యథేచ్ఛగా బూత్ లలో జొరబడి, వైసీపీ ఏజెంట్లపై దాడి చేసి రిగ్గింగ్ చేసుకుంటూ ఉంటే ఈసీ ఎందుకు మౌనం పాటించింది? రిగ్గింగ్ జరుగుతోందని వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి పదే పదే ఫిర్యాదు చేసినా ఎందుకు రిగ్గింగ్ జరగనిచ్చింది? 2. ఈసీ వెబ్‌కాస్ట్‌లో రికార్డ్ అయిన వీడియో లోకేష్ చేతికి ఎలా వచ్చింది? 3. ఆ వీడియో లీక్ అయ్యిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి చెప్పటం బాధ్యతారాహిత్యమే కదా! సచివాలయంలోని ఈసీ ఆఫీసులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షణ చేయలేదా? 4. పిన్నెల్లి ఈవీఎమ్ పగులగొట్టిన 20 సెకన్ల వీడియో మాత్రమే బయటకు వచ్చింది. అంతకు ముందు రిగ్గింగ్ జరిగిన వీడియోలను ఈసీ ఎందుకు బయటపెట్టలేదు? 5. ఈవీఎమ్ ధ్వంసం అయినా చిప్ బానే ఉంది. రీ పోలింగ్ అవసరం లేదని ఈసీ తేల్చింది. మరి ఈ చిప్‌లో రికార్డ్ అయినదంతా టీడీపీ వాళ్ల రిగ్గింగ్ ఓట్లు కదా! ఈ విషయాన్ని ఈసీ ఎందుకు పరిగణనలోకి తీసుకోవటం లేదు? 6. సీఈఓ చెప్పిన వివరాల ప్రకారమే 11 ఈవీఎమ్‌లు పోలింగ్ రోజు ధ్వంసం అయ్యాయి. మరి మిగిలిన 10 ఈవీఎమ్‌లను ధ్వంసం చేసింది ఎవరు? 7. పిన్నెల్లిపై చర్యలు తీసుకున్నట్లే వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ఎందుకు ప్రకటించలేదు. ఆ వీడియోలను ఎందుకు రిలీజ్ చేయలేదు? 8. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 వంటివి జర్నలిజం ముసుగులో టీడీపీకి అడ్డగోలుగా ప్రచారం చేస్తూ వైసీపీపై విషం చిమ్ముతుంటే ఈసీ ఎందుకు వాళ్ళను కట్టడి చేయలేదు? 9. పల్నాడు వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ ముందు రోజు రాత్రి ఉన్నపళంగా పోలీసు అధికారులను మార్చటం వెనుక ఎవరి ఒత్తిళ్లు పని చేశాయి?

ఈ ప్రశ్నలు, అనుమానాలు ప్రజల్లో, ఎన్నికల బరిలో ఉన్న రాజకీయ పార్టీల్లో ఉంటే... ఈసీ నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తుందన్న విశ్వాసం ఎలా కలుగుతుంది?

– ఆర్.ఎస్

ప్రేమను పంచాలి!

మన భారతీయ విశ్వాస వ్యవస్థలో ప్రేమకు అత్యంత ఉన్నత స్థానం ఉంది. ప్రేమను పంచమని మన ఇతిహాస పురాణాలు అనేకం చెబుతున్నాయి. మన పెద్దలూ అదే మాట చెబుతూ ఉంటారు. అయితే ప్రేమ అంటే నిర్వచనం ఏమిటనేది ఒక్కమాటలో చెప్పేది కాదు. వ్యక్తుల మధ్య, మనుషులు–ఇతర జీవుల మధ్య ఉండే ప్రేమ రూపాలు మార్చుకుంటూ ఉంటుంది. అంటే ప్రేమ అనేక రకాలన్నమాట.



జ్యోతిర్మయం

కరుణ, దయ, జాలి, కారుణ్యం, పాశం, బంధుత్వం, అభిమానం, విశ్వాసం, ప్రేమ, భక్తి... ఇవన్నీ ప్రేమకు సంబంధించిన రకరకాల పేర్లుగా భావించవచ్చు. బలహీనులపై చూపే ప్రేమకు జాలి అని పేరు. తెలివితేటల బలం, శారీరక బలం లేని వారిపట్ల చూపే ప్రేమ పేరు కరుణ. పశుపక్ష్యాదుల పట్ల చూపే ప్రేమ పేరు కారుణ్యం. దీన్నే జీవకారుణ్యం అంటారు. మన పౌరాణిక శిబి చక్రవర్తి చూపిన ప్రేమ ఇలాంటిదే. బంధువులు, సొంతవాళ్ళ పట్ల వారికి డబ్బున్నా, లేకున్నా చూపే ప్రేమను బంధుత్వం అంటారు. ఓ యజమాని తన దగ్గర పని చేసే వారి పట్ల చూపే ప్రేమ వేరు. తల్లిదండ్రులకు బిడ్డకు మధ్య ఉండేది పాశం. తన కుమారుడైన శ్రీరాముడు అడవులకు వెళ్లాడనే దిగులుతోనే దశరథ మహారాజు మరణించడం చూస్తే ప్రేమ పాశం ఎంత బలమైనదో అర్థమవుతుంది. స్నేహితుల పట్ల చూపే ప్రేమకు మరోపేరు అభిమానం. అంతస్థులు చూడకుండా చూపే ప్రేమ అసామాన్యం. ఇందుకు తగిన ఉదాహరణ కృష్ణుడు– కుచేలుని పట్ల చూపించిన ప్రేమ. ఇక పని చేసే వారు యజమాని పట్ల చూపే ప్రేమ పేరు విశ్వాసం. భార్యాభర్తల మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రేమ అని చెప్పడం కద్దు.

ప్రేమ ప్రేమలా ఉండాలన్నారు ఓషో. ప్రేమకు సాటి ప్రేమే. దానికి ఎటువంటి మెరుగులు దిద్దవలసిన అవసరం లేదు. ఎందుకంటే ప్రేమ ఎప్పుడూ పరిపూర్ణంగా ఉంటుంది. కానీ దీనిని అర్థం చేసుకోకుండా లేనిపోని చిక్కుల్లో పడి మనసును పాడుచేసుకునే వారే ఎక్కువ మంది. కనుక ప్రేమను ప్రేమగా ఉంచుదాం. ప్రేమను పంచుదాం. ప్రేమను పొందుదాం!

– యామిజాల జగదీశ్



తీరం దాటిన రెమల్

అర్ధరాత్రి తరువాత బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ మధ్య..

బెంగాల్‌లో అత్యంత భారీ వర్షాలు.. పలు విమాన, రైలు సర్వీసులు రద్దు

ఏపీలో పొడి వాతావరణం

2 నుంచి 4 డిగ్రీలు పెరగనున్న గరిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి, విశాఖపట్నం: తీవ్ర తుపానుగా బలపడిన రెమల్ ఆదివారం అర్ధరాత్రి తర్వాత పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటింది. అంతకుముందు తీవ్ర తుపాను గంటకు 16 కిలోమీటర్ల వేగంతో ఉత్తర బంగాళాఖాతం నుంచి తీరం వైపు పయనించింది. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు విపత్తు నిర్వహణ కోసం భారీ ఎత్తున ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలకు ఉపక్రమించాయి. తుపాన్ ప్రభావం మన రాష్ట్రంపై అంతగా లేకపోయినా.. దీని కారణంగా రాష్ట్రంలో తేమ మొత్తం పోయింది. పొడి వాతావరణం ఏర్పడింది. దీనికితోడు ఏపీ, యానాంలో పశ్చిమదిశగా గాలులు వీస్తుండటంతో ఉక్కపోత మరింత ఎక్కువ కానుంది. రాబోయే రెండురోజులు కోస్తా, రాయలసీమల్లో పొడి వాతావరణం ఏర్పడుతుందని, గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని భారత వాతావరణశాఖ తెలిపింది. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమల్లో ఒకటిరెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. రెండురోజుల తర్వాత ఉష్ణోగ్రతలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని వెల్లడించారు. మరోవైపు నైరుతి బంగాళాఖాతం, మధ్య బంగాళాఖాతం, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించాయి. నైరుతి ఈ నెల 31 నాటికి కేరళలోకి ప్రవేశించేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయని ఏపీ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

పిన్నెల్లి హత్యకు పథకం

మాజీ మంత్రి పేర్ని నాని ఆందోళన

బెయిల్ ఇవ్వడంతో అంతమొందించేందుకే మూడు తప్పుడు కేసులు.. ఎమ్మెల్యేకు హాని జరిగితే సీఐ నారాయణస్వామి, ఐజీ త్రిపాఠిదే బాధ్యత

పోలీసు వ్యవస్థకు మాయని మచ్చలా తయారైన అధికారులను వదిలిపెట్టం.. వేధిస్తున్న అధికారులు 4 తర్వాత మూల్యం చెల్లించక తప్పదు



పల్నాడు జిల్లా కారంపూడిలో టీడీపీ గూండాలు చేసిన విధ్వంసాన్ని చూపిస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని

సాక్షి, అమరావతి: మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని వెంటాడి హత్య చేసేందుకు పోలీసుల ద్వారా టీడీపీ నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి పేర్ని నాని (వెంకట్రామయ్య) ఆందోళన వ్యక్తం చేశారు. పిన్నెల్లి ప్రాణాలకు ఎలాంటి హాని జరిగినా సీఐ నారాయణస్వామి, గుంటూరు రేంజ్ ఐజీ, డీజీపీదే బాధ్యతని స్పష్టం చేశారు. సీఐ నారాయణస్వామిని అడ్డు పెట్టుకుని తనను అంతమొందించేందుకు టీడీపీ నేతలు కుట్ర చేస్తున్నట్లు ఈసీ, పోలీసు ఉన్నతాధికారులకు పిన్నెల్లి ఫిర్యాదు చేసిన తర్వాత ఆయన ఇంటి వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పారామిలిటరీ బలగాలను ఈనెల 14న ఎందుకు వెనక్కి రప్పించారని నిలదీశారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పిన్నెల్లి ఈ కుట్రలపై గవర్నర్, రాష్ట్రపతి, ప్రధానికి మొర పెట్టుకుంటేగానీ పారా మిలిటరీ బలగాలను పంపలేదన్నారు. పోలీసు వ్యవస్థకు మాయని మచ్చలా తయారై సంఘ విద్రోహక శక్తుల్లా వ్యవహరిస్తున్న అధికారులకు ముందుంది ముసళ్ల పండుగని హెచ్చరించారు. పల్నాడు, తాడిపత్రి, తిరుపతిలో టీడీపీ గూండాలకు వత్తాసు పలుకుతున్న వారు జూన్ 4 తరువాత తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. పేర్ని నాని ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గాల్లో టీడీపీ మూకల విధ్వంసకాండను రుజువు చేసే పలు వీడియోలను ప్రదర్శించారు.

- పిన్నెల్లి 2009 నుంచి వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మాచర్లలో వైఎస్సార్‌సీపీకి బలమైన పునాది వేశారు. మాచర్లలో టీడీపీ అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నిస్తోందని, గట్టి భద్రత కల్పించి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరపాలని కోరుతూ ఈనెల 11న ఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్, పోలీసు ఉన్నతాధికారులకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వినతిపత్రం అందచేశారు.
- మాచర్ల నియోజకవర్గంలో ఇప్పటివరకూ అల్లర్లు జరగని ప్రాంతాల్లో పారా మిలటరీ బలగాలను నియమించిన అధికారులు ఘర్షణలు చోటుచేసుకునే చోట్ల మాత్రం హోంగార్డులతో సరిపుచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై టీడీపీ మూకలు దాడి చేస్తుంటే ప్రేక్షకపాత్ర వహించడం ద్వారా పోలింగ్ శాతాన్ని తగ్గించేందుకు కుట్ర చేశారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారులను భయభ్రాంతులకు గురి చేసి టీడీపీ మూకలు రిగ్గింగ్‌కు పాల్పడ్డాయి.
- ఈనెల 13న పోలింగ్ రోజు పాల్వాయి గేట్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసమైనట్లు పీవో లాగ్ బుక్‌లో ఎందుకు నమోదు చేయలేదు? అరక్షణమైనా పోలింగ్‌కు విఘాతం కలిగిందా? ఈనెల 17న విచారణకు వెళ్లిన సిట్ బృందానికైనా ఈవీఎం ధ్వంసం గురించి చెప్పారా? ఈనెల 18న డీజీపీకి సిట్ ఇచ్చిన ప్రాథమిక నివేదికలోనూ ఎమ్మెల్యే పిన్నెల్లి పేరు లేదు. ఈవీఎంను పిన్నెల్లి ధ్వంసం చేసినట్లు ఆ నివేదికలో ఎక్కడా లేదు. మీడియాకు సిట్ విడుదల చేసిన నివేదికే అందుకు తార్కాణం.
- ఈనెల 20న లోకేష్ ట్వీట్ ఆధారంగా పిన్నెల్లిని అరెస్టు చేయాలని ఎన్నికల కమిషన్ మర్నాడు ఆదేశించింది. లోకేష్‌కు ఆ వీడియో ఎలా వచ్చిందని మీడియా ప్రశ్నిస్తే తన కార్యాలయం నుంచి లీక్ కాలేదని, ఎలా వచ్చిందో విచారణలో తేలుతుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి పేర్కొనడం హాస్యాస్పదం.
- ఈసీ ఉత్తర్వులపై పిన్నెల్లి హైకోర్టును ఆశ్రయించి ఈనెల 22న బెయిల్ తెచ్చుకుంటే అదే రోజు ఆయనపై తప్పుడు కేసు బనాయించారు. ఈనెల 14న కారంపూడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను చెదరగొట్టేటప్పుడు తనకు గాయమైందని, తనపై దాడి చేసిన వారిలో పిన్నెల్లి ఉన్నారని ఈనెల 22న సీఐ నారాయణస్వామి తాపీగా స్టేట్‌మెంట్ ఇచ్చారు. పిన్నెల్లి పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చి తప్పుడు కేసు బనాయించారు. సీఐకి 14న గాయమైతే 22 వరకూ స్టేట్‌మెంట్ ఇవ్వకుండా ఏం చేశారు?
- పోలింగ్ మర్నాడు పారా మిలటరీ బలగాలు మాచర్లలో ఉన్నా పక్కనే ఉన్న కారంపూడిలో సీఐ నారాయణస్వామి, ఎస్సై రామాంజనేయులు అండతో చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన టీడీపీ రౌడీమూకలు విధ్వంసానికి తెగబడ్డాయి. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లు, దుకాణాలను ధ్వంసం చేసినా పోలీసులు పట్టించుకోలేదు.
- టీడీపీకి లొంగిపోయిన ఎన్నికల వ్యవస్థ, పోలీసు వ్యవస్థలు పిన్నెల్లిపై కక్ష కట్టి తప్పుడు కేసులు బనాయిస్తున్నాయి. మాచర్లలో ఎన్నికల హింసకు సంబంధించి ఎస్పీ, డీఎస్పీ, ఎస్సై సస్పెండైనా ఐజీ త్రిపాఠీకి సన్నిహితుడైన సీఐ నారాయణస్వామిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గతంలో కారంపూడి ఎస్సైగా ఉన్నప్పుడు అత్యంత వివాదాస్పదంగా వ్యవహరించి సస్పెన్షన్‌కు గురైన నారాయణస్వామిని సీఐగా ఎలా నియమిస్తారు? ఆయన వ్యవహార శైలిపై గత నెల 8నే ఎమ్మెల్యే పిన్నెల్లి ఫిర్యాదు చేసినా ఈసీ పట్టించుకోలేదు.
- పోలింగ్ రోజు టీడీపీ కార్యకర్తను హత్య చేసేందుకు పురిగొల్పారని, మహిళలను చంపుతానని బెదిరించారని పిన్నెల్లిపై ఈనెల 23న మరో రెండు కేసులు నమోదు చేశారు. ఇలా ఇంకెన్ని తప్పుడు కేసులు బనాయిస్తారో డీజీపీ వెల్లడించాలి. పిన్నెల్లిని కౌంటింగ్‌కు రానివ్వకుండా చేసి దౌర్జన్యాలకు తెగబడాలని టీడీపీ కుట్రలు చేస్తోంది. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన ఈసీ అందుకు వంత పాడటం దారుణం.

తాపీగా తప్పుడు కేసులు

- పిన్నెల్లికి బెయిల్ రావడంతో మరో మూడు అక్రమ కేసులు
- కారంపూడిలో సీఐ తలకు గాయమైతే వారానికిపైగా ఏం చేస్తున్నట్లు?
- నరసరావుపేటలో ఇంట్లో బాంబులు దాచిన అరవింద బాబును వదిలేసి గోపిరెడ్డిపై కేసులా?



పోలింగ్ అనంతరం నరసరావుపేటలో టీడీపీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబు ఇంట్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు (ఫైల్)

సాక్షి, అమరావతి: రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఈసీ నియమించిన పోలీసు అధికారులు స్వామి భక్తి చాటుకునేందుకు బరి తెగిస్తున్నారు. పోలింగ్ రోజు పల్నాడు, అనంతపురం, ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో చోటుచేసుకున్న ఘటనలే అందుకు నిదర్శనం. పల్నాడులో ప్రధానంగా మాచర్ల నియోజకవర్గంలో పోలింగ్ రోజు టీడీపీ శ్రేణులు విధ్వంసం సృష్టించేందుకు కుట్ర చేస్తున్నట్లు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆర్వో (రిటర్నింగ్ అధికారి) నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వరకూ, ఎస్పీ నుంచి డీజీపీ దాకా పలుదఫాలు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ బలంగా ఉన్న రెంటచింతల మండలంలో ఎన్నికల రోజు భారీగా పారా మిలటరీ బలగాలను మోహరించగా టీడీపీ మద్దతుదారులున్న చోట్ల హోంగార్డులతో సరిపెట్టడం గమనార్హం. టీడీపీ రౌడీ మూకలు తిష్ట వేసిన కారంపూడి మండలంలో అల్లర్లు చెలరేగే ఆస్కారం ఉందని గత ఎన్నికలు హెచ్చరిస్తున్నా ఉదాసీనంగా వ్యవహరించడంతో పచ్చమూకలు భయోత్పాతం సృష్టించి యథేచ్ఛగా రిగ్గింగ్‌కు తెగబడ్డాయి.

తాపీగా సీఐ ఫిర్యాదు..

మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసంపై ఈనెల 20న నారా లోకేష్ తన ఎక్స్ ఖాతా నుంచి ఎడిట్ చేసిన ఓ వీడియోను పోస్ట్ చేశారు. ఈవీఎం ధ్వంసమైనట్లు పీవో (ప్రిసైడింగ్ ఆఫీసర్) లాగ్ బుక్‌లో ఎక్కడా నమోదు చేయలేదు. పోలింగ్‌కు విఘాతం కలిగినట్లు పేర్కొనలేదు. సిట్ కూడా దీని గురించి ప్రస్తావించలేదు. ఘటనలో ఎమ్మెల్యే పిన్నెల్లి పాల్గొన్నట్లు చెప్పలేదు. ఈనెల 18న డీజీపీకి సిట్ ఇచ్చిన నివేదికలోనూ ఆ ప్రస్తావనే లేదు. అసలు వెబ్‌కాస్టింగ్ నుంచి అది ఎలా లీకైంది? నిజమైనదేనా? మార్ఫింగ్ చేసిందా? అనే విషయాలను ధృవీకరించుకోకుండా పిన్నెల్లిని అరెస్టు చేయాలంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాలు జారీ చేశారు. దీన్ని సవాల్ చేసిన పిన్నెల్లికి హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో పోలీసులు మరో మూడు అక్రమ కేసులు బనాయించారు. ఈనెల 14న కారంపూడిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను చెదరగొడుతుండగా తన తలకు గాయమైందని, ఆ ఘటనలో ఎమ్మెల్యే పిన్నెల్లి ఉన్నారంటూ సీఐ నారాయణస్వామి తాపీగా ఈనెల 22న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఒక కేసు నమోదైంది. పోలింగ్ రోజు తనను హత్య చేయడానికి పురిగొల్పారని ఆరోపణలు చేసిన ఓ టీడీపీ నేత ఫిర్యాదు ఆధారంగా మరో కేసు నమోదు చేయగా, తనను చంపుతానని బెదిరించారంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మూడో కేసును పిన్నెల్లిపై నమోదు చేశారు. వీటిని పరిశీలిస్తే కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

టీడీపీ గూండాలకు చట్టం చుట్టమా?

నరసరావుపేటలో పోలింగ్ రోజు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపై టీడీపీ గూండాలు దాడులకు తెగబడ్డారు. గోపిరెడ్డి దొరకకపోవడంతో ఆయన మామపై పచ్చ మూక దాడి చేసింది. అయితే హత్యాయత్నానికి పాల్పడ్డ టీడీపీ గూండాలపై కేసు నమోదు చేయకుండా ఆ కేసును పోలీసులు గోపిరెడ్డిపై బనాయించడం విస్మయం కలిగిస్తోంది. నరసరావుపేట టీడీపీ అభ్యర్థి అరవిందబాబు ఇంట్లో పెట్రోల్ బాంబులు, మారణాయుధాలు లభ్యమైతే ఆయనపై హత్యాయత్నం కేసు పెట్టకుండా చిన్న కేసుతో సరిపుచ్చారు. పోలింగ్ మర్నాడు కారంపూడిలో టీడీపీ మూకలు పేట్రేగినా పోలీసులు కనీసం నిలువరించే ప్రయత్నం చేయలేదు. దీన్ని ప్రతిఘటించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై విచక్షణారహితంగా లాఠీ ఛార్జీ చేసి చెదరగొట్టారు.

ఓటు తెచ్చిన చేటు

కౌలురైతులపై 'మంగళగిరి'లో ఓ సామాజికవర్గం దుర్మార్గం

సాగు కోసం పొలాల వద్దకు రావొద్దని హెచ్చరికలు

నారా లోకేశ్‌కు ఓట్లు వేయకపోవడమే వారు చేసిన నేరం



వాళ్లంతా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద కౌలు రైతులు. ఏళ్ల తరబడి టీడీపీ సామాజికవర్గానికి చెందిన భూ యజమానుల వద్ద భూములు కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్నారు. మొన్న జరిగిన ఎన్నికలు వారి జీవనోపాధిపై దెబ్బకొట్టాయి. కారణం.. ఆ పెత్తందారులు చెప్పిన పార్టీకి ఓటేయకపోవడమే వారు చేసిన పాపం. తమ మాటను పట్టించుకోలేదన్న ఉక్రోషంతో ఆ భూ యజమానులు రగిలి పోయి ఇకపై తమ భూములను మీకు కౌలుకు ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో దాపురించిన ఈ వింత పోకడపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

గల్ఫ్‌లో బ్రెయిన్‌డెడ్ కేసులు

- మానసిక ఒత్తిడికి గురవుతున్న వలస కార్మికులు
- ఇటీవలికాలంలోనే ముగ్గురు

- నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం బోరిగాం గ్రామానికి చెందిన కొండూరి అరవింద్(20) మూడు నెలల క్రితం బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. అవయవదానం తర్వాత అతడి మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది.
- నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలానికి చెందిన గోవర్ధన్ తీవ్ర మానసిక క్షోభకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతను కూడా బ్రెయిన్ డెడ్ అని దుబాయ్‌లో వైద్యులు ప్రకటించారు.
- కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఉప్పర్ మల్యాలకు చెందిన సందరిగిరి రమేష్ దుబాయ్ ఆస్పత్రిలో బ్రెయిన్‌డెడ్ అయ్యాడు.



అరవింద్



రమేష్

మోర్తాడ్(బాల్కొండ): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని దుబాయ్, షార్జా, అబుదాబీలలో అనేకమంది వలస కార్మికులు మానసిక ఒత్తిడికి గురై మృత్యువాత పడుతున్నారు. ఏజెంట్ల మోసాలు, కంపెనీల్లో సరైన వేతనం చెల్లించకపోవడం, ఇంటి వద్ద అప్పుల సమస్య, కుటుంబ భవిష్యత్.. ఇలా ఎన్నో ఆలోచనలతో వలస కార్మికులు మానసికంగా కుంగిపోతున్నారు. దీంతో పలువురు తీవ్ర అనారోగ్యంపాలవుతున్నారు. ఇందులో కొందరు బ్రెయిన్ డెడ్‌కు గురవుతున్నారు. వలస కార్మికులు మానసిక ఒత్తిడికి లోనైతే వారికి కౌన్సెలింగ్ ఇచ్చే వ్యవస్థ లేదు. తాము ఉన్నామంటూ ప్రభుత్వం భరోసా కల్పించడం లేదు. ఇటీవలి కాలంలో బ్రెయిన్ డెడ్ కేసులు పెరగడం వలస కార్మికుల కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ సమస్య నుంచి బయటపడడానికి వలస కార్మికుల క్యాంపుల్లో రెగ్యులర్ హెల్త్ క్యాంపులు నిర్వహించడంతోపాటు మానసిక ఒత్తిడిని దూరం చేయడానికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచిస్తున్నారు.

చిన్న పొరపాటు కూడా జరగొద్దు

ఓట్ల లెక్కింపులో జరజాగ్రత్త

- పటిష్ట ఏర్పాట్లు చేయండి
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం
- ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌కుమార్ వ్యాస్



సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల నాలుగో తేదీన జరిగే ఓట్ల లెక్కింపునకు ఎటువంటి లోపాలు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రాలను ఆదేశించింది. ఇందుకు ఇంకా కేవలం వారం రోజుల సమయం మాత్రమే ఉన్నందున ఆదివారం కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌కుమార్ వ్యాస్ రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియలో ఓట్లు లెక్కింపు అనేది చాలా కీలకమైందని, ఇందులో చోటు చేసుకునే చిన్న చిన్న తప్పిదాలు కూడా తీవ్ర పరిణామాలు, పర్యవసనాలకు కారణమవుతాయన్న విషయాన్ని మరిచిపోవద్దని హెచ్చరించారు. అందుకే చిన్న చిన్న తప్పిదాలు కూడా దొర్లకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని వ్యాస్ ఆదేశించారు. ఏర్పాట్ల ప్రక్రియలో చేయాల్సిన, చేయకూడని అంశాలను ఆయన వివరించారు.

రాష్ట్రంలో సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నాం: వికాస్ రాజ్

తెలంగాణలో అన్ని రకాల సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నట్టు సీఈఓ వికాస్ రాజ్ ఆయన దృష్టికి తెచ్చారు. ఓట్ల లెక్కింపు విధుల్లో ఉండే సిబ్బందికి మొదటి రౌండ్ శిక్షణ మంగళవారంతో పూర్తవుతుందని, పరిశీలకులు రాగానే తదుపరి శిక్షణ ఉంటుందని వెల్లడించారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. కేంద్రాల అంతర్భాగాలు సీఏపీఎఫ్ పర్యవేక్షణలో ఉంటాయని తెలిపారు. అన్ని కేంద్రాలు సీసీటీవీల పరిధిలో ఉంటాయని, అగ్నిమాపక యూనిట్లు, నిరంతరాయ విద్యుత్ సరఫరాలో భాగంగా బ్యాకప్ జనరేటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు.

34 ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ

రాష్ట్రంలో 34 ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని, హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఏడు చోట్ల, సికింద్రాబాద్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఆరు చోట్ల జరుగుతుందని వికాస్‌రాజ్ వివరించారు. ఈవీఎంల కోసం 1855 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు 276 టేబుళ్లు ఉంటాయన్నారు. తెలంగాణకు 47 మంది పరిశీలకులు వస్తారని వ్యాస్ వెల్లడించారు. అదనపు సీఈఓ లోకేశ్ కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈఓలు సత్యవాణి, అబ్దుల్‌హమీద్, హరిసింగ్ తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

29జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనుమతి: మంత్రి తుమ్మల

రూ.25వేల కోట్లు సాగులో లేని భూమికే 'రైతుబంధు'అందించారు

40 వేల కోట్ల మేర రుణమాఫీకి కసరత్తు



ఖమ్మంఅర్బన్: తెలంగాణలోని 29 జిల్లాల్లో 10 లక్షల ఎకరాల మేర ఆయిల్‌పామ్ సాగుకు కేంద్రం అనుమతించిందని.. అందుకనుగుణంగా అధికారులు, రైతులు దృష్టి సారించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో గోద్రెజ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం ఏ పంటలకు లేని విధంగా ఆయిల్‌పామ్ రైతులకు భద్రత, భరోసా ఉందని అందుకు తానే ఉదాహరణ అన్నారు. కొన్నేళ్లుగా ఆగిపోయిన డ్రిప్ పథకాన్ని త్వరలోనే పునరుద్ధరిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని రైతులకు ఇటీవల రూ.7 వేల కోట్ల మేర రైతుభరోసా నిధులు జమ చేసినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో రూ.80 వేల కోట్లు రైతుభరోసా(రైతు బంధు) ద్వారా అందిస్తే.. అందులో సుమారు రూ.25 వేల కోట్ల మేర గుట్టలు, సాగులో లేని భూములకే అందించినట్లు గుర్తించామని మంత్రి వెల్లడించారు. తాజా లెక్కలు ప్రకారం రూ.40 వేల కోట్ల మేర రుణమాఫీ చేయాల్సి ఉన్నట్లు తేలిందని మంత్రి తెలిపారు. రైతు భరోసా, బీమా, రుణమాఫీ విధివిధానాలపై జిల్లాల వారీగా రైతు సంఘాల నాయకులు, పార్టీల ప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

మధుకి డాక్టరేట్ ప్రదానం



లక్డీకాపూల్ (హైదరాబాద్): మీడియా, కమ్యూనికేషన్ రంగాలలో కృషి చేసిన జర్నలిస్ట్, రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ పూర్వ ప్రజా సంబంధాల అధికారి వాకిటి మధుకు అమెరికా ఈస్ట్‌కోస్ట్ యూనివర్సిటీ (న్యూయార్క్) గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్ డక్కన్‌లో ఆదివారం యూనివర్సిటీ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో నిష్ణాతులైన 10 మందికి గౌరవ డాక్టరేట్‌లు, 35 మందికి 'భారత్ కే అన్మోల్'అవార్డులను ప్రదానం చేసింది. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు డాక్టరేట్‌లు, అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మిస్ ఆసియా ఇంటర్నేషనల్ రష్మి ఠాకూర్, యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. వాకిటి మధు గతంలో జర్నలిస్ట్‌గా, ఆకాశవాణిలో సహాయ కార్యక్రమాల నిర్వాహకునిగా, హైదరాబాద్ దూరదర్శన్‌లో న్యూస్ రీడర్‌గా, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యునిగా, ఎఫ్‌డీసీలో స్క్రిప్ట్ రైటర్‌గా పనిచేశారు. ప్రస్తుతం వెటరన్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యుడిగా, భారత ప్రజా సంబంధాల సొసైటీ జాతీయ సభ్యునిగా పనిచేస్తున్నారు.

మద్దతు ధరకు చట్టబద్ధత

- ఇండియా కూటమి అధికారంలో వస్తే అన్ని వర్గాలను ఆదుకుంటాం
- పంజాబ్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి



మొగ అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ సమావేశంలో పాల్గొన్న భట్టి, కేసీ వేణుగోపాల్

సాక్షి, హైదరాబాద్: రైతుల కష్టానికి తగిన ఫలితం రాబోయే రోజుల్లో దక్కనుందని, కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పంటలకు మద్దతు ధర కల్పించేందుకు చట్టం చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. దేశంలో వరి, పత్తి, చెరకు రైతులకు మద్దతు ధరలు లభించడం లేదని, నల్లచట్టాలు తెచ్చి రైతుల ధనాన్ని లాక్కునేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్‌కోట్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఆదివారం ఆయన పలు చోట్ల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో భట్టి మాట్లాడుతూ ఇండియా కూట మి అధికారంలోకి వస్తే దేశంలోని అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. నిరుద్యోగులకు మంచి జరుగుతుందని, పబ్లిక్, ప్రైవేట్ రంగాల్లో ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలను ఆగస్టు 15 లోపు భర్తీ చేస్తామని చెప్పారు. మోదీ, అమిత్‌షాలు ఆందోళనలో ఉన్నారని, వారు అభివృద్ధి నినాదంతో ఓట్లు అడగడం లేదని, మటన్, మందిర్, మంగళసూత్రం, మైనార్టీల అంశాలు మాట్లాడుతూ ఓట్లడుగుతున్నారన్నారు. భట్టితో పాటు ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

'రింగు' పరిహారానికి రుణం

▶ మొదటి పేజీ తరువాయి


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం ఏర్పడింది. ఆ డబ్బు చెల్లించకుంటే ప్రాజెక్టే నిలిచిపోయే ప్రమాదం ఉందంటూ ఎన్‌హెచ్‌ఏఐ నుంచి పరోక్ష హెచ్చరికలూ వెలువడ్డాయి. చివరకు విడతలవారీగా చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. తొలుత రూ. వెయ్యి కోట్లు.. ఆ తర్వాత మిగతా మొత్తాన్ని చెల్లించేందుకు నాటి ప్రభుత్వం సమ్మతించింది. అలైన్‌మెంట్ మార్గంలో ఉన్న విద్యుత్ స్తంభాల లాంటి వాటి తరలింపునకు అవసరమయ్యే రూ. 364 కోట్లను కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని ఎన్‌హెచ్‌ఏఐ కోరడంతో ప్రభుత్వం తొలుత తటపటాయించినా తర్వాత సమ్మతించింది. కానీ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి గడ్కరీతో చర్చించాక ఆ మొత్తాన్ని కేంద్రమే భరించేందుకు సిద్ధమైంది. ఈ తరుణంలో భూపరిహారం వాటా నిధుల కోసం రుణం పొందాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం ప్రారంభించింది. అప్పట్లో ఇదే విషయాన్ని అధికారులు 'సాక్షి'కి వెల్లడించారు. కానీ ఎక్కడి నుంచి రుణం పొందాలనే విషయంలో డోలాయమానం నెలకొంది. వారం క్రితం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో దీనిపై స్పష్టత వచ్చింది. రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా హడ్కో నుంచి సేకరించాలని నిర్ణయించా రు. కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే ప్రాజెక్టు నిర్మాణ సన్నాహాలు వేగం పుంజుకోనున్నాయి.

అంచనా వ్యయం పెరిగే అవకాశం..

గతంలో రాష్ట్ర ప్రభుత్వంతో నెలకొన్న విభేదాలు, ఆ తర్వాత రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు.. ఇలా రెండేళ్ల సమయం గడిచిపోయింది. దీనివల్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. 2022 చివర్లో రీజనల్ రింగురోడ్డుకు బడ్జెట్ ఖరారు చేసిన సమయంలో ఉత్తర భాగం నిర్మాణానికి రూ. 13, 200 కోట్లు ఖర్చవుతుందని ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. ఇప్పుడు ఆ మొత్తం రూ. 16 వేల కోట్లకు పెరుగుతుందని భావిస్తున్నారు. దీంతో ఇక జాప్యం చేయకుండా వెంటనే టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈలోగా భూపరిహారం వ్యవహారాన్ని కొలిక్కి తేవాల్సి ఉంది. ఇది జరగాలంటే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. దీంతో వీలైనంత త్వరలో లోన్ మొత్తాన్ని పొందాల్సి ఉంది.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

- నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం విష్ణుపురం వద్ద ఘటన
- గుంటూరు – సికింద్రాబాద్ మధ్య రైళ్ల రాకపోకలకు అంతరాయం



దామరచర్ల మండలం విష్ణుపురం వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

మిర్యాలగూడ అర్బన్/నల్లగొండ క్రైం: నల్లగొండ జిల్లాలో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఆదివారం మధ్యాహ్నం దామరచర్ల మండలం విష్ణుపురం వద్ద ఈ ఘటన జరిగింది. గుంటూరు నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న గూడ్స్ రైలు విష్ణుపురం వద్ద ఒక్కసారిగా పట్టాల నుంచి పక్కకు ఒరిగిపోయింది. దీంతో రెండు బోగీలు పట్టాల నుంచి కిందకు దిగిపోయాయి. ఆ సమయంలో రైలు తక్కువ వేగంతో ఉండడంతో డ్రైవర్ అప్రమత్తమై బ్రేకులు వేసి మిగిలిన బోగీలు పక్కకు పడిపోకుండా జాగ్రత్త పడ్డాడు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను ఉన్నతాధికారులకు చేరవేశారు. ఈ ఘటన నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి గుంటూరు మీదుగా నడిచే పలు రైళ్లను దారి మళ్లించగా.. అప్పటికే బయలు దేరిన శబరి ఎక్స్‌ప్రెస్‌ను మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. కాగా, గుంటూరు వైపు వెళ్తున్న రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైలును నల్లగొండ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. సాయంత్రం 4 గంటలకు నల్లగొండకు వచ్చిన రైలు 5.27 గంటలకు వెళ్లింది. ఈ మార్గంలో నడిచే ఫలక్‌నుమా, విశాఖ రైళ్లను దారి మళ్లించారు. పట్టాలు తప్పిన రెండు బోగీలను క్రేన్ల సాయంతో తొలగించారు. దెబ్బతిన్న పట్టాలకు మరమ్మతులు చేపట్టి రైళ్ల రాకపోకలకు సిద్ధం చేశారు.

ఇబ్బంది పడ్డ ప్రయాణికులు..

మధ్యాహ్నం 2.38 గంటలకు గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో శబరి ఎక్స్‌ప్రెస్‌ను మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో సుమారు ఐదున్నర గంటలపాటు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి వరకు ట్రాక్‌కు మరమ్మతులు కొనసాగాయి. పనులు పూర్తయ్యాక రైలును పంపించారు. ఈ ఘటనపై రైల్వే అధికారులు విచారణ చేపట్టారు.

యూపీలో ఆఖరి పోరాటం!

13 స్థానాలకు జూన్ 1న పోలింగ్ ● వారణాసిపైనే అందరి దృష్టి

ఉత్తరప్రదేశ్‌లో సుదీర్ఘ సార్వత్రిక ఎన్నికల సంగ్రామం ఆఖరి అంకానికి చేరుకుంది. 6 విడతల్లో 67 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ ముగిసింది. మిగతా 13 సీట్లలో జూన్ 1న చివరిదైన ఏడో విడతలో పోలింగ్ జరగనుంది. 2019లో వీటిలో 11 స్థానాలు బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కైవసం కాగా బీఎస్పీకి 2 దక్కాయి. ప్రధాని మోదీ పోటీ చేస్తున్న వారణాసి, సీఎం యోగి కంచుకోట గోరఖ్‌పూర్ సహా కీలక నియోజవర్గాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్



వారణాసి... మోదీ హ్యాట్రిక్ గురి

కాశీ విశ్వేశ్వరుడు కొలువుదీరిన ఈ లోక్‌సభ స్థానంలో 1991 నుంచి కమలనాథులు పాతుకుపోయారు. 2004లో కాంగ్రెస్ నెగ్గినా 2009లో బీజేపీ దిగ్గజం మురళీ మనోహర్ జోషి గెలుపొందారు. 2014లో ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోదీ ఇక్కడ తొలిసారి బరిలో దిగారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై 3.7 లక్షలకు పైగా మెజారిటీతో గెలిచారు. 2019లో మెజారిటీని 4.8 లక్షలకు పెంచుకున్నారు. ఈసారి హ్యాట్రిక్ కోసం ఉవ్విళ్లూరుతున్నారు. కాంగ్రెస్ తరఫున పీసీసీ చీఫ్ అజయ్ రాయ్, బీఎస్పీ నుంచి అథర్ జమాల్ లారీ రేసులో ఉన్నారు. ఈసారి మోదీ మెజారిటీ పెరుగుతుందా, లేదా అన్నదే ప్రశ్నగా కనిపిస్తోంది.

గోరఖ్‌పూర్... భోజ్‌పురీ వార్

సుప్రసిద్ధ గోరఖ్‌నాథ్ ఆలయానికి నెలవు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కంచుకోట. ఆయన గురువు మహంత్ అవైద్యనాథ్ 1989 నుంచి వరుసగా మూడుసార్లు గెలిచారు. తర్వాత యోగి 1998 నుంచి 2014 దాకా ఐదుసార్లు నెగ్గారు. ఆయన సీఎం కావడంతో జరిగిన ఉప ఎన్నికలో అనూహ్యంగా ఎస్పీ గెలిచినా 2019లో బీజేపీ ప్రముఖ భోజ్‌పురి నటుడు రవికిషన్‌ను బరిలోకి దించి 3 లక్షల మెజారిటీతో కాషాయ జెండా ఎగరేసింది. ఈసారీ ఆయనే పోటీలో ఉన్నారు. ఎస్పీ నుంచి భోజ్‌పురి నటి కాజల్ నిషాద్, బీఎస్పీ నుంచి జావెద్ సిమ్నాని బరిలో ఉన్నారు. కాంగ్రెస్ దన్నుతో బీజేపీకి ఎస్పీ గట్టి పోటీ ఇస్తోంది.

గాజీపూర్.. త్రిముఖ పోరు

ఇక్కడ 2014లో బీజేపీ, 2019లో ఎస్పీ గెలిచాయి. ఎస్పీ నుంచి అఫ్జల్ అన్సారీ, బీఎస్పీ నుంచి ఉమేశ్ సింగ్, బీజేపీ నుంచి పరాస్ నాథ్ రాయ్ పోటీలో ఉన్నారు. ఇక్కడ 20 శాతం ఎస్సీలు, 11 శాతం ముస్లింలు ఉంటారు. ఓటర్లు ఒక్కోసారి ఒక్కో పార్టీకి పట్టం కడుతున్న నేపథ్యంలో త్రిముఖ పోరు ఉత్కంఠ రేపుతోంది. గాజీపూర్ పరిధిలోని 5 అసెంబ్లీ సెగ్మెంట్లలో 4 ఎస్పీ చేతిలోనే ఉన్నాయి!

చందౌలీ... టఫ్ ఫైట్

దేశంలోనే అత్యంత వెనకబడ్డ ప్రాంతాల్లో ఒకటి. ఎస్సీ, ఎస్టీ జనాభా ఎక్కువ. 2014, 2019ల్లో మోదీ వేవ్‌లో బీజేపీ ఖాతాలో పడింది. సిట్టింగ్ ఎంపీ మహేంద్రనాథ్ పాండే ఈసారి హ్యాట్రిక్‌పై గురి పెట్టారు. ఎస్పీ నుంచి వీరేంద్ర సింగ్, బీఎస్పీ నుంచి సత్యేంద్రకుమార్ మౌర్య పోటీలో ఉన్నారు. బీజేపీకి ఎదురుగాలి వీస్తోంది.

మీర్జాపూర్... ప్రాంతీయ పార్టీల హవా

ఒకప్పుడు బందిపోటు రాణి ఫూలన్ దేవి అడ్డా. 1996, 1999లో ఆమె ఎస్పీ తరఫున విజయం సాధించారు! 2001లో ఆమె హత్యానంతరం బీఎస్పీ రెండు సార్లు గెలిచింది. 2014లో అప్నాదళ్ నుంచి అనుప్రియా పటేల్ ఘనవిజయం సాధించారు. 2016లో పార్టీ బహిష్కరణతో అప్నాదళ్(ఎస్) పేరుతో కొత్త పార్టీ పెట్టి ఎన్డీఏ దన్నుతో 2019లో మళ్లీ నెగ్గారు. ఈసారి కూడా ఎన్డీఏ నుంచి బరిలో ఉన్నారు. ఎస్పీ నుంచి రమేశ్ చంద్ర బింద్, ఎస్పీ తరఫున మనీశ్ తివారీ రేసులో ఉన్నారు. మీర్జాపూర్‌లో వెనకబడిన వర్గాలు 49 శాతం, ఎస్సీ, ఎస్టీలు 25 శాతం ఉంటారు.

కుషీనగర్... హోరాహోరీ

గౌతమ బుద్ధుడు మహాపరినిర్వాణం (శరీర త్యాగం) చేసిన చోటు కావడంతో ప్రపంచవ్యాప్తంగా బౌద్ధులు, పర్యాటకులు ఏటా భారీగా వస్తుంటారు. 2008లో ఈ నియోజకవర్గం ఏర్పాటైంది. 2009లో కాంగ్రెస్ బోణీ కొట్టగా 2014, 2019ల్లో బీజేపీ పాగా వేసింది. సిట్టింగ్ ఎంపీ విజయ్ కుమార్ దూబే ఈసారీ బరిలో ఉన్నారు. ఎస్పీ నుంచి అజయ్ ప్రతాప్ సింగ్ (పింటూ). బీఎస్పీ నుంచి శుభ్ నారాయణ్ చౌహాన్ పోటీ చేస్తున్నారు. బీఎస్పీ చీల్చే ఓట్లు కీలకం కానున్నాయి.

పోలింగ్ జరిగే మొత్తం స్థానాలు...

మహారాజ్‌గంజ్, గోరఖ్‌పూర్, కుషీనగర్, దేవరియా, బన్స్‌గావ్ (ఎస్సీ), ఘోసి, సలేంపూర్, బలియా, ఘాజిపూర్, చందౌలీ, వారణాసి, మీర్జాపూర్, రాబర్ట్స్‌గంజ్ (ఎస్సీ)

‘రెమాల్’తో బెంగాల్ అతలాకుతలం

- తీవ్ర తుపానుతో 120 కిలోమీటర్ల వేగంతో గాలులు
- పశ్చిమబెంగాల్‌లో అత్యంత భారీ వర్షాలు
- లక్ష మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- విమానాలు, రైళ్లు రద్దు

కోల్‌కతా: తీవ్ర తుపాను ‘రెమాల్’ ధాటికి పశ్చిమబెంగాల్ అతలాకుతలమవుతోంది. దీని ప్రభావంతో గంటకు 110–120 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. బెంగాల్ తీర ప్రాంత జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, కోల్‌కతా పరిసర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వివరించింది. తీరప్రాంతాల నుంచి 1.1 లక్షల మందిని ఆదివారం యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. రెమాల్‌తో నష్టం తక్కువేనని వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఉత్తర, దక్షిణ పరగణాల జిల్లాల్లోని బలహీన నిర్మాణాలు, విద్యుత్, సమాచార వ్యవస్థలు, కచ్చా రోడ్లు, పంటలు, తోటలకు నష్టం వాటిల్ల వచ్చని చెప్పారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈస్టర్న్, సౌత్ ఈస్టర్న్ రైల్వేలు ఆది, సోమవారాల్లో కొన్ని రైళ్లను రద్దు చేశాయి. కోల్‌కతా విమానాశ్రయం అధికారులు ఆదివారం మధ్యాహ్నం నుంచి 21 గంటలపాటు బయలుదేరాల్సిన, రావాల్సిన 394 సర్వీసులను రద్దు చేశారు. పోలీసులు, ఫైర్ సిబ్బందితోపాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అప్రమత్తం చేశారు. బెంగాల్‌తోపాటు ఉత్తర ఒడిశాలో 26, 27వ తేదీల్లో తుపాను ప్రభావంతో అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. అస్సాం, మేఘాలయ, మణిపూర్, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ తుపాను ప్రభావం తీవ్రంగానే ఉంటుందని అంచనా వేసింది. రక్షణ, సహాయక కార్యక్రమాల సన్నద్ధతపై అధికారులతో ప్రధాని మోదీ ఆదివారం సమీక్ష జరిపారు.

బంగ్లాదేశ్‌లో...

బంగ్లాదేశ్‌లోని పేరా, మోంగ్లా పోర్టుల్లో అత్యంత ప్రమాద 10వ నంబర్ హెచ్చరికను, కోక్స్ బజార్, చిట్టోగ్రామ్‌లలో 9వ నంబర్ హెచ్చరికలను ఎగురవేశారు. అలలు సాధారణం కంటే 8 నుంచి 12 అడుగుల వరకు ఎత్తులో ఎగసిపడుతున్నాయి. 8 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చిట్టగాంగ్ ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులను రద్దు చేశారు.

మేం అలాగే చేస్తాం

- మతప్రాతిపదికన ఎన్నికల ప్రచారం చేస్తున్నారన్నాసరే..
- ఆర్టికల్ 370, యూసీసీ, ముస్లిం కోటాపై అమిత్ షా వ్యాఖ్య

న్యూఢిల్లీ: విపక్షాల విమర్శలకు జడిసేదిలేదని బీజేపీ అగ్రనేత అమిత్ షా స్పష్టంచేశారు. ఆర్టికల్ 370 రద్దు, ఉమ్మడి పౌర స్మృతి, ముస్లింలకు కోటాను వ్యతిరేకిస్తూ ఎన్నికల ప్రచారంలో బీజేపీ మతం అంశాన్ని ముందుకు తెస్తోందని విపక్షాలు విమర్శించినాసరే తాము అలాగే చేస్తామని కుండబద్దలు కొట్టారు. ఆదివారం పీటీఐతో ఇంటర్వ్యూలో షా వెల్లడించిన విషయాలు, ప్రస్తావించిన అంశాలు ఆయన మాటల్లోనే..

మేం అప్పుడు ఓడిపోయాం కదా!

‘‘రాజ్యాంగంలో లేనివిధంగా మత ప్రాతిపదికన ముస్లింలకు రిజర్వేషన్లు విపక్షాలు ఇస్తామంటే వ్యతిరేకిస్తున్నాం. ఆర్టికల్ 370ని రద్దు చేశాం, ఉమ్మడి పౌరస్మృతిని తీసుకొచ్చాం. చేసిన పనులనే చెప్పుకుంటున్నాం. వద్దు అని విపక్షాలు అన్నాసరే మేం అలాగే చేస్తాం. కావాలనే పోలింగ్ శాతాలను ఈసీ ఆలస్యంగా వెల్లడిస్తూ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని విపక్షాలు అంటున్నాయి. ఈవీఎంలను బీజేపీ తమకు అనుకూలంగా మార్చేస్తోందని విపక్షాల చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదు. తెలంగాణ, పశ్చిమబెంగాల్, హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలప్పుడూ ఈసీ ఇలాగే చేసింది. అప్పుడు ఆ రాష్ట్రాల్లో మేం ఓడిపోయాంకదా. ఆ ఎన్నికలు పారదర్శకంగా జరిగితే ఈ ఎన్నికలు కూడా అంతే పారదర్శకంగా జరుగుతున్నట్లే లెక్క. ఓడిపోతానని రాహుల్ గాంధీ ఊహించారు. అందుకే ముందే ఏడ్చేసి, ఏవో కారణాలు చెప్పేసి విదేశాలకు వెళ్లిపోతారు. జూన్ 6న విదేశాలకు వెళ్తారేమో. అందుకే ఏదో ఒకటి చెప్తున్నారు’’



‘400’ అనేది నినాదం కాదు

‘‘ మేం 399 సీట్లు సాధిస్తే ‘ మీకు 400 రాలేదుగా’ అని విపక్షాలు విమర్శిస్తే అది వారి విజ్ఞతకే వదిలేస్తా. ఈసారి 400 సీట్లు గెలుస్తాం అనేది మా నినాదం కాదు. విజయావకాశాలను లెక్కగట్టి చెప్పిన సంఖ్య అది. కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల వల్లే మేం ఈసారి ఎక్కువ స్థానాల్లో గెలవబోతున్నాం. పేద కుటుంబమహిళకు ఏటా రూ.1 లక్ష ఇస్తామని కాంగ్రెస్ అమలుచేయలేని వాగ్దానా లిస్తోంది. 2–3 రాష్ట్రాల్లో కాంగ్రెస్ పాలిస్తోంది. రూ.1 లక్ష సంగతి దేవుడెరుగు గతంలో హామీ ఇచ్చినట్లు(హిమాచల్ ప్రదేశ్‌లో) రూ.1,500 అయినా ఇస్తారేమో చూద్దాం.

బెంగాల్, ఒడిశాలోనూ మాదే హవా

‘‘పశ్చిమబెంగాల్‌లో 24–30 సీట్లు, ఒడిశాలో 16–17 సీట్లు గెలుస్తాం. తమిళనాడులోనూ ఓటు షేర్ పెంచుకుంటాం. ఈసారి కేరళలో ఖాతా తెరుస్తాం. వచ్చే ఐదేళ్లలో దేశమంతటా ఉమ్మడి పౌరస్మృతి అమలుచేస్తాం. మండే ఎండాకాలంలో కాకుండా వేరే కాలంలో ‘ఒకే దేశం–ఒకే ఎన్నికలు’ అమలుచేస్తాం. సంబంధిత బిల్లునూ పార్లమెంట్‌లో ప్రవేశపెడతాం. ఆర్మీలో యువత కోసం అగ్నివీర్‌ను మించిన అద్భుత పథకం లేదు. నాలుగేళ్ల సర్వీస్ తర్వాత చక్కని ప్రతిభ కనబరిచిన వారికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగం ఉంది కదా’’.

ఆర్మీ చీఫ్ పదవీ కాలం నెల పొడిగింపు

న్యూఢిల్లీ: దేశ ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే పదవీ కాలాన్ని కేంద్రం మరో నెలపాటు పొడిగించింది. ‘ఆర్మీ స్టాఫ్ జనరల్ మేజర్ సి.మనోజ్ పాండే పదవీ కాలాన్ని జూన్ 30వ తేదీ వరకు పొడిగించేందుకు కేబినెట్ నియామకాల కమిటీ మే 26వ తేదీన ఆమోదించింది. ఆర్మీ రూల్స్‌– 1954లో రూల్ 16ఏ(4) ప్రకారం ఇది అమల్లోకి వస్తుంది’ అని రక్షణ మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 2022 ఏప్రిల్‌లో బాధ్యతలు చేపట్టిన జనరల్ పాండే ఈ నెల 31వ తేదీన రిటైరవ్వాల్సి ఉంది.

అమెరికాలో సుడిగాలుల బీభత్సం

11 మంది దుర్మరణం

వ్యాలీ వ్యూ (టెక్సాస్): అమెరికాలో టెక్సాస్, ఒక్లహోమా, అర్కాన్సాస్ రాష్ట్రాల్లో భీకర సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. ట్రక్కుల పార్కింగ్ స్టేషన్, ఇళ్లను తుడిచిపెట్టేస్తూ సాగిన విధ్వంసకాండలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్లహోమాలో టోర్నడోలు భీకర వినాశనానికి కారణమయ్యాయి. భీకర గాలుల ధాటికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వేలాది ఇళ్లలో జనం అంధకారంలో మగ్గిపోయారు.

‘ఇండియా’ కూటమి గెలిస్తే హిందువులు రెండో తరగతి పౌరులే..

- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు రద్దు చేస్తారు
- మొత్తం రిజర్వేషన్లు ముస్లింలకే కట్టబెడతారు
- ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో మోదీ

మీర్జాపూర్/దేవరియా: దేశంలో మతపరంగా మెజార్టీగా ఉన్న ప్రజలను(హిందువులు) రెండో తరగతి పౌరులుగా మార్చేందుకు ప్రతిపక్ష ‘ఇండియా’ కూటమిలోని పార్టీలు కుట్ర పన్నుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. ఓటు బ్యాంక్‌కు మతపరంగా రిజర్వేషన్లు కట్టబెట్టడమే లక్ష్యంగా రాజ్యాంగాన్ని మార్చేందుకు పథకం రచిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్, ఘోసీ, దేవరియాలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధానమంత్రి మాట్లాడారు. ప్రతిపక్షాలు దేశంలో కులాల మధ్య చిచ్చు పెడుతున్నాయని మండిపడ్డారు. వేర్వేరు కులాలు పరస్పరం కొట్టుకొనేలా చేయడమే ఇండియా కూటమి ధ్యేయంగా మారిపోయిందన్నారు. కులాలను బలహీనపర్చి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. బహిరంగ సభల్లో మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..



రాజ్యాంగాన్ని మళ్లీ రాస్తారు..

‘‘ప్రతిపక్షాలు సాగిస్తున్న కుట్రల గురించి ప్రజలను హెచ్చరించడానికే ఈ రోజు పూర్వాంచల్‌కు వచ్చా. విపక్ష కూటమికి అధికారం కట్టబెడితే మొదట రాజ్యాంగాన్ని మార్చేస్తారు. మతపరంగా రిజర్వేషన్లు ఇవ్వడానికి వీలుగా రాజ్యాంగాన్ని మళ్లీ రాస్తారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు రద్దు చేస్తారు. మొత్తం రిజర్వేషన్లు ముస్లింలకే కట్టబెడతారు. ముస్లింలను రాత్రికి రాత్రే ఓబీసీ కేటగిరీలో చేరుస్తారు. ఓబీసీ కేటగిరీ కింద వారికి రిజర్వేషన్లు కల్పిస్తారు. మెజార్టీ ప్రజలను రెండో తరగతి పౌరులుగా మార్చేయాలని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు భావిస్తున్నాయి.

ఇంతకంటే అన్యాయం ఉంటుందా?

2014 కంటే ముందు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాత్రికి రాత్రే చట్టాన్ని మార్చేసింది. పలు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను మైనార్టీ విద్యాసంస్థలుగా గుర్తించింది. దాంతో ఆయా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు దక్కడం లేదు. అక్కడ కేవలం ముస్లింలకే ప్రవేశాలు లభిస్తున్నాయి. గిరిజనులు, దళితులు, వెనుకబడిన తరగతుల బిడ్డలకు ఇంతకంటే అన్యాయం ఇంకేదైనా ఉంటుందా?

మూడోసారీ మాదే విజయం

ఒక మంచి ఇల్లు కట్టించాలంటే 10 మంది తాపీ మేస్త్రీలను నియమించుకుంటారా? అలా ఎవరూ చేయరు. ఒక్కరికే అప్పగిస్తారు. విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఐదేళ్లలో ఐదుగురు ప్రధానమంత్రులు వస్తారట! ఏడాదికొకరు అధికారంలో ఉంటారట! ఇదెక్కడి చోద్యం. ఇలా జరగడం ఏక్కడైనా ఉందా? పదవి కాపాడుకోవడానికి ఆరాటపడే ప్రధానమంత్రి ఇక ప్రజలకేం చేస్తారు. దేశాన్ని బలోపేతం చేయగలరా? బలమైన దేశం కోసం బలమైన ప్రధాని కావాలని ప్రజలు నిర్ణయించుకున్నారు. మాకు రెండు సార్లు అధికారం అప్పగించారు. మూడోసారి కూడా మమ్మల్ని గెలిపించబోతున్నారు. ఓడిపోయేవారికి ఓటు వేసి ఓటు వృథా చేసుకోవద్దని ప్రజలు నిర్ణయానికొచ్చారు’’ అని మోదీ స్పష్టం చేశారు.

ఛాయ్ కప్పులు కడుగుతూ...

బాల్యంలో ఛాయ్ కప్పులు, ప్లేట్లు కడుగుతూ, కస్టమర్లకు ఛాయ్‌లు అందిస్తూ పెరిగానని ప్రధాని మోదీ అన్నారు. ఛాయ్‌కి, తనకు మధ్య లోతైన అనుబంధం ఉందని చెప్పారు.

ఢిల్లీ ఆస్పత్రిలో ఘోర అగ్నిప్రమాదం.. ఏడుగురు నవజాత శిశువులు మృతి

- మరో ఐదుగురిని కాపాడిన స్థానికులు
- శనివారం అర్ధరాత్రి జరిగిన ఘటన
- ఆస్పత్రి యజమాని అరెస్ట్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని వివేక్ విహార్‌లో శనివారం అర్ధరాత్రి ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బేబీ కేర్ న్యూ బోర్న్ హాస్పిటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడుగురు పసికందులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో మొదలైన మంటలు చుట్టుపక్కలున్న మరో రెండు భవనాలకు సైతం వ్యాపించినట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు. మొత్తం 16 ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చామన్నారు. ఆస్పత్రి రెండో అంతస్తులో నిల్వ ఉంచిన ఆక్సిజన్ సిలిండర్లు పేలడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని చెప్పారు. మంటలు వ్యాపించిన ఆస్పత్రి భవనం నుంచి మొత్తం 12 మంది శిశువులను బయటకు తీసుకురాగా వారిలో ఏడుగురు చనిపోయారని ఫైర్ చీఫ్ అతుల్ గర్గ్ చెప్పారు. మిగతా ఐదుగురిలో కొందరు స్వల్పంగా గాయపడ్డారన్నారు. మంటలను గమనించిన స్థానికులు, షహీద్ సేవా దళ్ కార్యకర్తలు కలిసి భవనం వెనుక వైపు నుంచి నిచ్చెనల ద్వారా పైకెక్కి చిన్నారులను కిందికి తీసుకువచ్చారని ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రి సిబ్బంది పరారైనట్లు చెబుతున్నారు. ఆస్పత్రి యజమాని నవీన్ కిచిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నామని షాదారా డీసీపీ సురేంద్ర చౌదరి చెప్పారు. ఈ దారుణంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర విచారం వెలిబుచ్చారు. ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబాలను కోరారు.



ఆస్పత్రి వెనుకవైపు నుంచి శిశువులను తీసుకొస్తున్న స్థానికులు, ఫైర్ సిబ్బంది

పపువా న్యూ గినియా విషాదం.. మరణాలు 670కి పైనే..

మెల్‌బోర్న్: పసిఫిక్ ద్వీప దేశం పపువా న్యూ గినియాలో శుక్రవారం కొండచరియలు విరిగిపడి గ్రామాన్ని నేలమట్టం చేయడం తెల్సిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య 670కిపైనే అని ఐరాసకు చెందిన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ మైగ్రేషన్(ఐవోఎం) ఆదివారం తెలిపింది. ఎంగా ప్రావిన్స్ అధికారులు, బాధిత యంబలి గ్రామస్తులు అందించిన సమాచారాన్ని బట్టి 150కిపైగా ఇళ్లు భూస్థాపితం కాగా వాటిలోని 670 మంది శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు ఐవోఎం అంచనా వేసింది. క్షతగాత్రులు, గల్లంతైన వారి సంఖ్యలో స్పష్టత రాలేదని పేర్కొంది. ఆదివారం ఐదు మృతదేహాలను వెలికి తీసినట్లు స్థానిక అధికారులు చెప్పారు. మట్టి, బండరాళ్లు, చెట్లు మూడు నుంచి నాలుగు ఫుట్‌బాల్ మైదానాలంత విస్తీర్ణంలో 6 నుంచి 8 మీటర్ల లోతున గ్రామాన్ని భూస్థాపితం చేశాయని, లోపల చిక్కుకున్న వారు బతికి బట్టకట్టేందుకు అవకాశాలు తక్కువని ఐవోఎం అంటోంది. మరోవైపు స్థానిక గిరిజన తెగల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. శనివారం జరిగిన ఘర్షణలో ఎనిమిది మంది చనిపోయారు. దాంతో సహాయక సిబ్బంది, అత్యవసరాలను చేరవేయడానికి ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించింది.

మానవ తప్పిద మహావిషాదం

- రాజ్‌కోట్ గేమ్‌జోన్ దుర్ఘటనపై గుజరాత్ హైకోర్టు వ్యాఖ్య
- 33కు పెరిగిన మరణాల సంఖ్య

అహ్మదాబాద్: రాజ్‌కోట్‌లో గేమ్‌జోన్‌లో అగ్నిప్రమాద ఘటనపై గుజరాత్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. మానవ తప్పిద మహావిషాదంగా అభివర్ణించింది. ఘటనను సూమోటోగా స్వీకరించిన జస్టిస్ బీరెన్ వైష్ణవ్, జస్టిస్ దేవాన్ దేశాయ్‌ల హైకోర్టు ధర్మాసనం ఈ కేసును ఆదివారం విచారించింది. ‘‘ ప్రాథమిక ఆధారాలను చూస్తే ఇది మానవతప్పిదమే స్పష్టంగా తెలుస్తోంది. ఏ చట్టనిబంధనల కింద ఇలాంటి గేమింగ్ జోన్లు, రీక్రియేషనల్ కేంద్రాలను ఏర్పాటుచేశారు?’ అని కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ‘‘ గుజరాత్ కాంప్రిహేన్సివ్ జనరల్ డెవలప్‌మెంట్ కంట్రోల్ రెగ్యులేషన్స్(జీడీసీఆర్) నిబంధనల్లో ఉన్న లొసుగులను తెలివిగా వాడుకున్నట్లు తెలుస్తోంది. గేమింగ్ జోన్లు రాజ్‌కోట్‌తోపాటు అహ్మదాబాద్, వడోదర, సూరత్‌లలో ఉండటంతో ఆయా నగర మున్సిపల్ కార్పొరేషన్ల తరఫు అడ్వకేట్లు అందర్నీ సోమవారం తమ ఎదుట హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ‘‘ నిరభ్యంతర సర్టిఫికెట్, నిర్మాణ అనుమతులు వంటి వాటి నుంచి తప్పించుకునేందుకు టీఆర్‌పీ గేమ్ జోన్ నిర్వాహకులు ఏదో తాత్కాలిక ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకుని చిన్నారులు రక్షణను గాలికొదిలేశారు. గేమ్‌జోన్‌లో అనుమతి లేని, మండే స్వభావమున్న పెట్రోల్, ఫైబర్, ఫైబర్ గ్లాస్‌షీట్లను భద్రపరిచిన చోటులోనే అగ్నిప్రమాదం జరిగింది’ అని కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.

15మంది జాడ గల్లంతు

ఆదివారం నాటికి మృతుల సంఖ్య 33కు పెరిగింది. మరో 15 మందికిపైగా జనం జాడ తెలీడం లేదని అధికారులు వెల్లడించారు. నానామావా రోడ్‌లోని ఘటనాస్థలిని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆదివారం సందర్శించారు. తర్వాత క్షతగాత్రులను ఆస్పత్రిలో కలిసి పరామర్శించారు. చనిపోయిన వారిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఉన్నారు. ‘ ఘటన కారకులందరినీ ఉరితీయాలి. ఏ ఒక్కరికీ బెయిల్ కూడా దొరకొద్దు. బెయిల్ ఇస్తే వారిని నేనే చంపేస్తా’ అని ఏకైక కుమారుడు, నలుగురు బంధువులను పోగొట్టుకున్న ప్రదీప్‌సిన్హ్ చౌహాన్ ఆవేశంగా చెప్పారు. ఇటీవల నిశ్చితార్థమైన ఒక జంట సైతం ప్రమాదంలో అగ్నికి ఆహుతైంది. గేమ్‌జోన్ ఉన్న అమ్యూజ్‌మెంట్ పార్క్‌కు ఎలాంటి ఫైర్ ఎన్‌ఓసీ సర్టిఫికెట్ లేదని ఎఫ్ఐఆర్‌లో రాసి ఉంది.

ఎలక్షన్ బీట్

ఆరో విడతలో 63.36 శాతం

న్యూఢిల్లీ: లోకసభ ఎన్నికల్లో భాగంగా ఆరో విడతలో 8 రాష్ట్రాలు, యూటీల్లో శనివారం 58 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో తాజా గణాంకాల ప్రకారం పోలింగ్ 63.36 శాతానికి పెరిగింది. పశ్చిమబెంగాల్ పరిధిలోని ఎనిమిది లోక్‌సభ స్థానాల్లో 82.71 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారి ఆదివారం వెల్లడించారు. ఇప్పటివరకు ముగిసిన ఆరు దశలను పరిశీలిస్తే అన్నింటికన్నా తక్కువగా ఐదో దశలో 62.2 శాతం పోలింగ్ నమోదైంది. ఆరో దశ కింద 2019లో 59 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 64.4 శాతం పోలింగ్ నమోదైంది. ప్రతి దశలోని తుది పోలింగ్ శాతాలు ఓట్ల లెక్కింపు తర్వాతే అందుబాటులోకి వస్తాయని కేంద్ర ఎన్నికల సంఘం వివరించింది. పోస్టల్ బ్యాలెట్ల ఓట్లను లెక్కించడం వల్లే పోలింగ్ శాతాలు పెరుగుతాయని గుర్తుచేసింది.

మోదీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి!

నితీశ్ కుమార్ వ్యాఖ్యలతో అవాక్కైన బీజేపీ నేతలు

పట్నా: పార్టీ మారాక ఎన్నికల ప్రచారంలో పాత పార్టీనే పొగిడిన నేతలను మనం చేశాం. అదే తరహాలో ప్రసంగాల్లో తప్పులు దొర్లిన ఘటన ఒకటి బిహార్‌లో ఆదివారం జరిగింది. బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్ పట్నాలో ఎన్నికల ప్రచారర్యాలీలో ప్రసంగించారు. ‘‘ నరేంద్ర మోదీ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నా’’ అని నితీశ్ అనేసరికి అక్కడున్న వారంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. అక్కడే ఉన్న జేడీయూ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ కుమార్ ఝా.. నితీశ్‌కు ప్రసంగంలో దొర్లిన తప్పును గుర్తుచేశారు. వెంటనే పొరపాటును సరిదిద్దుకోవాల్సిందిపోయి నితీశ్ ఆ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. ‘అవును. నిజమే ఆయన ప్రధాని అని నాకూ తెలుసు’ అని వ్యాఖ్యానించారు. దీంతో ఆశ్చర్యపోవడం అక్కడి వారి వంతయింది. మంచి కోసమే తాను ఆర్జేడీ నుంచి రెండు సార్లు తెగతెంపులు చేసుకున్నానని నితీశ్ సమర్థించుకున్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం: కేజ్రీవాల్

చండీగఢ్: మోదీ పాలనలో దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఆరోపించారు. దేశ స్వేచ్ఛ, రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో పంజాబ్ ప్రజలు మరోసారి ముందుండి నడవాలని పిలుపునిచ్చారు. ఆదివారం పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కేజ్రీవాల్ మాట్లాడారు. ‘‘ సార్వత్రిక ఎన్నికలపై మార్చి 16న ఈసీ ప్రకటన చేస్తే ఐదు రోజులకే నన్ను అరెస్ట్‌చేశారు. మహారాష్ట్రలో ఎన్సీపీని మోదీజీ ముక్కలు చేసి పార్టీని, పార్టీ గుర్తును లాగేశారు. శివసేనను రెండు ముక్కలుగా విడగొట్టారు. ఎన్నికలకు ముందే హేమంత్ సోరెన్‌నూ అరెస్ట్‌చేశారు. పాక్‌లో ఇమ్రాన్‌ను, బంగ్లాదేశ్‌లో అన్ని విపక్షాల నేతలను జైలులో పడేశారు. మన దేశంలోనూ నియంతృత్వం విస్తరిస్తోంది. నా కోసం మీ దగ్గరకు రాలేదు. మన దేశాన్ని కాపాడండి అని వేడుకునేందుకే వచ్చా’’ అని కేజ్రీవాల్ అన్నారు.

తొలిసారి ‘వర్క్ ఫ్రమ్ జైల్’: రాజ్‌నాథ్

చండీగఢ్: వర్క్ ఫ్రమ్ హోం గురించి విన్నానని, వర్క్ ఫ్రమ్ జైల్ గురించి మొదటిసారి వింటున్నానని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎద్దేవా చేశారు. నిరపరాధినని నిరూపించుకునేవరకు.. ఆరోపణలకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేసే నైతికత ప్రతి నాయకుడికి ఉండాలని, కానీ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు అది లోపించిందని కేంద్రమంత్రి విమర్శించారు. బీజేపీ ఫతేగఢ్ సాహిబ్ అభ్యర్థి గెజ్జా రామ్ వాల్మీకి కోసం ఖన్నాలో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో రాజ్‌నాథ్ మాట్లాడారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం మద్యం కుంభకోణంలో చిక్కుకుందని, ఇక పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం గురించి చెప్పాల్సిన పనిలేదన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించిన నేత ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం అదే పార్టీతో కూటమి కట్టారని విమర్శించారు. తాను ముఖ్యమంత్రి అయితే సీఎం క్యాంపు కార్యాలయంలో నివసించనని చెప్పిన కేజ్రీవాల్.. ఆ తరువాత సీఎం నివాసాన్ని ‘శీష్‌మహల్’గా మార్చి కోట్లాది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

మోదీ వ్యాఖ్యలు బిహార్‌కు అవమానం: ఖర్గే

ససరాం(బిహార్): విపక్ష నేతలనుద్దేశించి ముజ్రా అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. ‘ముజ్రా బిహార్‌లో మాత్రమే చేస్తారని మోదీ మాటలకు దానర్థం. ఇటువంటి వ్యాఖ్యలతో బిహార్‌ను ఆయన అవమానించారు. ప్రధాని మాట్లాడే విధానం ఇది కాదు. ఆయన ఒక రాజనీతిజ్ఞుడి మాదిరిగా మాట్లాడాలి’అని హితవు పలికారు. ఖర్గే ఆదివారం బిహార్‌లోని సాసారాంలో ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు. విపక్ష కూటమి నేతలు ముస్లిం ఓటు బ్యాంకును సంతృప్తిపర్చేందుకు ముజ్రా(వేడుకల్లో అతిథులను అలరించే నృత్యం) చేస్తోందన్న మోదీ వ్యాఖ్యలపై మండిపడ్డారు. ‘మోదీ తాను తీస్ మార్ ఖాన్ అనుకుంటున్నారు. అది తప్పు. ప్రజలే అసలైన ఘనాపాఠీలు’’అన్నారు.

మోదీ భాంగ్రా, భరతనాట్యం చేస్తున్నారా?

ముజ్రా’ వ్యాఖ్యలకు అసదుద్దీన్ ఒవైసీ కౌంటర్

పాలీగంజ్ (బిహార్): ముస్లింల ఓట్ల కోసం విపక్ష పార్టీలు ముజ్రా నృత్యం చేస్తున్నాయని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ఘాటుగా స్పందించారు. ఆదివారం బిహార్‌లోని పాటలీపుత్ర లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మోదీ శనివారం ప్రసంగించిన అదే ప్రాంతంలో ఒవైసీ ఆదివారం ప్రసంగించారు. ‘‘ ప్రధాని మాట్లాడాల్సిన భాషేనా అది? మాకు మాటలు రావని మోదీ భావిస్తున్నారా? చైనా 2,000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించినప్పుడు మోదీ డిస్కో డ్యాన్స్ చేస్తున్నారా? సీఏఏ పరిధిలోకి ముస్లింలను అనుమతించకుండాచేసి వారి హక్కులు కాలరాసినప్పుడు మోదీ భాంగ్ర నృత్యం చేస్తున్నారా?. హిందువుల సమ్మేళనమైన ధర్మ్ సంసద్‌లో ముస్లింల గురించి, ప్రత్యేకంగా ముస్లిం తల్లులు, అక్కాచెల్లెళ్ల గురించి అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు మోదీ భరతనాట్యంలో మునిగిపోయారా అని ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘‘ తాను సాధారణమైన వ్యక్తిని కాదని మోదీనే స్వయంగా అన్నారు. ఇక తాను దేవుడిని అని ప్రకటించుకోవడం ఒక్కటే మిగిలిపోయింది. తననే పూజించాలని కూడా అంటారేమో’’ అని ఎద్దేవా చేశారు.

సాక్షి కరీంనగర్

సోమవారం । 27 । మే । 2024



మల్లన్న సన్నిధిలో సందడి

ఓదెల:మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పట్నాలు, బోనాలు సమర్పించారు.



తరలివచ్చి.. మొక్కులు తీర్చి

కొండగట్టు: అంజన్న సన్నిధిలో ఆదివారం రద్దీ నెలకొంది. వేలాదిమంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

గరిష్టం/కనిష్టం
42.0/31.0

వాతావరణం

నేడు జిల్లాలో తీవ్రమైన ఎండ ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

మురుగులో కాసుల వేట

- గతేడాది అమాంతం పెరిగిన డీసిల్టింగ్ అంచనాలు
- మున్సిపల్ సాధారణ నిధుల దుర్వినియోగం
- నాలాల నిర్వహణలో అమలుకాని సీడీఎంఏ నిబంధనలు
- కనుమరుగైన నాలా మ్యాన్ వాహనం

సాక్షిప్రతినిధి,కరీంనగర్:


కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీకే) ఆధ్వర్యంలో నాలాల నిర్వహణ, డీసిల్టింగ్ ప్రక్రియ ఆశించినంత మేరకు ఫలితాలు ఇవ్వడం లేదు. నాలాల నిర్వహణలో కాసులవేట ఎక్కువగా.. వ్యర్థాలు తొలగించాల్సిన ఆలోచన తక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది. గతేడాది అమాంతం పెరిగిన డీసిల్టింగ్ ఖర్చే దీనికి నిదర్శనం. ఏటా కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) వర్షాకాలం ముందు జాగ్రత్తలో భాగంగా మురుగు కాల్వల్లో చర్యలు చేపట్టాల్సిందిగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఆదేశాలు జారీ చేస్తుంది. ఇందులో భాగంగా రెండు మీటర్ల వెడల్పు ఉన్న ఓపెన్ నాలాల్లో స్లాబ్ లేకుండా ఓపెన్‌గా పెట్టాలి. ఈ నాలాలను డీసిల్టింగ్ చేయాలి. ఇందుకు నగరపాలక సంస్థ ఏటా నాలాల్లో సిల్ట్ (మురుగు ఇసుక వ్యర్థాలు) తొలగించేందుకు మున్సిపల్ సాధారణ ఫండ్స్‌తో టెండర్లు పిలుస్తుంది.

శ్లాబులతో ఇబ్బందులు

నాలాల నిర్వహణ విషయంలో సీడీఎంఏ పలు నిబంధనలు రూపొందించింది. వీటి ప్రకారం.. రెండు మీటర్ల వెడల్పు ఉన్న ఓపెన్ నాలాల్లో స్లాబ్ లేకుండా ఓపెన్‌గా పెట్టాలి. రెండు మీటర్ల కన్నా అధిక వెడల్పు ఉన్న నాలాలకు ప్రతీ 30 మీటర్లకు మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయాలి. ఈ నిబంధనలు పాటించడం వల్ల అటు పౌరులకు రక్షణతోపాటు, నాలాల నిర్వహణ సులభతరమవుతుంది. కానీ, కరీంనగర్‌లో నాలాల నిర్వహణ దీనికి వ్యతిరేకంగా ఉంది. రెండు మీటర్ల కన్నా తక్కువ వెడల్పు ఉన్న నాలాలు పలుచోట్ల మూసి ఉండటం, రెండు మీటర్ల కన్నా అధిక వెడల్పు ఉన్న నాలాలకు రక్షణ కంచె, మ్యాన్ హోల్స్ లేకపోవడం గమనార్హం. చాలా చోట్ల 50 నుంచి 400 మీటర్ల వరకు శ్లాబులు వేయడంతో నాలాలు మూసుకుపోయాయి. ఉదాహరణకు.. శనివారం అంగడి నుంచి బొమ్మ వెంకన్న భవనం, అక్కడ నుంచి వరాహస్వామి ఆలయం వరకు ఉన్న వరద కాలువ మీద చాలా వరకు శ్లాబుతో కప్పి ఉంది. ఫలితంగా ఈ కాలువలో టన్నుల కొద్ది వ్యర్థాలు అలాగే మిగిలిపోతున్నాయి.

2023లో పెరిగిన అంచనా వ్యయం

ఏటా వర్షాకాలానికి ముందు బల్దియా నాలాల్లో డీసిల్టింగ్ ప్రక్రియ చేపడుతుంది. ఈ వ్యయం ప్రతీ సంవత్సరం రూ.30 లక్షలకు అటూఇటుగా ఉంటుంది.



వరాహస్వామి ఆలయం వెనక వైపు ఓపెన్ నాలా



బల్దియా కొనుగోలు చేసిన నాలా మ్యాన్ వాహనం

సంవత్సరం	పనిపేరు	పనులు	టెండర్లు
2021	డీసిల్టింగ్	8	రూ.30.53 లక్షలు
2022	డీసిల్టింగ్	8	రూ.31.60 లక్షలు
2023	డీసిల్టింగ్	15	రూ.54.58 లక్షలు
2024	డీసిల్టింగ్	16	రూ.38.22 లక్షలు

నాలా మ్యాన్ వాహనం ఎక్కడ?

ప్రతీ వర్షాకాలంలో చేపట్టే డీసిల్టింగ్ ప్రక్రియ కోసం బల్దియా 2020లో దాదాపు రూ.19.75 లక్షలతో 'నాలా మ్యాన్' వాహనం కొనుగోలు చేసింది. ఆ ఏడాది నాలా డీసిల్టింగ్ పనుల్లో ఈ వాహనాన్ని వినియోగించారు. ఆ తరువాత ఈ వాహనం కనిపించలేదు.

గతేడాది ఇదేపనికి రూ.54.58 లక్షలు కేటాయించి, ఈ ఏడాది రూ.38.22 లక్షలతో అంచనాలు రూపొందించారు. ఇది ఎలా సాధ్యమైందో అధికారులకే తెలియాలి. 2023లో బక్రీద్, రంజాన్ సందర్భంగా ఈద్గాల్లో ఏర్పాట్ల విషయంలోనూ చేసిన ఖర్చు ఏటా చేసే ఖర్చు సగటు కన్నా 50 శాతం పెరగడం విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే. పలు ఫెయిర్స్ అండ్ ఫెస్టివల్స్ ప్రోగ్రాం కింద బల్దియా 2023 సంవత్సరంలో చేసిన అన్ని ఎస్టిమేషన్లను పరిశీలిస్తే.. చాలా విషయాలు బయటపడతాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

డి–94 కాలువలోనూ పూడిక తీత..

కొత్తపల్లి మండలంలో మొదలై రేకుర్తి మీదుగా కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందించే ప్రధాన వనరు డీ–94 కాలువ. రేకుర్తిలోని షేఖాబీ కాలనీ నుంచి జగిత్యాల రోడ్ నుంచి గౌడ్స్ కాలనీ వరకు కాలువను శుభ్రం చేయడానికి బల్దియా రూ.4.82 లక్షలతో అంచనాలకు మించి టెండర్లు పిలవడం విమర్శలకు దారి తీసింది. ఇరిగేషన్ ఆధ్వర్యంలో ఉన్న డీ–94 కెనాల్‌లో పలువురు స్థానికులు తమ నివాసాల నుంచి డ్రైనేజీ పైపులైన్లు వేసి, వ్యర్థాలను నేరుగా కాలువలోకి వదులుతున్నారు. దీనిపై పలువురు ఇరిగేషన్ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. బల్దియా బాధ్యత వహించాలని ఖరాఖండిగా చెప్పడంతో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ సిల్టింగ్ పనులు చేపడుతున్నారు. దీనిపై ఎంసీకే ఈఈ రొడ్డ యాదగిరిని సంప్రదించగా.. పెరిగిన అంచనా వ్యయం వివరాలను పరిశీలిస్తామని వివరణ ఇచ్చారు.

న్యూస్‌రీల్

రైతులకు జీలుగ విత్తనాల కష్టాలు



చిగురుమామిడి డీసీఎంఎస్ ఎరువుల దుకాణం ఎదుట బారులు తీరిన రైతులు

చిగురుమామిడి: చిగురుమామిడి డీసీఎంఎస్ ఎరువుల దుకాణంలో ఆదివారం రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. చాలామంది రైతులు విత్తనాలకోసం ఉదయమే వచ్చి క్యూ లైన్‌లో నిల్చున్నారు. విత్తనాలు దొరకపోవడంతో వెనుదిరిగారు. గత రెండు విడతలుగా 80 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయి. వాటిని వ్యవసాయశాఖ అధికారులు 260మంది రైతులకు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి ఒక బ్యాగు చొప్పున అందించారు. సబ్సిడీ పోను బ్యాగు ధర రూ.1116 ఉండగా.. చాలా మంది రైతులు తమకు విత్తనాలు అందలేదని వాపోయారు. 100 క్వింటాళ్ల విత్తనాలు తెప్పిస్తే సరిపోతుందని తెలిపారు.

మన సంస్కృతిని రక్షించుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ స్వర్ణలత

విద్యానగర్: మన సంస్కృతి, సంప్రదాయాలను రక్షించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ మారోజు స్వర్ణలత అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్లో జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. మన దేశ సనాతన ధర్మం గొప్పదన్నారు. శాస్త్ర, సాంకేతికతలను అందిపుచ్చుకుంటూనే మన సంస్కృతిని రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వేములవాడ ద్రోణాచారి, అధ్యక్షుడు కట్ట విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి గజ్జెల హరిహరాచారి, ఉపాధ్యక్షుడు గద్దె సత్యనారాయణ, కోశాధికారి యాస్వాడ అంజయ్య, సంయుక్త కార్యదర్శి బండ్ల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: గోవాలో ఈనెల 25, 26 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన దమ్మికా కాయ్ షిటో రియో కరాటే అకాడమీకి చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు అకాడమీ చీఫ్ ఆర్.ప్రసన్న కృష్ణ తెలిపారు. అండర్ 14 కేటగిరీలో కుమిటీ, కటాస్ విభాగంలో పాల్గొన్న మధు, ఆదిత్యసాయి(బంగారు), శ్రితిక్ చందన్, శ్రీచరణ్, మణితేజ(రజత) పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన చిన్నారులను సంఘం ప్రధాన కార్యదర్శి బండారి సంతోశ్, కోచ్ వినోద్ అభినందించారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

కరీంనగర్: కరీంనగర్ ప్రభుత్వ బధిరుల(చెవిటి)ఆశ్రమ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సర ప్రవేశాలకు బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 6వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో, 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. 6 నుంచి 14 ఏళ్లలోపు ఉన్న బాలబాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాలోని బధిర బాలబాలికలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఉచిత విద్య, భోజన సదుపాయాలతో పాటు పాఠ్య, నోట్‌బుక్స్, ఏకరూప దుస్తులు అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు సదరం ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, టీసీ, రెండు ఫొటోలతో కరీంనగర్‌లోని మల్కాపూర్ రహదారి శాతవాహన విశ్వవిద్యాలయం సమీపంలోని పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 90002 21301, 9000013639, 9666868755, 9491476253 నంబర్లను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

జీవన సాఫల్య పురస్కారం అందుకున్న 'నలిమెల'



కరీంనగర్‌కల్చరల్: ఆచార్య రవ్వ శ్రీహరి సంస్మృతాంధ్ర సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రానికి చెందిన బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్‌కు మహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారం అందించారు. తెలుగు భాషా సాహిత్యంలో విశేష పరిశోధనకు గానూ పురస్కార కింద రూ.50వేల నగదు, జ్ఞాపికను పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహరెడ్డి అందజేశారు. ప్రొఫెసర్ యాదగిరి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఆచార్య పిల్లలమర్రి రాములు, వెలిచాల కొండల్‌రావు, సీనియర్ సంపాదకుడు రామచంద్రమూర్తి, నగనూరి శేఖర్, గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, బీవీఎన్.స్వామి, మాడిశెట్టి గోపాల్ పాల్గొన్నారు.

ఇంటర్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి: పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకులంలో మిగిలిన జూనియర్ ఇంటర్ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్వాతి కోరారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 31వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, వొకేషనల్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయని, దరఖాస్తు రుసుము కింద రూ.100 చెల్లించాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశం ఉపయోగించుకోవాలని, గురుకుల సొసైటీ పరిధిలోని నాన్ సీవోఈ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఈ అవకాశం ఉందని తెలిపారు.

పత్తి విత్తనం.. ధరలకేదీ కళ్లెం?

- ప్యాకెట్‌పై రెండింతలు వసూలు
- విత్తనాల కృత్రిమ కొరత పేరిట దండుకుంటున్న వైనం
- పట్టించుకోని వ్యవసాయశాఖ
- టాస్క్‌ఫోర్స్ ఉన్నట్లా.. లేనట్లా?
- దిక్కుతోచని స్థితిలో జిల్లా రైతాంగం

కరీంనగర్ అర్బన్: పత్తి విత్తనాల కొరత పేరిట వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారు. నియంత్రించాల్సిన వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది. క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం అన్నదాతలకు శాపంగా మారింది. సాక్షాత్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలోనే పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తుండగా.. ఇక పల్లెల్లో పరిస్థితి ఏమిటో ఊహించుకోవచ్చు. వానాకాలం సీజన్ ముంచుకొస్తుంటే టాస్క్‌ఫోర్స్ ఉందా లేదా అన్నది అధికారులు ప్రకటించకపోవడం, ఫిర్యాదు నంబర్లు వెల్లడించకపోవడం వ్యాపారులకు వరమవుతోంది.

రెండు, మూడింతల ధరలు

పత్తి ప్యాకెట్ ధర రూ.862 కాగా, ఎక్కువ ధరకు విక్రయించవద్దని ఇటీవలే సీఎంతోపాటు వ్యవసాయ శాఖ మంత్రి స్పష్టం చేశారు. కానీ, జిల్లాలో మాత్రం విరుద్ధ పరిస్థితి ఉంది. అధికారులతో ఉన్న లోపాయికారి ఒప్పందంతో ఇప్పటికే క్వింటాళ్ల కొద్దీ ప్యాకెట్లను నిల్వ చేసిన ఓ మార్వాడి వ్యాపారి భారీగా ధరలను పెంచేసి, విక్రయిస్తుండగా మరి కొందరు ఇదే దారిని అనుసరిస్తుండటంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బ్రాండ్ పేరిట వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. జిల్లాలో వరి తర్వాత అధిక విస్తీర్ణంలో సాగయ్యేది పత్తి. దీంతో రెండు నెలల ముందుగానే పత్తి విత్తనాలను గోడౌన్లలో నిల్వ చేసిన వ్యాపారులు తీరా కర్షకులు కొనుగోలు చేసే సమయంలో కొరత పదాన్ని ఉచ్చరిస్తూ కాసులు దండుకుంటున్నారు. ఒక్కో ప్యాకెట్‌కు రూ.1,400, బ్రాండ్ పేరిట రూ.2,500 అంటూ కొత్త రాగం పాడుతున్నారు. అదీ ముందస్తుగా అడ్వాన్స్ ఇస్తేనే ఇవ్వగలమని చెబుతుండటం విశేషం. రాశి, నూజివీడ్, నాత్‌సీడ్స్, సాకేత్, యూఎస్ కంపెనీల విత్తనాలకు మార్కెట్లో కొరత సృష్టించి, వీలైనంత దండుకుంటున్నారు. ఇక, సాకేత్ విత్తన ప్యాకెట్‌ను రూ.2,500 విక్రయిస్తున్నారు. ఇదెక్కడి అన్యాయమంటే.. ఎవరికీ చెప్పమంటేనే బ్లాక్ మార్కెట్ నుంచి తెప్పిస్తామని చెబుతున్నారు. డిస్ట్రిబ్యూటర్లకు ప్యాకెట్ రూ.700కు లభిస్తుండగా, ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ రూ.862. అయినా, అధిక ధరలతో రైతులను పీల్చిపిప్పి చేస్తున్నారు.

అధికారులు ఏం చేస్తున్నట్లు?

వ్యవసాయశాఖ పక్కాగా వ్యవహరిస్తే ఒక్క ప్యాకెట్ కూడా బ్లాక్ మార్కెట్‌కు వెళ్లే పరిస్థితి లేదు. కానీ, కొందరు అధికారులతో మామూళ్ల బంధంతో వ్యాపారులకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. వానాకాలం సీజన్‌కు రెండు నెలల ముందే జిల్లా వ్యవసాయ అధికారి, ఏడీఏలు, ఏవో, ఏఈవోలు సీడ్ డిస్ట్రిబ్యూటర్లు, రిటేల్, హోల్‌సేల్ వ్యాపారుల గోడౌన్లను తనిఖీ చేసి, రిజిస్టర్లను పరిశీలించాలి. ఏయే విత్తనాలు విక్రయిస్తున్నారు.. ఏయే కంపెనీ సీడ్ ఎంత ఉంది.. అనే వివరాలను వ్యాపారులు కచ్చితంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలి. అధికారుల పర్యవేక్షణ కూడా అదేస్థాయిలో ఉండాలి. కానీ, అవేం జరగడం లేదన్నది రైతులు చెబుతున్న మాట.



టాస్క్‌ఫోర్స్ కమిటీలేవి..?

వాస్తవానికి కల్తీ విత్తన విక్రేతలు సీజన్‌కు రెండు నెలల ముందే వ్యాపారం విస్తరిస్తుంటారు. జిల్లాలో అనధికార గోడౌన్లలో కల్తీ దందా సాగుతుందన్న ఆరోపణలున్నాయి. జిల్లా వ్యవసాయ శాఖలోని ఓ అధికారి సంపూర్ణ సహకారంతోనే నిషేధిత మందులు, విత్తనాల అమ్మకాలు సాగుతున్నాయన్న విమర్శలున్నాయి. గ్రామాల్లో, పట్టణాల్లో నమ్మకమైన వ్యక్తుల వద్ద విత్తనాలను నిల్వ చేసి, చాపకింద నీరులా రైతులకు చేరుస్తుంటారు. ఏప్రిల్, మే రెండో వారం కల్లా చేరాల్సిన చోటుకు చేరిపోతాయి. ఈ క్రమంలో ఏప్రిల్ నెల నుంచే వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో నిఘాను ఏర్పాటు చేస్తే అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. కానీ, నేటికీ టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయకపోవడం విడ్డూరం.

వామ్మో.. హోటల్ ఫుడ్

వ్యాధులను వండి వడ్డిస్తున్నారు..

- గడువు ముగిసిన మసాలాలు.. సాస్‌లు
- పురుగులు పట్టిన మాంసాహారం.. కుళ్లిన కోడిగుడ్లు
- అపరిశుభ్రంగా కిచెన్ పరిసరాలు..
- పేరుకు పెద్ద హోటళ్లు.. రోగాలకు నిలయాలు
- ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలతో వెలుగులోకి..

కరీంనగర్ అర్బన్: వీకెండ్.. బర్త్‌డేలు.. ఏదైనా పార్టీ సందర్భంలో హోటల్‌కు వెళ్తున్నారా..? నగరంలో పేరున్న రెస్టారెంట్లలో నచ్చిన ఐటమ్స్ కడుపునిండా తిందామనుకుంటున్నారా.? తస్మాత్ జాగ్రత్త..! కాలంచెల్లిన పదార్థాలతో కంటికి ఇంపుగా అనిపించే ఫుడ్ తయారు చేస్తుండగా.. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా మీ ఆరోగ్యం గల్లంతే. ఆదివారం ఫుడ్‌సేఫ్టీ అధికారుల టాస్క్‌ఫోర్స్ బృందం నగరంలోని పేరున్న మూడు హోటళ్లలో తనిఖీలు చేశారు. అపరిశుభ్రత, కాలంచెల్లిన మసాలాలు, సాస్‌లు వినియోగిస్తున్నారని తేలగా డీ ఫ్రిజ్, కోల్డ్‌ఫ్రిజ్‌లో వండిన పదార్థాలను నిల్వ చేసినట్లు గుర్తించి నోటీసులు జారీ చేస్తామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ వెల్లడించారు. పేరుకే ఫేమస్ హోటళ్ల తీరు మాత్రం 'పైన పటారం.. లోనలొటారం' అన్నట్లుగా రుచికరమైన ఆహారం పేరిట ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ నెల 22న 'ఒకే ఒక్కడు' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడిన విషయం తెలిసిందే. తనిఖీలు లేకపోగా కల్తీరాయుళ్ల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోందని ప్రస్తావించగా అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. ఆయా హోటళ్లలో తినే పదార్థాలు సురక్షితం కాదని, 20–25 రకాల వండిన ఆహార పదార్థాలను డి ఫ్రిజ్‌లో నిల్వ చేశారని గుర్తించడం ఆందోళనకర పరిణామం. శ్వేత, ప్రతిమ, హోటల్ విందు హోటళ్లలో తనిఖీలు చేసిన అధికారులు నమూనాలు సేకరించి పరీక్షలకు పంపారు.

పేరుకే పెద్ద హోటళ్లు..

పెద్ద రెస్టారెంట్లలోనూ కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. నీళ్లను ఫ్రీగా ఇవ్వాల్సిన నిర్వాహకులు బయట రేటు కన్నా రెండు మూడింతల ఎక్కువ ధరకు అంటగడుతున్నారు. ఫుడ్‌సేఫ్టీ రూల్స్ ప్రకారం నీళ్లలోని టీడీఎస్ 75 మైక్రోగ్రాములు ఉండాలి. అంత కన్నా తక్కువ ప్రమాణాలున్న నీళ్లను జనానికి ఇచ్చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నూనెలను ఒకట్రెండు సార్లు వాడాక మార్చాల్సి ఉన్నా మార్చడం లేదు. పలు రెస్టారెంట్లలో కల్తీ నూనెలను వాడుతున్నట్లు సమాచారం. కొన్ని చోట్ల చనిపోయిన జంతువుల కళేబరాల్లోని బొక్కల నుంచి తీసిన ఆయిల్‌తో నూనెల్ని కల్తీ చేస్తున్నారు. వాటితో పేగులపై దుష్పరిణామాలు ఉంటాయి.

బయటి ఫుడ్‌తో రోగాలే..

కల్తీఫుడ్ తింటే దీర్ఘకాలిక సమస్యలూ వస్తాయని సీనియర్ వైద్యుడు, ఎండీ చెస్ట్ డా.సాయిని నరేందర్ వివరించారు. బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌తో డయేరియా, విరేచనాలు, కడుపునొప్పి, ఎసిడిటీ వంటివి వస్తాయన్నారు. కలరింగ్ ఏజెంట్లు, క్లాస్ 2 ప్రిజర్వేటి వాడకం వల్ల కేన్సర్ వచ్చే ప్రమాదముందన్నారు. పేగు, ప్యాంక్రియాటిక్ కేన్సర్ల ముప్పు ఉంటుందన్నారు.

ఫ్రిజ్‌లో పెట్టి.. వండి వడ్డిస్తూ..

రెస్టారెంట్లలో డీఫ్రిజ్, డీ కోల్డ్ విధానాన్ని అనుసరిస్తుండటం విచారకరం. కొన్ని హోటళ్లలో అపోలో ఫిష్, ప్రాన్స్, పాలక్ పన్నీరు, వండిన చికెన్, మటన్, కట్ మిర్చి, ఉడుకబెట్టిన అన్నం ఫ్రిజ్‌లో పెట్టినట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఫంగస్ వచ్చిన ముక్కలు కూడా ఉండటం విశేషం. గడువు ముగిసిన మసాలాలు, సాస్‌లు, వెనిగర్‌లు ఉండగా 25 రకాల వండిన పదార్థాలను ఫ్రిజ్‌లో నిల్వ చేసినట్లు తేలడం భోజన ప్రియులకు ఎంతటి నాణ్యమైన ఆహారం అందిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.



ఓ రెస్టారెంట్‌లో తనిఖీలో బయటపడ్డ నాసిరకం ఆహారం



కుళ్లిన కోడిగుడ్లు



పురుగులు పడిన చేప ముక్కలు



గడువు ముగిసిన సాస్, కూల్‌డ్రింక్ బాటిళ్లు

బిర్యానీతో నాసిరకం ఉల్లిగడ్డలను సర్వ్ చేస్తున్నారు. నాన్స్, రుమాలీ రోటీ తయారీ కోసం పురుగు పట్టిన మైదాను వాడుతున్నారు. బూజు పట్టిన డ్రైఫ్రూట్స్‌ను బిర్యానీ, కర్రీల్లో వినియోగిస్తున్నారు. చికెన్, మటన్, ఇతర మాంసాహారాలను సగం వండి ఫ్రిజ్లో పెట్టి.. కస్టమర్ అడిగినప్పుడు మళ్లీ వండి వడ్డిస్తున్నారు. మిగిలిపోయిన ఫుడ్ ఐటమ్స్‌ను ఫ్రిజ్లో దాచి, మరుసటి రోజు వేడి చేసి కస్టమర్లకు సర్వ్ చేస్తున్నట్లు తనిఖీల్లో తేలింది.

వివరాల వెల్లడిలో ఏఎఫ్‌సీ దోబూచులాట

కరీంనగర్‌లో తనిఖీలు నిర్వహించిన ఫుడ్ సేఫ్టీ బృందం వివరాల వెల్లడిలో గోప్యత పాటించడం అనుమానాలకు తావిస్తోంది. ఉదయం తనిఖీలతో హడలెత్తించి.. సాయంత్రం 6గంటల వరకు పూర్తి వివరాలు వెల్లడిస్తామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ ప్రకటించారు. 9దాటినా.. వివరాల వెల్లడిలో గోప్యత పాటించారు. ఫోన్ చార్జింగ్ లేదని, 10నిమిషాల్లో ప్రెస్‌నోట్ పంపిస్తామని చెప్పి తర్వాత ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం.

'బీజేపీపై బురదజల్లే ప్రయత్నం'



ఏసీపీ నరేందర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు

కరీంనగర్‌టౌన్: హనుమాన్ దీక్షాపరుల శోభయాత్ర సందర్భంగా శనివారం రాత్రి చోటు చేసుకున్న ఘటనలో ప్రమేయం ఉన్న వ్యక్తికి, బీజేపీకి సంబంధం లేదని, అతను పార్టీ కార్యకర్త కాదని, ఈ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదివారం బీజేపీ నేతలు ఏసీపీ నరేందర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, ఉప్పరపల్లి శ్రీనివాస్, నాగసముద్రం ప్రవీణ్, ఎన్నం ప్రకాశ్, రవి తదితరులు ఏసీపీని కలిసి సమస్యను విన్నవించారు. హనుమాన్ దీక్షాపరుల శోభాయాత్రలో కొందరు ఉద్దేశపూర్వకంగా అలజడులు సృష్టించాలని ప్రయత్నాలు చేశారన్నారు. కత్తి తిప్పడం లాంటి ఘటనతో శోభయాత్రలో ఉద్రిక్తత పరిస్థితులు వచ్చాయని తెలిపారు. అనవసర వివాదాన్ని సృష్టించిన అరాచక శక్తులకు బీజేపీకి, హనుమాన్ దీక్షా పరులకు ఎలాంటి సంబంధం లేదని, కొన్ని ఫేక్‌మీడియా సంస్థలు, సోషల్ మీడియా గ్రూపులు పనికట్టుకొని ఈ విషయంలో బీజేపీపై బురద జల్లడానికి ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి


నాగరాజు (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: జనగామ–సుందిళ్ల గ్రామ శివారులోని ఇసుక బంకర్ వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు రాసపల్లి నాగరాజు (31) మృతి చెందాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని జవహర్‌నగర్‌లో నివాసముంటున్న నాగరాజు ఆర్జీ–1 డివిజన్ 11 ఇంక్లయిన్ గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం సెకండ్‌షిఫ్టు ముగించుకొని తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా జనగామ శివారులోని ఇసుక బంకర్ వద్ద ప్రధాన రోడ్డుపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను బలంగా ఢీకొనడంతో హెల్మెట్ పగిలి తలకు దెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. నిర్లక్ష్యంగా రోడ్డుపై లారీని ఆపి తన కొడుకు మరణానికి కారణమైన లారీడ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి పోషం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై ఫరిద్ తెలిపారు.

అనంతారం వాసి..


రాజశేఖర్ మృతదేహం

కొత్తపల్లి/తంగళ్లపల్లి: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ పంచాయతీ పరిధిలోని శ్రీరాములపల్లి స్టేజ్ వద్ద కరీంనగర్– వేములవాడ ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. కొత్తపల్లి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామానికి చెందిన జక్కుల రాజశేఖర్ కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకొని తిరిగి బైక్‌పై వెళ్తున్న క్రమంలో శ్రీరాములపల్లె స్టేజ్ వద్ద అదుపుతప్పి కల్వర్టు గోడను ఢీకొట్టడంతో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాజశేఖర్‌కు ఇటీవలే వివాహం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొత్తపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

పాలకుర్తి: ఓ యువకుడి లైంగిక వేధింపులు భరించలేక బాలిక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాలకుర్తి మండలం జీడీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని బీసీకాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలం గుర్రాంపల్లికి చెందిన బాలిక కొంతకాలంగా బీసీకాలనీలో నివాసముంటోంది. పెద్దపల్లి మండలం బొంపెల్లికి చెందిన అరికిళ్ల శ్యాం కొంతకాలంగా బాలికను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈనేపథ్యంలో వేధింపులు తాళలేక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు బసంత్‌నగర్ రెండో ఎస్సై శివాణిరెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంజన్న చెంత.. వసతుల చింత

- ఐదు రోజుల్లో హనుమాన్ పెద్ద జయంతి
- నత్తనడకన ఏర్పాట్లు
- లక్షల్లో రానున్న భక్తులు


చెత్తాచెదారంతో నిండిపోయిన మురుగుకాలువ


అంజన్న ఆలయంలో భక్తులు


నీటిట్యాంకు వద్ద అపరిశుభ్రత


కోనేరు సమీపంలో చెత్తాచెదారం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆలయంలో మరో ఐదు రోజుల్లో హనుమాన్ పెద్ద జయంతోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు లక్షలాది మంది హనుమాన్ భక్తులు, దీక్షాపరులు తరలివస్తారు. కానీ భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు మాత్రం నత్తనడకన కొనసాగుతున్నాయి.

ఖర్చు లక్షల్లో.. ఏర్పాట్లు నామమాత్రం

ఏటా హనుమాన్ జయంతికి వసతుల నిమిత్తం ఆలయ అధికారులు రూ.లక్షల్లో ఖర్చు చేస్తారు. కాగా జయంతికి వారం రోజుల ముందే అన్ని ఏర్పాట్లు చేయాలి. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ కారణం చూపి ఆలయానికి రంగులు వేయలేదు. తాత్కాలికంగా దుకాణాదారుల సాయంతో నామమాత్రగా రంగులు పూర్తి చేశారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్ల వేశారు. చలివేంద్రాలు ఇంకా ఏర్పా టు చేయలేదు. అలాగే ఘాట్‌రోడ్ వెంట ఇరువైపులా ఉన్న స్థలంలో, లడ్డూప్రసాదం తయారీ కేంద్రం వద్ద భక్తులు వాహనాలు నిలపడంతో పాటు విశ్రా ంతి తీసుకుంటారు. అందుకు తగిన ఏర్పాట్లు కానరావడం లేదు. ఆలయ పరిసరాలు కంపుకొడుతున్నాయి. కోనేరు సమీపంలో, తాగునీరు నల్లాల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.

తాత్కాలిక స్టాండ్‌లతోనే..

ఏటా హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తుల కోసం తాత్కాలిక స్టాండ్‌లు, వైర్లతో క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తుండగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సదరు క్యూలైన్లలో ఎవరైనా భక్తులు దారితప్పితే మళ్లీ ఆలయం ఎదుట ఉన్న కార్యాలయం నుంచి దారిపట్టాలి. ఇలా సుమారు 2 గంటల నుంచి 3గంటల సమయం వృథా అవుతోంది. ఇలా స్వామి వారి దర్శనం, మాల విరమణ, కోనేరు వద్ద భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈసారైనా ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.


తాత్కాలిక స్టాండ్‌లు

నిర్లక్ష్యం తగదు



లక్షల మంది తరలివచ్చే ఉత్సవాలకు అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయాలి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలి. ఏర్పాట్లలో నిర్లక్ష్యం తగదు.

– నరేశ్, గంగాపూర్

ఏర్పాట్లు కొనసాగుతున్నాయి



హనుమాన్ జయంతికి వచ్చే భక్తులకు కావల్సిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరో రెండు రోజుల్లో అన్ని సౌకర్యాలు పూర్తవుతాయి. లోటుపాట్లు ఉంటే వెంటనే సరిచేసి దీక్షాపరులు ప్రశాంత వాతావరణంలో మాల విరమణ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, ఆలయ ఈవో

గంభీరావుపేటవాసికి లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు


అవార్డు అందుకుంటున్న అజ్మతుల్లా హుస్సేనీ

గంభీరావుపేట(సిరిసిల్ల)/కరీంనగర్ కార్పొరేషన్: గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ది టైమ్స్ ఇంగ్లిష్ మ్యాగజైన్ అజ్మతుల్లా హుస్సేనీని భారత్‌కి అన్‌మోల్ అవార్డుల్లో భాగంగా లీడర్‌షిప్ అండ్ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు(మైనార్టీ డెవలప్‌మెంట్ విభాగం)ను అందించింది. మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అజ్మత్ అవార్డును అందుకున్నారు. పలువురు స్థానికులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అనారోగ్యం ఏదైనా ఎమర్జెన్సీనే

- మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వరల్డ్ ఎమర్జెన్సీ డే


హెల్త్‌టాక్‌లో మాట్లాడుతున్న మెడికవర్ వైద్యులు

కరీంనగర్‌టౌన్: అనారోగ్యం ఏదైనా దాన్ని ఎమర్జెన్సీగానే భావించి బాధితుడిని ఆస్పత్రికి తరలించాలని మెడికవర్ వైద్యులు సూచించారు. వరల్డ్ ఎమర్జెన్సీ డేను పురస్కరించుకొని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం విద్యానగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెల్త్‌టాక్, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 300 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులకు మూల కారణమైన బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలన్నారు. ఆహారం, ఇతర అలవాట్లపై నియంత్రణ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. 23ఏళ్లకే హార్ట్‌స్ట్రోక్ వచ్చిన పేషెంట్లను కూడా చూస్తున్నామని, ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే మద్యం, స్మోకింగ్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండడంతో పాటు వ్యాయామం అవసరం ఉందన్నారు. 17వ డివిజన్ కార్పొరేటర్ కోల భాగ్యలక్ష్మి ప్రశాంత్, మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, ఎమర్జెన్సీ ఫిజీషియన్లు వేముల సత్యనారాయణ, విద్యా ప్రకాశ్, రుత్విక్, దీక్షిత్, క్రిటికల్ కేర్ హెచ్‌వోడీ ఉపేందర్ రెడ్డి, న్యూరో సర్జన్ వెంకటేశ్, యూ రాలజిస్ట్ రవిశంకర్, మెడికల్ సూపరింటెండెంట్ రవిమల్లారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హనుమాండ్ల రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

బీరయ్య పట్నాల వేడుకల్లో అపశృతి

- కళ్లెదుటే కొడుకు మృతి
- బాధిత కుటుంబంలో విషాదం


వెంకటేశ్ (ఫైల్)

గొల్లపల్లి(ధర్మపురి): నమ్ముకున్న వృత్తి ఆ కుటుంబానికి గర్భశోకం మిగిల్చింది. కళ్లెదుటే కొడుకు మృతిచెందడం తీరని విషాదం నింపింది. గ్రామస్తుల వివరాలు.. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం నార్లపురం గ్రామానికి చెందిన బిర్లా రాజయ్య బీరప్ప పట్నాలు వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు కొడుకులు నరేశ్, వెంకటేశ్. ఈక్రమంలో గొల్లపల్లి మండలం చందోళిలో బీరప్ప పట్నాలు ఉండటంతో రాజయ్య తన ఇద్దరు కొడుకులు, ఇతర సభ్యులతో ఈనెల 24న వచ్చారు. 25న సాయంత్రం కురుమ సంఘం ఆచారం ప్రకారం బీరప్ప పట్నాల ఉత్సవాల్లో భాగంగా స్వామివారల విగ్రహాలను చిన్నవేని చంద్రయ్య వ్యవసాయ బావిలో దాచిపెట్టారు. వాటిని నీటిలో నుంచి బయటకు తీసేందుకు రాజయ్య ఇద్దరు కొడుకులు బావిలోకి దూకారు. విగ్రహాలను వెలికితీసే క్రమంలో చిన్న కొడుకు వెంకటేశ్ కొంతసేపటి వరకు నీటి నుంచి బయటకు రాలేదు. పెద్ద కొడుకు బయటకు వచ్చాడు. తమ్ముడు రాకపోవడంతో మరోసారి నరేశ్ బావిలోకి దూకి వెతుకుతుండగ నీటిలో అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్‌ను బయటకు తీసకువచ్చారు. చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

మున్సిపల్ కౌన్సిలర్ ‘కొంతం’ హఠాన్మరణం


కొంతం శ్రీనివాసరెడ్డి (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్ కొంతం శ్రీనివాసరెడ్డి (56) ఆదివారం హఠాన్మరణం పొందారు. వారం రోజుల క్రితం స్నేహితులతో కలిసి వైష్ణవి ఆలయాన్ని దర్శించుకుని తిరుగుపయనమవుతుండగా ఢిల్లీలో గుండెపోటుకు గురయ్యారు. వెంట ఉన్న మిత్రులు వెంటనే అక్కడి ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. కొంతం శ్రీనివాసరెడ్డి బీజేపీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడిగా, రైల్వే హమాలీ సంఘ అధ్యక్షుడిగా, హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఈ ప్రాంత ప్రజలందరికీ సుపరిచితుడు. శ్రీనివాసరెడ్డి ఆకస్మిక మృతికి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మున్సి పల్ కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, కౌన్సిలర్లు పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియలు సోమవారం సా యంత్రం పెద్దపల్లిలో నిర్వహిస్తారని కుటుంబీకులు తెలిపారు.

కారును ఢీకొన్న లారీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై ముందుగా వెళ్తున్న కారును ఓ లారీ ఢీకొంది. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారి ట్రాఫిక్ సిగ్నల్ దాటిన తర్వాత గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ బ్రేకులు పనిచేయక పోవడంతో ముందు వెళ్తున్న కారును వెనుక భాగంలో ఢీకొంది. తృటిలో ప్రమాదం తప్పింది. లారీ బ్రేకులు పడకపోవడంతో ఢీకొన్నట్లు డ్రైవర్ హకీమ్ తెలిపారు. కారు డ్రైవర్ అన్వేష్‌కు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి రిమాండ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలకేంద్రంలోని బతుకమ్మతెప్ప వద్ద గంజాయి సేవిస్తున్న ఒద్యారం గ్రామానికి చెందిన అజయ్, సోమారంపేటకు చెందిన తడకపల్లి శేఖర్, అనంతారం గ్రామానికి చెందిన దారవేణి మహేశ్, గొల్లపెల్లికి చెందిన పున్ని ప్రశాంత్‌లను రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్ తెలిపారు. వారి నుంచి 100 గ్రాముల గంజాయి, ఒక పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయి గురించి సమాచారం పోలీసులకు తెలిపాలని కోరారు. ఇల్లంతకుంట ఎస్సై ఎల్.రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కమాన్‌పూర్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి శివారు ప్రాంతంలోని మానేరువాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలించొద్దని ఆదేశాలు జారీ చేసినా కొంతమంది ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు గట్టెపల్లి నుంచి కమాన్‌పూర్‌కు వస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

పంచర్ షాపు దగ్ధం


దగ్ధమైన పంచర్ షాప్

కోరుట్ల: పట్టణ శివారులోని కంచరకుంట ప్రాంతంలో ఆదివారం పంచర్‌షాపు దగ్ధమైంది. ఓ రైతు తన పొలంలో కొయ్యకాలుకు నిప్పుపెట్టగా మంటలు కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారి వరకు వ్యాపించాయి. రోడ్డు పక్కనే కైసర్ అనే వ్యక్తికి చెందిన రేకులతో నిర్మించుకున్న పంచర్ షాపు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.ఒక లక్ష నష్టం వాటిల్లిందని, ఉపాధి కోల్పోయానని బాధితుడు వాపోయాడు. కాగా ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి చెందిన 10 టేకు దుంగలు కూడా దగ్ధమయ్యాయి.

వడదెబ్బతో రైతు మృతి

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని రాపల్లి గ్రామానికి చెందిన రైతు ఎక్కల్‌దేవి రాజయ్య (60)వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజయ్య ఆదివారం తన పొలంలో వరి కొయ్యలకు నిప్పు అంటించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అక్కడే గడిపాడు. ఇటు ఎండ తీవ్రత, అటు అగ్గి దగడుకు వడదెబ్బతో అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు.

వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ రిమాండ్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ మంతెన సంతోష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గతంలో వెంకట్రావుపేట మూలవాగు నుంచి ఇసుకను తరలించే ట్రాక్టర్ల నుంచి విలేజ్ డెవలప్‌మెంట్ ఫండ్ పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని తెలిపారు. ఈ విషయమై విచారణ చేపట్టగా సంతోష్‌పై అభియోగాలు నిర్ధారణ కావడంతో కోర్టు అనుమతితో రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

తండ్రి చితికి నిప్పు పెట్టిన కూతురు

శంకరపట్నం: తండ్రి చితికి చిన్నకూతురు నిప్పు పెట్టిన సంఘటన మండలంలోని కొత్తగట్టులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నల్ల మహేందర్‌రెడ్డికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కూతురు సంధ్యకు వివాహం జరగగా.. హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది. మూడు రోజుల క్రితం మహేందర్‌రెడ్డి పెద్దకూతురు వద్దకు వెళ్లగా గుండెనొప్పితో శనివారం చనిపోయాడు. మహేందర్‌రెడ్డి అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో జరగగా చిన్నకూతురు అనూష తండ్రి చితికి నిప్పు పెట్టింది.

అజ్మీరాతండాలో పిడుగుపాటు


కొబ్బరి చెట్టుపై పడ్డ పిడుగు

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం సీతారాం నాయక్‌తండా గ్రామపంచాయతీ పరిధిలోని అజ్మీరాతండాలో కొబ్బరిచెట్టుపై శనివారం రాత్రి పిడుగుపడింది. పక్కనే ఉన్న గడ్డికుప్పలకు మంటలు అంటుకోకుండా తండాకు చెందిన అజ్మీర వసంత్ అప్రమత్తమయ్యాడు. తండావాసులతో కలిసి మంటలు అంటుకోకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన వెంశ కనకమ్మ(60) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. ఇటీవల తాడికల్‌లోని జాతీయ రహదారిపై డీజిల్ ట్యాంకర్ బోల్తాపడి కనకమ్మ తీవ్రంగా గాయపడింది. 12రోజుల పాటు చావుబ్రతుకులతో పోరాడి ఆదివారం చనిపోయింది. ట్యాంకర్ ప్రమాదం ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

రాజన్నా.. ఇదేమి గోస?

- లడ్డూ ప్రసాద తయారీ కేంద్రంలో వసతులు కరువు
- వేములవాడలో చెమటలు కక్కుతూ పనిచేస్తున్న కార్మికులు
- స్వచ్ఛందంగా హాజరవుతున్న పలువురు మహిళలు
- సౌకర్యాల లేమితో ఇబ్బంది


లడ్డూ తయారు చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

వేములవాడ: రాజన్న లడ్డూ ప్రసాద తయారీ కేంద్రంలో అరకొర వసతులతో కార్మికులు పనిచేయలేకపోతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. బోంది తయారీకి వాడే గ్యాస్ మంటతో గోదాంలో సిబ్బంది, కార్మికులు ఉండలేకపోతున్నారు. కూలర్లు పెట్టించిన ఉక్కపోత తగ్గక చెమటలు కక్కుతూ అతికష్టం మీద లడ్డూలు తయారు చేస్తున్నారు.

ఔట్‌సోర్సింగ్‌తో ఇబ్బంది

రాజన్నను దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు లడ్డూ ప్రసాదాన్ని కొనుక్కొని ఇంటికి తీసుకెళ్తుంటారు. నిత్యం వచ్చే భక్తులకు తోడు జూన్ 1న హనుమాన్ జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు కొండగట్టుకు వచ్చే మాలధారులు వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. ఎక్కువ సంఖ్యలో లడ్డూలు తయారు చేయాల్సి ఉండడం.. గోదాంలో అందరూ ఔట్‌సోర్సింగ్ సిబ్బందే ఉండడంతో ఇబ్బందిగా మారింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, గోదాంలోని పొయ్యిల ద్వారా వచ్చే వేడి కలిసి తీవ్ర ఉక్కపోత ఉండడంతో అక్కడ కార్మికులు, సిబ్బంది ఎక్కువ సమయం ఉండలేకపోతున్నారు.

మండుతున్న ఎండలతో ఉక్కపోత

ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రసాద తయారీ గోదాంలో ఉక్కపోత పెరిగింది. లడ్డూలు తయారు చేసే క్రమంలో ఉక్కపోతతో ఊపిరి పీల్చుకోవడం కూడా ఇబ్బందిగా ఉంటుందని ప్రసాదాలు తయారు చేసే సిబ్బంది పేర్కొంటున్నారు. లడ్డూల తయారీకి ప్రత్యేక భవనం నిర్మిస్తే ఈ సమస్యలు తీరుతాయని సిబ్బంది తెలుపుతున్నారు. బోంది తయారీ చేసే గది, లడ్డూలు చేసే హాలు ఒకటే కావడంతో ఉష్ణోగ్రతలు పెరిగి ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు.

సిబ్బంది కొరత ఉంది

లడ్డూ ప్రసాదాల తయారీకి సిబ్బంది కొరత ఉంది. ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పనులు చేయిస్తున్నాం. హనుమాన్ జయంతికి లడ్డూల తయారీకి ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేశాం. సరైన వసతి లేకపోవడం, సిబ్బంది కొరత ఉండడంతో ఆటంకంగా మారుతోంది. ఈ విషయాన్ని చాలాసార్లు ఉన్నతాధికారులకు తెలియజేశాం. – ప్రతాప నవీన్, ఏఈవో


కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఓ కుటుంబం


ఆలయంలో క్యూలైన్లలో భక్తులు


రాజన్నను దర్శించుకునేందుకు ఆలయంలో భక్తులు

రాజన్నకు పోటెత్తిన భక్తులు

- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- దర్శనానికి మూడు గంటలు

వేములవాడ: వేసవి సెలవులు దగ్గరపడుతుండడంతో రాజన్నను దర్శించుకునేందుకు వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఆదివారం దాదాపు 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. రద్దీ పెరగడంతో దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు.

క్లుప్తంగా

క్రీడాకారిణికి అభినందన



అభినందిస్తున్న డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్: హాంకాంగ్‌లో ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 52 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిన తుడి సిరిచందనను డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి ఆదివారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి, దేశ కీర్తిని చాటాలని సూచించారు. ఆమెను తీర్చిదిద్దిన కోచ్ మల్లేశ్‌నూ అభినందించారు.

బ్లాక్ బెల్ట్‌ల ప్రదానం



బెల్ట్‌లు అందించిన ఏసీపీ వెంకటరమణ

కరీంనగర్ స్పోర్ట్స్: ఒకినావా మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో స్థానిక జగిత్యాల రోడ్‌లోని వివేకానంద స్కూల్‌లో కరాటే చిన్నారులకు ఇటీవల పోటీ పరీక్షలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఆదివారం కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ బ్లాక్ బెల్ట్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మస్థైర్యానికి, ఆత్మవిశ్వాసానికి కరాటే దోహదం చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇందులో శిక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో అకాడమీ చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్‌కుమార్, ఇన్‌స్ట్రక్టర్లు శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీనివాస్, రాజశేఖర్, రిషికుమార్, రాకేశ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

సంకష్టహర చతుర్థి పూజలు



లక్ష్మీగణపతికి అభిషేకం చేస్తున్న ప్రధానార్చకుడు పవనకృష్ణ శర్మ

విద్యానగర్: సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆదివారం కరీంనగర్ మండలంలోని నగునూర్ పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలోని లక్ష్మీగణపతికి ఆలయ ధర్మాధికారి, వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివార్లకు విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి తదితర పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు పవనకృష్ణ శర్మ ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎల్లుండి హనుమాన్ చాలీసా పారాయణం

కరీంనగర్ కల్చరల్: నగరంలోని 36వ డివిజన్ వాణి సూపర్ మార్కెట్ పక్కన బుధవారం సాయంత్రం 6.30 గంటల నుంచి బోగ శ్రీనివాస్ గురు స్వామి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం, అయ్యప్ప భక్త బృందంచే భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శబరిమల అయ్యప్ప మహాపాదయాత్ర గురుస్వామి గడప నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్, అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు.

గీత కార్మికుడికి గాయాలు



గాయపడిన తిరుపతిగౌడ్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని ఇరుకుల్లలో తాటిచెట్టు పైనుంచి పడి, ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఇరుకుల్లకు చెందిన బుర్ర తిరుపతిగౌడ్ ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు తాటిచెట్టు ఎక్కి, కల్లు గీస్తున్నాడు. ప్రమాదవశాత్తు మోకు జారడంతో కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన కుడికాలు విరిగి, పలుచోట్ల గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అతన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా 11 కేవీ ఆరెపల్లి ఫీడర్ ఏరియాలో ఆరెపల్లి, రాజరాజేశ్వరి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏడీఈ కె.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.





వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సంజీవరావు, ఏపీవో శోభారాణి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు, వాటర్ క్యాన్లతో ఉపాధిహామీ మేట్లు

'ఉపాధి'కి ఎండదెబ్బ

- గ్రామాల్లో జోరుగా సాగుతున్న పనులు
- కూలీలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- కరీంనగర్ మండలంలో పనులకు వెళ్తున్నవారు 5,441 మంది

కరీంనగర్‌రూరల్: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అయితే, పెరుగుతున్న ఎండల తీవ్రతకు వారు ఆందోళన చెందుతున్నారు. ఉదయం 10 గంటలకే సూర్యుడు నిప్పులు కక్కుతుండటంతో బెంబేలెత్తుతున్నారు. ఇటీవల ఎలబోతారం గ్రామానికి చెందిన ఓ మహిళా కూలీ ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురైంది. దీంతో వడదెబ్బ తగలకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఉదయం 7 గంటలకే పనులకు..

ఎండల నేపథ్యంలో కూలీలు ఉదయం 7 గంటలకే పనులకు వెళ్తున్నారు. కరీంనగర్ మండలంలో మొత్తం 10,246 జాబ్ కార్డులుండగా ప్రస్తుతం 5,441 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం చెరువుల్లో పూడికతీత, ఫాంపాండ్స్, మట్టి రోడ్ల నిర్మాణ పనులు చేస్తున్నారు. అయితే, వేసవిలో నేలగట్టిగా ఉండటంతో నిర్దేశించిన పని లక్ష్యం చేరుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. గిట్టుబాటు ధర లభించడం లేదని వాపోతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ వేడి పెరిగిపోతోంది. 11, 12 గంటల మధ్య 39 నుంచి 42 డిగ్రీలకు చేరుతోంది. పని ప్రాంతాల్లో గ్రీన్‌నెట్‌తో నామమాత్రంగా వేసిన టెంట్లు కూలీలకు సరైన నీడనివ్వడం లేదు. ఎండవేడి తట్టుకోలేక చెట్లనీడకు చేరుతున్నారు.

పని ప్రదేశాలను సందర్శిస్తున్న అధికారులు

వడదెబ్బపై కూలీలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. డీఆర్డీవో, ఎంపీడీవో, ఏపీవోలు పని ప్రదేశాలను సందర్శిస్తూ కూలీలకు వడదెబ్బ లక్షణాలను వివరించి, చైతన్యపరుస్తున్నారు. ఎండలో పని చేస్తున్నపుడు తలకు తెల్లని వస్త్రాన్ని రక్షణగా కట్టుకోవాలని సూచిస్తున్నారు. తరచూ నీరు తాగాలని, తలనొప్పి, జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో కూలీలకు చల్లటి తాగునీరు అందుబాటులో ఉంచుతున్నారు. వైద్య శాఖ సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ





శ్రీనివాస్‌ను, నరేందర్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కమలాకర్, మేయర్ సునీల్‌రావు

కరీంనగర్: ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మిత్రుడు ఎస్ఎంఎస్ శ్రీనివాస్ తల్లి మచ్చ రత్నాబాయి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బాధిత కుటుంబసభ్యులను ఎమ్మెల్యే ఆదివారం భగత్‌నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి, పరామర్శించారు. కార్పొరేటర్ తోట రాములు, సుర్జిత్ సింగ్ చాహల్, మిడిదొడ్డి నవీన్ తదితరులున్నారు.

కాపువాడలో..

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మిర్యాలకార్ నరేందర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. ఆదివారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు కాపువాడలోని ఆయన నివాసానికి వెళ్లి, చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. నరేందర్ మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటన్నారు. పార్టీ ఎల్లవేళలా ఆయన కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోల మాలతి, సంపత్ రెడ్డి, అనురాస్ కుమార్, బొల్లం లింగమూర్తి, గూట్ల శంకర్, చెల్లోజు శ్రీనివాస్, కోయల్కర్ మధు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన వడ్లు కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న శివరాజ్

కరీంనగర్: జిల్లాలో అకాల వర్షాలకు తడిసిన వడ్లను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి, సరైన ధర రాక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం త్వరగా తడిసిన వడ్లను కొనుగోలు చేసి, వారిని ఆదుకోవాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, హ్యూమన్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మొగిలి సతీశ్, నాయకులు కోడిపల్లి శంకర్, గొల్లపల్లి అంజయ్య తదితరులున్నారు.

బెల్లి లలిత జయంతి, వర్ధంతి అధికారికంగా నిర్వహించాలి



నివాళి అర్పిస్తున్న యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు


కరీంనగర్: ప్రత్యేక రాష్ట్రం కోసం బెల్లి లలిత చేసిన త్యాగం మరువలేనిదని, ఆమె జయంతి, వర్ధంతి అధికారికంగా నిర్వహించాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగ కొమురయ్య అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద బెల్లి లలిత చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి పాలకులు లలితక్కను పాశవికంగా హత్య చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆమె త్యాగాన్ని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా లలితక్క ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోష్కి శంకర్, శారద, ఎండీ.షకీల్, రాంరెడ్డి, బాబీరెడ్డి, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మహారాణా ప్రతాప్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



నివాళి అర్పిస్తున్న నాయకులు

విద్యానగర్: మహారాణా ప్రతాప్ సేవలను స్ఫూర్తిగా తీసుకొని, దేశం కోసం, ధర్మం కోసం పాటుపడాలని వీర క్షత్రియ రాజ్‌పుత్ సమితి బాధ్యుడు ఠాకూర్ సతీశ్ సింగ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో రాజ్‌పుత్ సమాజ్‌వారు మహారాణా ప్రతాప్ 484వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్‌లో రాణా ప్రతాప్ విగ్రహ ఏర్పాటుకు రాజ్‌పుత్ సమాజ్ చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సమాజ్ బాధ్యులు జి.రఘువీర్ సింగ్, జయప్రకాశ్ సింగ్, సంగ్రామ్ సింగ్, మన్మోహన్ సింగ్, విజయ్‌గోపాల్ సింగ్, సంతోష్ సింగ్, దేవేందర్ పాల్ సింగ్, రాజేందర్ సింగ్, పృథ్వీరాజ్ సింగ్, అజయ్‌పాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.





గణేశునికి హారతి ఇస్తున్న అర్చకుడు, హాజరైన భక్తులు

ఆలయాల్లో పూజలు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో ఆదివారం సంకటహర చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాండ్లు, కమాన్‌రోడ్ రామేశ్వర, అశోక్‌నగర్ వాసవి కన్యకాపరమేశ్వరి, ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయక స్వామి, పాతబజార్ గౌరీశంకర, చైతన్యపురి మహాశక్తి తదితర ఆలయాల్లో అభిషేక, అర్చనలు, గణపతి హవనాలు జరిపారు. భక్తులు హాజరయ్యారు.

కించపరుస్తూ మాట్లాడొద్దు



జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీలో కొంత మంది విభేదాలు సృష్టించేలా, నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌ను కించపరుస్తూ వ్యతిరేకంగా మాట్లాడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పార్టీ సీనియర్ నాయకులు పత్తి కృష్ణారెడ్డి, పొనగంటి మల్లయ్య, దేశిని కోటి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సీనియర్ నాయకుడు సుంకరి రమేశ్ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి ప్రతీ నాయకుడు, కార్యకర్త పని చేయాలని అందరినీ కలుపుకొని పని చేయాలని, కించపరుస్తూ మాట్లాడితే చర్యలు తప్పవన్నారు. గతంలో పని చేసిన బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి వొడితెల ప్రణవ్‌కు ఎమ్మెల్యే టికెట్ కేటాయించింది గుర్తుంచుకోవాలన్నారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటేవిధంగా పనిచేయాలన్నారు. కౌన్సిలర్లు వీరన్న, భిక్షపతి, రవి, నాయకులు శ్రీహరి, సదానందం, రేణుకశివకుమార్, సజ్జు,మద్దుమల్ల రవి, అశోక్, దీక్షిత్ నాయకులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో శనివారం రాత్రి హనుమాన్ రథయాత్రలో జరిగిన వివాదంలో ఇరువర్గాలపై ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. త్రీటౌన్ సీఐ వివరాల ప్రకారం శనివారం సివిల్ ఆస్పత్రి ఎదటగల ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి రథయాత్ర మంచిర్యాల చౌరస్తా వద్దకు రాగా.. జయదేవ్ సింగ్ అనేవ్యక్తి వచ్చి హనుమాన్ భక్తులతో అసభ్యంగా ప్రవర్తించాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. యాత్రలో తనపై విచక్షణ రహితంగా దాడి చేశారని జవదేవ్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనివాస్, జగన్, నరేష్, ఐలోని, నిఖిల్, సాయికిరణ్, అజయ్‌పై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి పేర్కొన్నారు.

'మహేంద్ర'లో ఎక్స్‌యూవీ వాహనాలు ప్రారంభం



లబ్ధిదారులకు వాహనాలను అందిస్తున్న ఎమ్మెల్యే కమలాకర్, మేయర్ సునీల్‌రావు

కరీంనగర్: కరీంనగర్ మహేంద్ర షోరూంలో నూతనంగా లాంచ్ చేసిన ఎక్స్‌యూవీ వాహనాలను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదివారం ప్రారంభించారు. పలు వాహనాలను కొనుగోలు చేసిన లబ్ధిదారులకు వాటిని అందించారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్ జంగిలి ఐలేందర్ యాదవ్, షోరూం జనరల్ మేనేజర్ కేకే.రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కల్మషం లేనిది పాఠశాల స్నేహమే

- సైకాలజిస్టు డాక్టర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి
- గాగిల్లాపూర్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కరీంనగర్: కల్మషం లేనిది పాఠశాల స్థాయి స్నేహమేనని ప్రముఖ సైకాలజిస్టు, స్పెషల్ ఎడ్యుకేటర్ డాక్టర్ అట్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం గాగిల్లాపూర్ ఉన్నత పాఠశాలలో 20 ఏళ్ల క్రితం పదోతరగతి పూర్తి చేసినవారు ఆదివారం కరీంనగర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై, మాట్లాడారు. నేనున్నాననే స్నేహితుల మాటతో ప్రపంచాన్నే జయించవచ్చని పేర్కొన్నారు. మానసికంగా ఉల్లాసం, నూతనోత్తేజాన్ని కలిగించడానికి ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులు తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, సందడిగా గడిపారు. సైకాలజిస్టుతోపాటు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో అన్నాడి సత్యనారాయణ రెడ్డి, కొమరి మల్లేశం, అంతయ్య, బాలాజీ సింగ్, అన్నాడి వెంకట్ రెడ్డి, పాపిరెడ్డి జ్యోతి, లక్ష్మీబాయి, పూర్వ విద్యార్థులు అంతం సతీశ్‌కుమార్, చింతలపల్లి మౌనిక రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీవాల ఎరువు.. పంటలకు మేలు



- భూసారం పెరిగేందుకు దోహదం
- గొర్రెలు, మేకల మందలు పెట్టిస్తున్న రైతులు
- కోళ్ల ఎరువుకు డిమాండ్

కరీంనగర్‌రూరల్: వానాకాలం పంటల సాగుకు సిద్ధమైన రైతులు ముందుగా నేలను సారవంతం చేసేందుకు మూగజీవాల ఎరువును ఉపయోగిస్తున్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, కంపోస్టు, సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బ తింటుంది. దీనికి ప్రత్యామ్నాయంగా జీవాల ఎరువును వాడుతున్నారు.

ఒక మందకు రూ.1,000–రూ.1,500

రైతులు తమ పొలాల్లో పొలాల్లో గొర్రెలు, మేకల మందలు పెట్టిస్తున్నారు. గొర్రెలు, మేకల మూత్రంలో పీహెచ్ విలువ 7.7 ఉంటుంది. వీటి ద్వారా చౌడు భూములు సారవంతంగా మారుతాయి. లీటర్ మూత్రంలో 9 నుంచి 13 గ్రాముల నత్రజని, 18 నుంచి 20 గ్రాముల పొటాషియం, ఫాస్పరస్ వంటి మూలకాలు ఉంటాయి. ఒక గొర్రె ద్వారా ఒక రాత్రికి లీటరు మూత్రం, 360 నుంచి 540 గ్రాముల వరకు పేడ లభిస్తుంది. మేకలు 900 గ్రాముల వరకు పేడను విసర్జిస్తాయి. ఒక్క రాత్రి పొలంలో మంద పెట్టేందుకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు కాపరులు తీసుకుంటున్నారు. గొర్రెలు, మేకల మందల ద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్‌తోపాటు బాక్టీరియా, ప్రొటోజోవా, ఫంగి తదితర ఉపయోగకరమైన సూక్ష్మజీవులతో నేల సారవంతమవుతుంది. పశువుల పేడ ట్రాక్టర్‌కు రూ.3,500 చొప్పున రైతులు కొనుగోలు చేస్తున్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుంది.

లారీల్లో కోళ్ల ఎరువు సరఫరా..

కొన్నేళ్లుగా కోళ్ల ఫారాల నుంచి వచ్చే వ్యర్థాలను ఎరువుగా ఉపయోగించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యాపారులు హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాల్లోని పౌల్ట్రీల నుంచి కోళ్ల వ్యర్థాలను సేకరిస్తున్నారు. గ్రామాల్లో తిరుగుతూ రైతులకు లారీల చొప్పున కోళ్ల ఎరువును సరఫరా చేస్తున్నారు. చిన్న లారీ అయితే రూ.20 వేలు, పెద్ద లారీ అయితే రూ.30 వేల వరకు తీసుకుంటున్నారు.



రోడ్డుపై ఎండమావులు

ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో వర్షాలు పడుతున్నాయి. ఈ సమయంలో కరీంనగర్‌లో మాత్రం ఆదివారం మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. పద్మనగర్‌లో రోడ్డుపై ఎండమావులుగా కనిపిస్తున్న దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

సుందరగిరిలో శకటోత్సవం



ఆలయం చుట్టూ తిరుగుతున్న వాహనాలు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శకటోత్సవం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం సుందరగిరి, చిగురుమామిడి, గాగిరెడ్డిపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, బొమ్మనపల్లి గ్రామాలకు చెందిన భక్తులు వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. వారం రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారంతో చివరి దశకు చేరుకున్నాయి. సోమవారం రథోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలతో భక్తులు ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గందె సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, ఎలాంటి లోటు రాకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రాజ్‌కుమార్, క్లర్క్ కవిత, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్నామని చిగురుమామిడి ఎస్సై బి రాజేశ్ తెలిపారు.

మైలారంలో పోచమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామంలో ఆదివారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెళ్లిపత్రికలోనూ ఈవీఎంపై వ్యతిరేకత!



వాటిని నిషేధించాలంటూ డిమాండ్

లాతూర్: మా పెళ్లికి విచ్చేసి భోజనతాంబూలాదులు స్వీకరించి మమ్మానందింపజేయ ప్రార్థన. ఇది చాలా పెళ్లిపత్రికల్లో కనిపించే ఒక విన్నపం. కానీ ఇక్కడ ఒక పత్రికలో విజ్ఞాపనకు బదులు 'వ్యతిరేకత' కనిపించింది. ''ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)లను నిషేధించండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి'' అంటూ కొటేషన్‌ను పెట్టాడు ఒక పెళ్లికొడుకు. మహారాష్ట్రలోని ఛాకూర్ తహసీల్ పరిధిలోని అజన్‌సోందా(ఖుర్ద్) గ్రామానికి చెందిన దీపక్ కుంబ్లే పెళ్లి వచ్చే నెల ఎనిమిదో తేదీన లాతూర్ పట్టణంలో జరగనుంది. కుంబ్లే అందరికీ పంచిన తన వివాహ ఆహ్వాన పత్రికలో ఇలా ఈవీఎంలపై తన అసంతృప్తి వెళ్లగక్కాడు. సాధువులు, సంఘ సంస్కర్తలు, స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలను ఆ వెడ్డింగ్ ఇన్విటేషన్ కార్డులో ప్రచురించాడు. తనకు పాఠాలు బోధించిన స్కూలు టీచర్ల ఫోటోలకు ఈ ఆహ్వానపత్రికలో స్థానం కల్పించాడు. ఈయన అఖిలభారత వెనకబడిన, మైనారిటీ వర్గాల ఉద్యోగుల సంఘం(బామ్‌సెఫ్) సభ్యుడు. '' ఈవీఎంల వ్యతిరేక ఉద్యమం సార్వత్రిక ఎన్నికలకు ముందే ఊపందుకుంది. బంధువులు, స్నేహితుల్లోనూ ఉద్యమంపై మరింత అవగాహన పెంచాలనే ఇలా ఈవీఎంల అంశాన్ని పెళ్లికార్డులో ప్రస్తావించా' అని కుంబ్లే చెబుతున్నారు. కార్డులో కథాకమామిషు, ఫొటోలను చూసి ముక్కున వేలేసుకున్న వాళ్లూ లేకపోలేదు. కార్డు ఎలాగుంటే మనకెందుకు? పెళ్లికెళ్లి నాలుగు అక్షింతలు వేసి భోంచేసి వచ్చేద్దాం అని ఊళ్లో చాలా మంది డిసైడ్ అయ్యారట!

ఓటింగ్... ఫ్లాప్!

ఐదు విడతల్లో భారీగా తగ్గిన పోలింగ్

- 428 సీట్లలో ఓటేసింది 50.7 కోట్ల మంది
- 2019లో పోలైన ఓట్లు 70.1 కోట్లు!
- 20 రాష్ట్రాలు, యూటీల్లో తక్కువ ఓటింగ్

సార్వత్రిక ఎన్నికల సమరంలో పార్టీలన్నీ హోరాహోరీగా తలపడుతున్నా ఓటర్లలో మాత్రం అంత ఆసక్తి కనబడటం లేదు. మండుటెండలు ఇతరత్రా కారణాలు ఎన్నున్నా దేశవ్యాప్తంగా చాలాచోట్ల ఓటింగ్ తగ్గుముఖం పట్టడం పార్టీలు, అభ్యర్థుల్లో గుబులు పుట్టిస్తోంది. ఏడు విడతల సుదీర్ఘ ఎన్నికల షెడ్యూల్‌లో ఏప్రిల్ 19 నుంచి మే 25 దాకా ఆరు విడతలు పూర్తయ్యాయి. తొలి ఐదు విడతలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కచ్చితమైన ఓటింగ్ గణాంకాలను విడుదల చేసిన నేపథ్యంలో ఓటింగ్ ట్రెండ్‌లో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి...

ఓటర్లు పెరిగినా ఓట్లు తగ్గాయి

తొలి ఐదు విడతల పోలింగ్‌లో దేశవ్యాప్తంగా 428 లోక్‌సభ స్థానాల పరిధిలో ఓటర్లు తమ నిర్ణయాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. ఆ స్థానాల్లో 50.7 కోట్ల ఓట్లు పోలైనట్లు ఈసీ తెలిపింది. గత ఎన్నికల్లో తొలి ఐదు విడతల్లో 426 స్థానాల్లో ఏకంగా 70.1 కోట్ల మంది ఓటేయడం విశేషం. అప్పుడు 68 శాతం ఓటింగ్ నమోదైతే ఈసారి 66.4 శాతానికి పరిమితమైంది. వాస్తవానికి 2019 ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్లు 89.6 కోట్లుండగా ఈసారి 96.8 కోట్లకు పెరిగారు. 7.2 కోట్ల మంది కొత్త ఓటర్లు జతైనా ఓటింగ్ మాత్రం పడిపోవడం గమనార్హం. ఈసారి తొలి విడత నుంచే ఓటింగ్‌లో తగ్గుదల ధోరణి కొనసాగుతోంది. చివరి రెండు విడతల్లోనూ ఇదే ట్రెండ్ ఉంటే మొత్తం ఓటింగ్ గత ఎన్నికల్లో రికార్డు స్థాయిలో నమోదైన 67.4 శాతానికి చాలాదూరంలో నిలిచిపోయేలా కనిపిస్తోంది. (ప్రాథమిక డేటా ప్రకారం ఆరో విడతలో 63.36 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో ఇది 64.73 శాతం).

20 రాష్ట్రాలు, యూటీల్లో డౌన్...

ఐదు విడతల పోలింగ్‌ను పరిశీలిస్తే ఏకంగా 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటింగ్ తగ్గింది. నాగాలాండ్‌లో పలుచోట్ల ఎన్నికల బహిష్కరణ పిలుపుల నేపథ్యంలో ఓటింగ్ బాగా తగ్గింది. గత ఎన్నికల్లో 82.9 శాతం నమోదు కాగా ఈసారి ఏకంగా 57.7 శాతానికి పడిపోయింది. మిజోరం, కేరళల్లో పోలింగ్ 6 శాతం మేర తగ్గింది. మణిపూర్, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లో 4 శాతం పైగా తగ్గింది. షాడోల్, రేవా, ఖజురహో, సిద్ధి (మధ్యప్రదేశ్), పథనంతిట్ట (కేరళ), మథుర (యూపీ) లోక్‌సభ స్థానాల్లోనైతే 10 శాతానికి పైగా పడిపోయింది. రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న వయనాడ్‌లో 2019తో పోలిస్తే 6.76 శాతం తగ్గింది!

కశ్మీర్లో పోటెత్తారు...

దేశవ్యాప్తంగా ట్రెండ్‌కు భిన్నంగా కొన్ని రాష్ట్రాలు, నియోజకవర్గాల్లో ఓటర్లు పోటెత్తారు. ముఖ్యంగా జమ్మూ కశ్మీర్, మేఘాలయ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, కర్నాటకల్లో ఓటింగ్ బాగా పెరిగింది. జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా, శ్రీనగర్ నియోజకవర్గాల్లో గత ఎన్నికల కంటే ఏకంగా 24 శాతం అధిక ఓటింగ్ నమోదైంది. మేఘాలయలోని షిల్లాంగ్‌లో 8.31 శాతం పెరిగింది.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఐదు విడతల్లో ఓటింగ్ ఇలా... (శాతాల్లో)

	2019	2024
మొత్తం ఓటింగ్ శాతం	68%	66.4%
లక్షద్వీప్	85.2	84.2
అస్సాం	81.6	81.6
త్రిపుర	82.3	80.9
ఆంధ్రప్రదేశ్	80.2	80.7
సిక్కిం	81	79.9
పశ్చిమ బెంగాల్	81.9	79.1
పుదుచ్చేరి	81.2	78.9
మణిపూర్	82.5	78.3
అరుణాచల్ ప్రదేశ్	81.1	77.7
మేఘాలయ	71.4	76.6
గోవా	75.1	76.1
ఒడిశా	73.4	74.5
ఛత్తీస్‌గఢ్	71.6	72.8
కేరళ	77.8	71.3
దాద్రానగర్-డామన్‌దయ్యు	77.1	71.3
కర్ణాటక	68.8	70.6
తమిళనాడు	72.4	69.7
మధ్యప్రదేశ్	71.2	66.9
తెలంగాణ	62.8	65.7
జార్ఖండ్	66.3	64.7
అండమాన్-నికోబార్	65.1	64.1
రాజస్తాన్	66.3	61.5
మహారాష్ట్ర	61.1	61.3
గుజరాత్	64.4	60.1
జమ్ము-కశ్మీర్	52.5	59.4
ఉత్తరప్రదేశ్	60.6	58
నాగాలాండ్	82.9	57.7
ఉత్తరాఖండ్	61.6	57.2
మిజోరం	63	56.9
బిహార్	58.6	56.9

డమ్ డమ్‌లో... విజయఢంకా మోగించేదెవరో!

డమ్ డమ్ లోక్‌సభ స్థానం. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌తో కలిసి లెఫ్ట్ విజయం సాధించగలిగే సీట్లలో ఒకటి. ఒకప్పుడు సీపీఎం కంచుకోట. దాన్ని తిరిగి చేజిక్కించుకోవాలని సీపీఎం పోరాడుతోంది. ఇది తృణమూల్ సిట్టింగ్ స్థానం. ఇక్కడ తమ ఓటు బ్యాంకుకు గండి పడకుండా కాపాడుకోవడానికి టీఎంసీ తిప్పలు పడుతోంది. ఒకసారి గెలుపొందిన ఈ స్థానంలో మళ్లీ పాగా వేయాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. దాంతో డమ్ డమ్‌లో త్రిముఖ పోటీ నెలకొంది...

- సాక్షి, నేషనల్ డెస్క్


సుజన్ చక్రవర్తి
శిల్పద్రా దత్తా
సౌగతారాయ్

కోల్‌కతా సమీపంలో ఉండే డమ్ డమ్ లోక్‌సభ స్థానానికి పశ్చిమ బెంగాల్‌లో చారిత్రక ప్రాధాన్యముంది. 1783లో బ్రిటిష్ ప్రభుత్వం ఇక్కడ సైనిక కంటోన్మెంట్, మిలిటరీ బ్యారక్‌లు నిర్మించింది. 1846లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ స్థాపించింది. 1857 సిపాయిల తిరుగుబాటు సందర్భంగా బ్రిటిష్ సైన్యంపై తిరుగుబాటు చేసిన మంగళ్ పాండేకు మరణశిక్ష విధించింది కూడా డమ్ డమ్ కంటోన్మెంట్‌లోనే. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని డమ్ డమ్ బంగ్లాదేశ్‌కు దగ్గరగా ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, బంగ్లాదేశ్ యుద్ధం సమయంలో హిందూ శరణార్థులు ఇక్కడ భారీగా స్థిరపడ్డారు.

పట్టణ జనాభా అధికం...

డమ్ డమ్ లోక్‌సభ స్థానానికి 1977లో తొలిసారి ఎన్నికలు జరిగాయి. 20 ఏళ్ల పాటు ఈ స్థానం సీపీఎం గుప్పెట్లోనే కొనసాగింది. 1998లో తొలిసారిగా బీజేపీకి చెందిన తపన్ సిక్దర్ విజయం సాధించారు. 1999లో ఈ స్థానాన్ని నిలుపుకున్నారు. అనంతరం మూడుసార్లు టీఎంసీ నుంచి సౌగతా రాయ్ విజయం సాధించారు. డమ్ డమ్ లోక్‌సభ నియోజకవర్గం మొత్తం జనాభా 21,84,460. ఇందులో 98.43 శాతం పట్టణ జనాభాయే. దీని పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలూ టీఎంసీ ఖాతాలోనే ఉండటం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం.

ప్రతి ఐదు ఓట్లలో ఒకటి...

డమ్ డమ్‌లో తృణమూల్ నుంచి సిట్టింగ్ ఎంపీ సౌగతా రాయ్, సీపీఎం నుంచి సుజన్ చక్రవర్తి, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే శిల్పద్రా దత్తా బరిలో ఉన్నారు. శిల్పద్రా 2020లో తృణమూల్‌కు రాజీనామా చేసి కాషాయ పార్టీలో చేరారు. మమతా వ్యతిరేక ఓటర్లు వామపక్షాల వైపు మొగ్గితే కాంగ్రెస్ మద్దతుతో సుజన్ గెలవడం సాధ్యమని విశ్లేషకులు అంటున్నారు. అయితే సీపీఎం కేవలం బీజేపీకి ఓట్లను ఆకర్షించగలదే తప్ప తమనేమీ చేయలేదని టీఎంసీ ధీమాతో ఉంది. సీపీఎం ఓట్లు గతం కంటే పెరిగే అవకాశముందని, ఇది బీజేపీ అవకాశాలను దెబ్బతీస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

'వలస' ఓట్లపై సీఏఏ ప్రభావం...

బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన వారు డమ్ డమ్‌లో అధిక సంఖ్యలో ఉంటున్నారు. పౌరసత్వ (సవరణ) చట్టం అమలు వివాదం వారిపై ప్రభావం చూపేలా ఉంది. ''దీంతోపాటు అయోధ్య రామమందిర నిర్మాణం కూడా హిందూ ఓట్లను ఏకీకృతం చేస్తుంది. కనుక బీజేపీ గెలుపు ఖాయం '' అని శిల్పద్రా ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రంలో ప్రధానంగా కన్పించే డమ్ డమ్ ఇప్పుడు ఆ ప్రత్యేకతను కోల్పోయిందని స్థానికులు వాపోతున్నారు. తాగునీటి సంక్షోభం అధికార తృణమూల్‌కు నష్టం చేయడం ఖాయమని చెబుతున్నారు. ఇక్కడ జూన్ 1న ఏడో విడతలో పోలింగ్ జరగనుంది.

ఎస్‌డీఎల్.. బ్రేక్‌డౌన్!


భూగర్భ గనిలో పనిచేస్తున్న ఎస్‌డీఎల్ యంత్రం

- స్పేర్ పార్ట్స్ కొరతతో మొరాయిస్తున్న యంత్రాలు
- కాలం చెల్లినవే వినియోగం
- ఇబ్బంది పడుతున్న ఆపరేటర్లు
- సంస్థకు ఆర్థిక నష్టం

శ్రీరాంపూర్: సింగరేణి భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర వహించే ఎస్‌డీఎల్ యంత్రాలను స్పేర్స్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. గనుల్లో ఉత్పత్తి లక్ష్యాల సాధన పూర్తిగా ఎస్‌డీఎల్ యంత్రాలపైనే ఆధారపడి ఉంది. కానీ వాటి స్పేర్స్ సక్రమంగా సరఫరా కాకపోవడంతో ఆ ప్రభావం బొగ్గు ఉత్పత్తిపై పడుతోంది. అలాగే ఎస్‌డీఎల్ ఆపరేటర్లు కూడా ఇబ్బంది పడుతున్నారు.

ముగిసిన జీవితకాలం..

ఎస్‌డీఎల్ యంత్రాల జీవిత కాలం 12 వేల గంటలు. తర్వాత వాటిని పక్కన పడేయాలి(సర్వే ఆఫ్). కానీ సింగరేణి యాజమాన్యం కొత్త యంత్రాలు కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తోంది. దీంతో కాలం చెల్లిన యంత్రాలకే మరమ్మతు చేసి నడిపిస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న భూగర్భ గనుల్లో చాలా వరకు కాలం చెల్లినవే వాడుతున్నారు. వీటికి స్పేర్స్ సమకూర్చడంలోనూ జాప్యం వాటిల్లుతోంది. ముఖ్యంగా హైడ్లర్ వీల్స్ సరఫరా సరిగా ఉండడం లేదు. రోలర్లు కూడా రావడం లేదు. దీంతో అరిగిపోయిన వాటితోనే నడిపిస్తున్నారు. ట్రాక్ చైన్స్ కొరత కూడా తీవ్రంగా ఉంది. దీంతో తరచూ యంత్రాలు బ్రేక్‌డౌన్ అవుతున్నాయి. సరి చేయడానికి కనీసం 4 గంటల సమయం పడుతుంది. ఈ సమయంలో ఉత్పత్తికి నష్టం వాటిల్లుతుందని ఆపరేటర్లు పేర్కొంటున్నారు. సేఫ్టీ సరిగ్గా లేనిచోట బ్రేక్‌డౌన్ అయితే సరి చేసే క్రమంలో ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంది. రికాల్ స్ప్రింగ్స్ సరఫరా కూడా ఉండటం లేదు. హోస్‌పైప్స్ తరచూ పగిలిపోతున్నాయి. ఇవి కూడా సరిపడినంతా అందుబాటులో ఉండటం లేదు. తరచూ బ్రేక్‌డౌన్‌ల కారణంగా సంస్థకు సైతం ఆర్థికంగా నష్టం జరుగుతుందని ఆపరేటర్లు పేర్కొంటున్నారు.

నాసిరకం హైడ్రాలిక్ ఆయిల్..

ఎస్‌డీఎల్ యంత్రాల్లో వాడే హైడ్రాలిక్ ఆయిల్ నాసిరకంగా వస్తుంది. పలుమార్లు ఇంజినీరింగ్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్మిక సంఘాల నేతలు సైతం పలుమార్లు నిరసన తెలిపారు. యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. యంత్ర విడిభాగాల కొనుగోలు, ఆయిల్ కొనుగోలులో కార్పొరేట్ అధికారుల చేస్తున్న జాప్యంతో సమస్యలు వస్తున్నాయని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

ప్రైవేటుపరం చేసేందుకేనా...?

ఎస్‌డీఎల్ యంత్రాలకు స్పేర్స్ కొరత తీర్చకపోవడం, కొత్త యంత్రాలు కొనుగోలు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్‌డీఎల్ యంత్రాలను ప్రైవేటుకు అప్పగించేందుకే యాజమాన్యం జాప్యం చేస్తోందని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే గనుల్లో రూఫ్ బోల్టింగ్ పనులకు రూఫ్ బోల్టర్లను ప్రైవేటుపరంచేసిన సంస్థ భవిష్యత్తులో ఎస్‌డీఎల్ యంత్రాలను కూడా ప్రైవేటు వారికి అప్పగించే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

కాలం చెల్లినవి తొలగించాలి

గనుల్లో ఎక్కువగా కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలు వినియోగిస్తున్నారు. అవి తరచూ బ్రేక్‌డౌన్ కావడంతో ఆపరేటర్లు, వీటి రిపేర్ కోసం ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ వారు ఇబ్బంది పడుతున్నారు. వీటిని పూర్తిగా తీసేయ్యాలి. స్పేర్స్ కొరత తీర్చాలి. సమస్యను ఇప్పటికే అధికారులు, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాం.

– ఎస్‌కే.బాజీసైదా, ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి

ప్యాసింజర్ రైళ్లు.. నిర్లక్ష్యం ఎన్నేళ్లు?

- సాంకేతిక కారణాలతో తరచూ రద్దు
- బోగీల నిర్వహణను గాలికొదిలేసిన రైల్వే శాఖ
- ప్రయాణికులకు తప్పని తిప్పలు


రాత్రి వెళ్తున్న రామగిరి ప్యాసింజర్ రైలు

రామగుండం: సికింద్రాబాద్, కాజీపేట–సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లు ఎప్పుడూ ఆలస్యంగానే రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు రవాణాతో పోల్చితే రైలు ప్రయాణం సమయం ఆదా, సురక్షిత, సుఖమయమైన ప్రయాణం, బస్సు చార్జీల్లో నాలుగో వంతు రైలు చార్జీలు కావడంతో సాధారణ, మధ్యతరగతి ప్రయాణికులు రైలు ప్రయాణాల వైపే మొగ్గు చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ సాధారణ ప్రయాణికుల కష్టాలను గుర్తించే పరిస్థితిలో ప్యాసింజర్ రైళ్ల సమయపాలనపై దృష్టి సారించకపోగా.. బోగీల నిర్వహణను సైతం పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగజ్‌నగర్ నుంచి కాజీపేట, కొత్తగూడెంకు నిత్యం వేలాది మంది కోల్‌బెల్ట్ నుంచి ప్యాసింజర్ రైళ్లలో రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే శాఖ సాధారణ ప్రయాణికుల సంక్షేమాన్ని వీడి లాభాపేక్షపైనే దృష్టి సారిస్తున్నట్లు అత్యధిక శాతం ప్రయాణికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కానరాని సమయపాలన

కాగజ్‌నగర్ నుంచి కాజీపేటకు ఇరువైపులా నడిచే ప్యాసింజర్ రైళ్లు నిర్దేశిత సమయానికి వచ్చాయంటే ఆరోజు ప్రత్యేకం. సికింద్రాబాద్–బల్లార్షా(భాగ్యనగర్), కాజీపేట–కాగజ్‌నగర్(రామగిరి), కొత్తగూడెం–కాగజ్‌నగర్(సింగరేణి), కాగజ్‌నగర్–కరీంనగర్(డెమూ) రైళ్లు ప్రతీరోజు కనీసం గంట.. గరిష్ఠంగా రెండు గంటలకు పైగానే ఆలస్యంగా నడుస్తుంటాయి. ప్యాసింజర్ రైళ్లతో ఆదాయం తక్కువ కావడంతోనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

బోగీల నిర్వహణ అస్తవ్యస్తం

ప్యాసింజర్ రైళ్ల బోగీలను ఎప్పటికప్పుడు వాషింగ్ చేయకపోవడం, వాష్‌రూంలకు నీటి సరఫరా లేకపోవడం, బియ్యం అక్రమ దందాలకు క్యాబిన్‌గా మారడం, డోర్లు విరిగిపోయి ఉండడం తదితర సమస్యలతో సాధారణ ప్రయాణికులు అత్యవసరాలకు వెళ్లలేని దుస్థితి. ఒకవేళ అక్కడక్కడ వాష్‌రూంలున్నా.. నీటి సరఫరా లేక మలంతో నిండిపోయి తీవ్ర దుర్వాసనతో ఉంటున్నాయి. ప్రతీరోజు ఇరువైపులా రాకపోకల షెడ్యూల్ పూర్తయ్యాక శుభ్రం చేయాల్సి ఉన్నా.. రైల్వే అధికారుల చర్యలు శూన్యం.

తరచూ రద్దు..

కాజీపేట–బల్లార్షా సెక్షన్ల మధ్య ఎక్కడ రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు కొనసాగినా.. తొలుత ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం పరిపాటిగా మారింది. ఈ విధానం కోవిడ్ తర్వాత సాధారణమైంది. అదే రైల్వే ట్రాక్ మీదుగా గూడ్సు రైళ్ల రాకపోకలకు లేని అభ్యంతరం ప్యాసింజర్ రైళ్లకు ఎందుకంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. సమస్య మరీ ఎక్కువగా ఉంటే ఎక్స్‌ప్రెస్ రైళ్ల రూట్ మళ్లిస్తున్నారు. అప్పటికే ప్రయాణికులు తమ ప్రయాణ షెడ్యూల్‌ను ఫిక్స్ చేసుకొని సిద్ధమయ్యేలోగా దారి మళ్లిస్తున్నట్లు సమాచారం అందజేయడం సాధారణంగా మారింది.

ఆన్‌లైన్ అనౌన్స్‌మెంట్..

రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల నేపథ్యంలో రైళ్ల రాకపోకలపై ప్లాట్‌ఫారంపై ఉన్న ప్రయాణికులను అప్రమత్తం చేసే ఆన్‌లైన్ అనౌన్స్‌మెంట్ రద్దు చేశారు. ప్లాట్‌ఫారంపై బోగీ నిలిపే స్థలాన్ని సైతం గుర్తించే సైన్‌బోర్డులు పని చేయడం లేదు. బోగీల వివరాలు మైక్‌లో ప్రకటిస్తున్నా.. ప్రయాణికులకు అర్థం కావడం లేదు. ఫలితంగా రైలు వచ్చి నిలిచిన తర్వాత లగేజీతో పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.


ప్యాసింజర్ రైలులో సాధారణ ప్రయాణికుల రద్దీ

రైల్వే జీఎంకు ఫిర్యాదు చేశా



రైళ్ల ఆలస్యంపై పలుమార్లు రైల్వే జనరల్ మేనేజర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశా. రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులతో తరచూ సాంకేతిక కారణాలను చూపుతూ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం సరికాదని ఉన్నతాధికారులకు వివరించా. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు పూర్తయ్యాక నూతనంగా ఎంపికయ్యే పెద్దపల్లి ఎంపీని కలిసి సమస్యలను వివరించి ఎంపీ సహకారంతో మరోసారి రైల్వే జీఎంను కలుస్తా.

– అనుమాస శ్రీనివాస్, రైల్వే ప్రజాసంబంధాల మాజీ ప్రతినిధి

పద్యకవికి అంతర్జాతీయ పురస్కారం

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన పద్యకవికి అంతర్జాతీయ పురస్కారం దక్కింది. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరులో ఆదివారం 134వ అంతర్జాతీయ శతాధిక పద్యకవుల సమ్మేళనం నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 175 మంది పద్యకవులు పద్యగానం చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన పద్యకవి బి.వెంకట్ 'అంతర్జాతీయ సమ్మేళన పురస్కారం' స్వీకరించారు. సంస్థ అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, సమన్వయకర్త కె.రమావతి, జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టెం లలిత, తదితరులు వెంకట్‌ను స్వర్ణకంకణం, ప్రశంసపత్రం, శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. జిల్లాకు చెందిన ప్రముఖ కవులు తొడిశెట్టి పరమేశ్వర్, కారెం శంకర్, నేరెళ్ల హనుమంతు, పత్తి శివప్రసాద్, అంబటి నారాయణ, డాక్టర్ అప్పాల చక్రధారి, డాక్టర్ దామెర రాములు, కామారపు జగదీశ్వర్, భీమేశ్, కృష్ణంరాజు, బొందిడి పురుషోత్తమరావు, డాక్టర్ మురళీధర్, కోవెల శ్రీనివాసాచార్య, తదితరులు అభినందనలు తెలిపారు.


వెంకట్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

గోదారి.. ఎడారి



రామగుండం: ప్రస్తుతం గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో గోదావరినది ఎడారిని తలపిస్తోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో కొంతమేర వరద నీరు నిలిచి ఉండడంతోపాటు కాళేశ్వరం ఎత్తిపోతలు నిలిచిపోవడంతో ప్రాజెక్టు దిగువన ఉన్న గోదావరి నది నీరు లేక ఇసుక తిన్నెలతో ఎడారిగా మారింది. పుణ్య, అశుభ కార్యాల నిమిత్తం పుణ్యస్నానాలు ఆచరించేందుకు ప్రస్తుతం గోదావరి నదికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో.. ప్రాజెక్టులో ఉన్న నిల్వ నీటితోనే మమ అనిపిస్తున్నారు.

గృహస్థాశ్రమ వైశిష్ట్యం



నీతోనే నేను.. నాతోనే నీవు

సీతమ్మ మనసు ఆమె దగ్గర లేదు. రాముడి దగ్గర ఉంది. రాముడి మనసు ఆయన దగ్గర లేదు. సీతమ్మ దగ్గర ఉంది. అందుకే ఇద్దరూ అలా కలిసి ఉండగలిగారు' అంటాడు హనుమ రామాయణంలో. ఎలా కలిసి ఉన్నాం.. అన్న దాని కన్నా, ఎంతకాలం కలిసి ఉన్నాం.. అన్న దాని కన్నా, ఎంతగా మనసులు ఒక్కటిగా చేసుకుని బతికామన్నది దాంపత్యంలో ప్రధానం.

ఒకప్పుడు కంచి మహాస్వామి తీర్థం ఇస్తున్నారు. భక్తులు వాళ్ళ కష్టాలు చెప్పుకుంటే ఆయన సందర్భాన్ని బట్టి అనుగ్రహిస్తూ ఉండేవారు. అలా ఒకరోజు తీర్థమిస్తూ ఒక ముసలామెను 'ఏమమ్మా, ఏమిటి చెప్పు' అన్నారు. 'నా కన్నా ముందు నా భర్తగారు పోయేటట్లు ఆశీర్వదించండి' అన్నది. ఆయన ఒక్కసారి ఆశ్చర్యపోతూ ఎందుకలా! అనడిగారు.

''స్వామీ! ఏమని చెప్పను. ఆయనది పసిపిల్లవాడి చాపల్యం. మూర్ఖత్వం. ఏదీ తెలియని అమాయకత్వం. నేనున్నంతకాలం ఆయనకు ఏ లోటూ లేదు. రానీయను కూడా. ఇద్దరికీ వయసయిపోయింది. ఆరోగ్యం కుదురుగ్గా ఉండడం లేదు. నేను ముందుపోతే తరువాత ఆయన పరిస్థితి ఏమిటా అన్నదే నా దిగులు. ముందు ఆయన వెళ్ళిపోతే నేనెలాగూ వదిలి ఉండలేను. వెనకే నేనూ పోతా. అందుకని ముందు ఆయన పోయేట్టు అనుగ్రహించండి' అని వేడుకుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అంతటి మహాస్వామికి కూడా కళ్ళు చెమ్మగిల్లాయి. అందరివంకా చూసి ఇదీ భారతీయ దాంపత్యం.. అన్నారు. ఎంత తప్పు చేసినా ఉద్ధరించుకోవడమే తప్ప చేయి వదిలిపెట్టడం అనే మాట అన్వయం కాని ధర్మం ఇది. దానికి ప్రత్యక్ష సాక్ష్యం – అహల్య ఉపాఖ్యానం. భార్య దోషమే చేసిందని తెలిసినా ఆ దోషం చేయడానికి కారణమయిన మానసిక ఉద్వేగాలను దూరంగా ఉంచుకుని..''...వాయుభక్షా నిరాహారా తప్యంతీ భస్మశాయినీ..'' నువ్వు తపస్సు చేత పవిత్రమై, మళ్ళీ నా పక్కన స్థానాన్ని పొందు. పునీతవు కా..'' అని అహల్యను ఉద్ధరించుకున్నాడు తప్ప ఆమెను విడిచిపెట్టేస్తున్నా.. అన్న మాట మాత్రం గౌతమ మహర్షి అనలేదు. అదీ గృహస్థాశ్రమ వైశిష్ట్యం. ఇటువంటి ధర్మానికి రెండు చేతులెత్తి నమస్కారం చేయాలి.

వివాహం అయిపోయిన తరువాత ప్రదానం చేసేటప్పుడు భర్త భార్యతో ''నువ్వు నన్ను నీ పదవ కుమారుడిగా చేసుకుంటావా?'' అని అడుగుతాడు. భర్త పదవ కుమారుడు ఎట్లా అవుతాడు? మలివయసులో శరీరం పట్టు తప్పుతుంటుంది. పెంకితనం ఏర్పడుతుంది. అహం పెరుగుతుంది. అప్పుడు నీ పిల్లలను చూసినట్లు నన్ను చూస్తావా... అని అడుగుతాడు.

రామాయణంలో సీతమ్మ .. ''ఇక్కడ రాజప్రాసాదంలో ఎన్ని సుఖాలయినా ఉండనీయ వయ్యా రామా, నన్ను అరణ్యవాసానికి వద్దంటావేమిటి ! ..'' అంటూ ''నాతంత్రీ వాద్యతే వీణా, నా చక్రో వర్తతే రథః / నా పతిః సుఖ మేధేత యా స్యాదపి శతాత్మజా...'' అంటుంది. నా కొడుకులు నన్ను పువ్వుల్లో పెట్టుకుని చూసుకున్నా, నువ్వు లేని నాడు నాకు తృప్తిలేదు. అది అరణ్యమయినా నువ్వున్న చోటే నా చోటు..'' అంటుంది. ఆశ్రమాల్లో గృహస్థాశ్రమం అంత గొప్పది. దానికి కారణం ప్రేమ ఒక్కటే కాదు. అంతర్లీనంగా ధర్మం ఉంటుంది. దానిలో దంపతులు తరించిపోతారు.

మంచిమాట

సానుకూల దృక్పథం



అంతా మన మంచికే అనే మంత్రి గారి కథ అందరికీ తెలిసినదే. ''అంతా మన మంచికే'' అనే మంత్రిగారు రాజుగారి చిటికెన వేలు తెగితే కూడా అదే మాట అని చెరసాల పాలు అయ్యారు. వేటకి వెళ్ళిన రాజుని ఆటవిక జాతివారు తమ దేవతకు బలి ఇవ్వబోయారు. చిటికెనవేలు లేకపోవటంతో అంగవైకల్యం ఉన్న వ్యక్తి బలికి పనికి రాడు అని వదిలిపెట్టారు. రాజు తిరిగి వచ్చి మంత్రిని విడుదల చేసి, ''నాకు మీ రన్నట్టు మంచే జరిగింది, మీకు ఏం మంచి జరిగింది?'' అని అడిగాడు. అందుకు మంత్రి ''అది కూడా నా మంచికే జరిగింది. చెరసాలలో లేకపోతే తప్పకుండా మీతో వేటకి వచ్చేవాడిని. అంగవైకల్యం ఉన్న మిమ్మల్ని వదిలేసి అప్పుడు ఏ అవయవ లోపమూ లేని నన్ను బలి ఇచ్చేవారు'' అని చెప్పాడు.

ఇది అతి మామూలు కథ. కానీ, దేనినైనా సానుకూల దృక్పథంతో ఎట్లా చూడాలి, దాని వల్ల ప్రయోజనం ఏమిటి? అన్న విషయాలు అర్థం అవుతాయి.

కొన్ని ఆ క్షణాన ఇబ్బంది కలిగించేవిగా, అయిష్టంగా అనిపించ వచ్చు. కానీ, మనకి ఏది మంచో మనకన్నా ప్రకృతికే బాగా తెలుసు. ఆ ప్రకృతినే విశ్వం అని, దైవం అని, ఎనర్జీ అని రక రకాల పేర్లతో పిలుస్తూ ఉంటారు. వేసవి కాలంలో ఎటువంటి పళ్ళు, కూరలు ఆరోగ్యానికి మంచివో వాటినే ఇస్తుంది ప్రకృతి. వర్షాకాలంలో మామిడిపళ్ళు తినాలి అనిపించినా దొరకవు. ఎందుకో తెలుసా? ఆ వాతావరణానికి మామిడి పండు తినటం ఆరోగ్యానికి మంచిది కాదు. దొరికితే మామిడిపండు తినకుండా ఉండలేం. మన మంచికోసం దొరక కుండా చేసింది ప్రకృతి.

ఈ దృక్పథం అలవాటయిన వారికి జీవితం కష్టాలమయంగా కనిపించదు. దేనినైనా తేలికగా తీసుకొని ముందుకి సాగటం ఉంటుంది. అట్లా అయితే వారి జీవితాల్లో కష్టాలు ఉండవా? ఉంటాయి, కానీ కన్నీళ్ళు ఉండవు. కష్టపడకుండా ఏదీ లభించదు. అది భౌతికమైనది. దాన్ని ఏదోవిధంగా దాటవచ్చు. మనస్సుకి ఎక్కించుకుంటే వేదన మిగులుతుంది.

ఆ కాస్త ఇబ్బందిని అయినా ఎందుకు భరించాలి? అనే సందేహం వస్తుంది. కానీ మనం ఆ పరిస్థితిని మార్చలేము కదా! అప్పుడు కూడా అంతా మన మంచికే అనుకుంటే అద్భుతం జరుగుతుంది. దీని వల్ల మంచే జరుగుతుంది అనే సానుకూల భావన వల్ల మన మనసు సానుకూల భావతరంగాలను ప్రసరింప చేస్తుంది. భావతరంగాలు పరిసరాలని, పరిస్థితులని, వ్యక్తులని కూడా ప్రభావితం చేస్తాయి. దానివల్ల ముందుగా వాతావరణం, తరువాత మనస్సు ప్రశాంత మవుతాయి. పరిస్థితులు చక్కబడతాయి. దానికి కారణం నెమ్మదించిన మనస్సు. ఆధ్యాత్మిక గ్రంథాలు మాత్రమే కాదు, ఎఖార్ట్ వంటి ఆధునిక మనస్తత్వశాస్త్రవేత్తలు కూడా ఆలోచనని అనుసరించే పరిస్థితులు ఉంటాయి అని ప్రయోగాత్మకంగా నిరూపించారు. వేలికి దెబ్బ తగిలింది అని బాధపడటం కన్న చెయ్యి, కాలూ బాగున్నందుకు సంతోషించటం నేర్చుకోవాలి. సరైన చెప్పులు లేవని ఏడుస్తున్న కొడుకుకి కాళ్ళు లేని వాడిని చూపించాడుట తండ్రి. అప్పుడు లోటు ఉన్నా బాధ పడటం ఉండదు. సంతోషమే ఉంటుంది. సంతోషంగా ఉంటే 'హాపీ హార్మోనులు' విడుదల అవుతాయి. సంతోషం, ఆనందం బాహ్యామైన వస్తువులు, పరిస్థితుల పైన కాక దృక్పథం మీద ఆధార పడి ఉంటాయి.

> పురుటి నొప్పులు పడనిదే శిశువు లోకంలో అడుగు పెట్టటం కుదరదు. బిడ్డ చిరునవ్వు చూడగానే నొప్పుల సంగతి మరపుకి వస్తుంది. సాన పెట్టనిదే వజ్రం మెరవదు. నమలనిదే పదార్థం రుచి తెలియదు. గంధపుచెక్కని అరగదీయనిదే మంచిగంధం రాదు. చివరికి కుంకుడుకాయ రసం కావాలి అన్నా గట్టిగా పిసకాలి. ఇతర పళ్ల రసం గురించి చెప్ప నక్కర లేదు. గట్టిగా పిండనిదే రసం రాదు. ఈ కష్టం మెఱుగుదల కోసమే అని అర్థం చేసుకుంటే సమస్య లేదు. దానిని కూడా వ్యాయామం మొదలైనవి చేసినప్పుడు పొందే సుఖం లాగా ఆనందించవచ్చు.

– డా. ఎన్. అనంత లక్ష్మి

తాత్త్వికథ



లెక్కలు రాని పండితులు..!

ఒక ఊర్లో ఓ పండితుడు ఉండేవాడు. సులభశైలిలో గణితాన్ని బోధించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. అతడి శిష్యులు అనేక మంది గణితం బాగా నేర్చుకుని పెద్ద కొలువులు సంపాదించడం అతడిలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.

ఎక్కడికి వెళ్ళినా... తన శిష్యులు కనిపిస్తే గణితానికి సంబంధించిన కొన్ని ప్రశ్నలు వేసేవాడు. వారిచేత సరైన సమాధానాలు రప్పించేవాడు. పక్కనున్నవారితో నా శిష్యులందరూ 'లెక్కల్లో గొప్పోళ్ళు' అని చెప్పి గొప్పలు పోయేవాడు.

అతడికి తెలివైన భార్య ఉండేది. వారిద్దరూ ఓ పౌర్ణమి రోజున సత్సంగం కోసమని మారుమూల పల్లెటూరుకు వెళ్ళారు. అక్కడ పని ముగించుకుని ఇంటికి వస్తూ ఉంటే రాత్రయ్యింది. వారికి దారిలో ఓ యువతి కనిపించింది. ఆ యువతి తన చంకన చంటిబిడ్డను ఎత్తుకుని ఉంది. చందమామను చూపిస్తూ 'చందమామ రావే, జాబిల్లి రావే...' అని పాడుతూ చంటిబిడ్డకు గోరుముద్దలు తినిపిస్తోంది.

పండితుడిని చూసిన ఆ యువతి తన గ్రామంలోకి వచ్చిన వ్యక్తి తన గురువని గుర్తించింది. 'నేను మీ శిష్యురాలను' అని చెప్పి గౌరవపూర్వకంగా నమస్కరించింది. మీవల్ల కష్టమైన లెక్కలను ఇష్టంగా చేయగలిగామని ప్రశంసించింది.

గర్వంగా భార్యవైపు చూశాడు పండితుడు.

అలవాటు ప్రకారం పండితుడు తన భార్యతో 'నా శిష్యురాలి చేత గణితశాస్త్రంలోని ప్రశ్న ఒకటి వేసి సమాధానం తెప్పించమంటావా?'' అని అడిగాడు.

చిన్న నవ్వు నవ్విన భార్య ''గణిత శాస్త్ర ప్రావీణ్యత తెలియజేసే ప్రశ్నలు వద్దు. ఇప్పటివరకు మీ శిష్యురాలు తన బిడ్డకు ఎన్ని ముద్దలు పెట్టిందో లెక్క చెప్పమనండి చాలు!'' అని అడిగింది. 'అదెంత పని?' అని భావించిన ఆ పండితుడు తన శిష్యురాలిని సమాధానం చెప్పమన్నాడు.

తెలియదన్నట్టుగా ఆమె అడ్డంగా తల ఊపింది.

తల్లి తల ఊపడం చూసి ఏదో అర్థమైనవాడిలా బోసినవ్వులు నవ్వాడు చంటిబిడ్డ.

వెంటనే పండితుడి భార్య ''బిడ్డలకి గోరు ముద్దలు తినిపించే ఏ అమ్మకీ లెక్కలు రావండీ. ఏ తల్లీ లెక్కవేసుకుని తినిపించదు. బిడ్డ ఒక ముద్ద తింటాడంటే పది ముద్దలు పెట్టాలని చూస్తుంది తల్లి. లెక్కవేస్తే తన దిష్టే తగిలి బిడ్డ తినడం తగ్గించేస్తాడేమోనని ఆలోచిస్తుంది. ఆ తల్లి ప్రేమ ముందు ఏ లెక్కలూ పనిచేయవు, ఏ లెక్కలూ పనికిరావు'' అని వివరించింది.

ఆశ్చర్యపోయాడు పండితుడు. కొద్దిసేపటికి తేరుకుని 'ఏ తల్లీ లెక్కలు, కొలతలు వేసి బిడ్డను ప్రేమించదు. తెలిసిన లెక్కలు సైతం తల్లి ప్రేమ ముందర మాయమైపోతాయి' అని గుర్తించి అక్కడినుంచి కదిలాడు ఆ పండితుడు.

– ఆర్. సి. కృష్ణస్వామి రాజు

సినిమా



కని కస్రుతి, చాయా కదమ్, పాయల్ కపాడియా, దివ్య ప్రభ

ఆ ముగ్గురు మహిళలకు ధన్యవాదాలు

– దర్శకురాలు పాయల్ కపాడియా

- కాన్స్ చిత్రోత్సవాల్లో 'తొలి' రికార్డులతో సత్తా చాటిన భారత ఫిల్మ్ మేకర్స్
- 'గ్రాండ్ ప్రిక్' అవార్డుతో మెరిసిన భారత దర్శకురాలు పాయల్ కపాడియా

కాన్స్ చిత్రోత్సవాల్లో భారతదేశం చరిత్రలో చెప్పుకునేలా సత్తా చాటింది. ఈ మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న 'భారతీయ సినిమా' కాన్స్‌లో మెరిసింది. తొలి గ్రాండ్ ప్రిక్స్ అవార్డును మన దేశ దర్శకురాలు పాయల్ కపాడియా తెచ్చారు. ప్రతిష్ఠాత్మక పియరీ ఏంజెనీ అవార్డును అందుకున్న తొలి ఏషియన్‌గా ఛాయాగ్రాహకుడు–దర్శక–నిర్మాత సంతోష్ శివన్ సగర్వంగా దేశానికి తిరిగొచ్చారు. 'అన్‌సర్టైన్ రిగార్డ్' విభాగంలో అనసూయ సేన్ గుప్తా 'ది షేమ్‌లెస్' చిత్రానికిగాను ఉత్తమ నటి అవార్డును దక్కించుకున్నారు. ఇదే విభాగంలో భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఫిల్మ్ మేకర్ సంధ్యా సూరి దర్శకత్వంలో రూపొందిన 'సంతోష్' ప్రదర్శితమైంది. కానీ అవార్డు దక్కించుకోలేకపోయింది. ఇక చిదానంద ఎస్. నాయక్ దర్శకత్వం వహించిన కన్నడ లఘు చిత్రం 'సన్‌ఫ్లవర్స్ వేర్ ది ఫస్ట్ వన్స్ టు నో' 'లా సినిఫ్' విభాగంలో మొదటి బహుమతి పొందింది. అలాగే 'బన్నీ హుడ్' అనే మరో భారతీయ యానిమేటెడ్ మూవీ మూడో బహుమతి సాధించింది. ఇలా ఈసారి 77వ కాన్స్ చిత్రోత్సవాల్లో భారత దేశం హవా కనిపించింది. మే 14న ఆరంభమైన కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ముగిసింది. దర్శకురాలు పాయల్ కపాడియా అందుకున్న అవార్డు విశేషాలతో పాటు మరిన్ని విషయాలు ఈ విధంగా...

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ చిత్రం 'ఆల్ వీయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' సినిమా సత్తా చాటింది. గ్రాండ్ ప్రిక్ విభాగంలో అవార్డు సాధించింది. కాన్స్ చిత్రోత్సవాల్లోని ఈ ప్రధాన విభాగంలో అవార్డు సాధించిన తొలి భారతీయ చిత్రంగా 'ఆల్ వీయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' చరిత్ర సృష్టించింది. కాగా ఈ ఫెస్టివల్‌లో ప్రతిష్ఠాత్మక విభాగమైన పామ్ డి ఓర్ అవార్డుకు కూడా 'ఆల్ వీయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' చిత్రం పోటీలో నిలిచినప్పటికీ, అవార్డును అందుకోలేకపోయింది. అయితే దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఈ విభాగంలో 'ఆల్ వీయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' రూపంలో ఓ భారతీయ చిత్రం పోటీలో నిలవడం ప్రశంసించదగ్గ విషయం. ఇక పామ్ డి ఓర్ విభాగంలో దాదాపు ఇరవై సినిమాలను వెనక్కి నెట్టి, సీన్ బేకర్ దర్శకత్వం వహించిన కామెడీ డ్రామా 'అనోరా' అవార్డును ఎగరేసుకుపోయింది. 'గ్రాండ్ టూర్' సినిమాకు గాను మిగ్యుల్ గోమ్స్ ఉత్తమ దర్శకుడిగా, 'కైండ్స్ ఆఫ్ కైండ్‌నెస్' సినిమాలోని నటనకు గాను జెస్సీ ప్లేమోన్స్ ఉత్తమ నటుడి అవార్డు అందుకున్నారు. క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'ఎమిలియా పరేజ్'లో నటించిన అడ్రియానా పాజ్, కర్లా సోఫియా, సెలెనా గోమేజ్, జో సల్డానాలు ఉత్తమ నటీమణులుగా నిలిచారు. జాక్వెస్ డియార్డ్ నటించిన ఈ సినిమాకే జ్యూరీ ప్రైజ్ దక్కడం విశేషం. చిత్రోత్సవాల తొలి రోజు హాలీవుడ్ నటి మెరిల్ స్ట్రీప్, ఆ తర్వాత జపాన్‌కు చెందిన యానిమేషన్ స్టూడియో 'స్టూడియో ఘిబ్లి' ప్రతిష్ఠాత్మక పామ్ డి ఓర్ అవార్డు అందుకోగా చివరి రోజు హాలీవుడ్ దర్శక–నిర్మాత జార్జ్ లూకాస్ స్వీకరించారు.

''నిజానికి స్క్రిప్ట్ రాసేటప్పుడు కంగారుపడ్డాను. ఆ కంగారులో ఏదో రాశాను (నవ్వుతూ). మా సినిమాని ఇక్కడ వరకూ తీసుకొచ్చిన 'కాన్స్'కి థ్యాంక్స్. దయచేసి మరో భారతీయ చిత్రం కోసం 30 ఏళ్లు వేచి ఉండొద్దు'' అని అవార్డు అందుకున్న అనంతరం పాయల్ కపాడియా అన్నారు. వేదిక మీద ఉన్న ఈ మూవీలో నటించిన కనీ కస్రుతి, దివ్య ప్రభ, చాయా కదమ్‌లను ఆత్మీయంగా హత్తుకుని, ''తమ సొంత సినిమాలా భావించి చేసిన ఈ ముగ్గురు మహిళలకు ధన్యవాదాలు'' అన్నారు. ఇంకా ఈ చిత్ర నిర్మాతలు, భాగస్వాములు, ఇతర యూనిట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అది మాత్రమే కాదు... ఈ ఏడాది కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ తొలి రోజు ఫెస్టివల్ వర్కర్లు మెరుగైన వేతనాలు డిమాండ్ చేస్తూ చేసిన నిరసనకు మద్దతు తెలిపారు. పాయల్ మళ్లీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ – ''నేను తీసిన ఈ సినిమా ముగ్గురి మహిళల స్నేహం నేపథ్యంలో ఉంటుంది. అయితే మహిళలు ఎక్కువగా ఒకరికొకరు గోతులు తీసుకుంటారు. సమాజం అలానే చిత్రీకరించింది. అది దురదృష్టకరం. కానీ స్నేహం అనేది నాకు ముఖ్యమైన బంధం. ఎందుకంటే అది గొప్పతనానికి దారి తీస్తుంది. కలుపుగోలుతనాన్ని పెంచుతుంది. ఈ విలువలను కాపాడుకోవడానికి మనం ప్రయత్నిస్తుండాలి'' అన్నారు. ఆమె అవార్డు తీసుకురావడం పట్ల భారత ప్రధాని మోదీ, పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా హర్షం వ్యక్తం చేశారు.

పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన తొలి ఫీచర్ ఫిల్మ్ 'ఆల్ వీయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్'. కని కస్రుతి, దివ్య ప్రభ, చాయా కదమ్ లీడ్ రోల్స్‌లో ఈ సినిమాను థామస్ హకీమ్, జూలియన్ గ్రాఫ్ నిర్మించారు. కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ నెల 23న ఈ చిత్రం ప్రదర్శితమైంది. కాగా పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన తొలి ఫీచర్ ఫిల్మ్‌కే కాన్స్‌లోని ఓ ప్రధాన విభాగమైన గ్రాండ్ ప్రిక్ అవార్డు రావడం విశేషం. అయితే కాన్స్‌లో పాయల్ ప్రతిభ మెరవడం ఇదే తొలి సారి కాదు. 2021లో జరిగిన కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన 'ఏ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్' బెస్ట్ డాక్యుమెంటరీగా నిలిచింది. ఆ ఏడాది గోల్డెన్ ఐ అవార్డు పాయల్‌కు దక్కింది. అలాగే 2017లో జరిగిన కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన షార్ట్ ఫిల్మ్ 'ఆఫ్టర్ నూన్ క్లౌడ్' ప్రదర్శితమైంది.

'ఆల్ వీయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' కథ ఏంటంటే... కేరళ నుంచి ముంబైకి వెళ్లి నర్సులుగా పని చేస్తుంటారు ప్రభ (కని కస్రుతి), అను (దివ్య ప్రభ). భర్తతో విడిపోయిన ప్రభకు ఓ గిఫ్ట్ వస్తుంది. ఆ గిఫ్ట్‌ను ఆమె భర్త పంపిస్తాడు. దీంతో ప్రభకు కొత్త సమస్యలు ఎదురవుతాయి. మరోవైపు అను తన రిలేషన్‌షిప్‌లో ఇబ్బందులకు లోనవుతుంది. ఆ తర్వాత ఈ ఇద్దరూ రోడ్ ట్రిప్‌కు వెళితే ఏం జరిగింది? అన్నదే కథ.



విక్టోరియా
జోయ్ కింగ్
ఎల్లే ఫానింగ్
ఫ్రైడరిక్ బెల్
డెమి మూర్

కాన్స్ చిత్రోత్సవాల ముగింపు వేడుకల్లో మెరిసిన తారలు

రత్నమాల నా కెరీర్‌లో గుర్తుండిపోతుంది

– అంజలి



''నన్ను ఎక్కువగా పక్కింటి అమ్మాయి తరహా పాత్రల్లో చూడాలనుకుంటారు. కానీ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'లో నేను చేసిన రత్నమాల పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. 'ఈ పాత్రకు మీరే న్యాయం చేయగలరు' అని కృష్ణచైతన్య అన్నారు. ఇంత మంచి పాత్ర చేసినందుకు సంతోషంగా ఉంది'' అని అంజలి అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా, నేహా శెట్టి, అంజలి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. కృష్ణ చైతన్య దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ– ''రత్నమాల పాత్ర కోసం ఈ తరహా (మాస్) సంభాషణలు నా నోటి నుంచి రావడం ఇదే మొదటిసారి. చిత్రీకరణ, డబ్బింగ్ సమయంలో కొత్త అనుభూతి పొందాను. రత్నమాల నా సినీ కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర అవుతుంది'' అన్నారు. పెళ్లి గురించి అడిగితే – ''నా పెళ్లికి ఇంకా సమయం ఉంది. ప్రస్తుతానికి నా పెళ్లి గురించి వస్తున్న వార్తలన్నీ పుకార్లే'' అన్నారు అంజలి. ''ప్రస్తుతం 'గేమ్ చేంజర్'లో ఓ కథానాయికగా చేస్తున్నాను. తెలుగులో మరో సినిమా, తమిళ, మలయాళ సినిమాలు కూడా చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు అంజలి.

నాలో కొత్త కోణాన్ని చూపించిన చిత్రమిది

– నవదీప్

''ప్రస్తుతం అన్ని భాషల్లో కొత్త కంటెంట్‌తో సినిమాలు వస్తున్నాయి. అదే కోవలో తెలుగులో రాబోతున్న వైవిధ్యమైన సినిమా 'లవ్ మౌళి'. ప్రేక్షకులను థియేటర్‌కు రప్పించే సినిమా ఇది. నా 20 ఏళ్ల సినీ కెరీర్ తర్వాత నాలో ఉన్న కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూ చేసిన సినిమా ఇది'' అని నవదీప్ అన్నారు. నవదీప్ హీరోగా అవనీంద్ర దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ మౌళి'. పంఖురి గిద్వానీ, భావన సాగి, 'మిర్చి' హేమంత్, 'మిర్చి' కిరణ్ ఇతర పాత్రల్లో నటించారు. నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సి స్పేస్ నిర్మించింది. ఈ చిత్రాన్ని జూన్ 7న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా అవనీంద్ర మాట్లాడుతూ– ''నేటి యువతరానికి కావాల్సిన అన్ని అంశాలు మా సినిమాలో ఉన్నాయి. ప్రేమలో ఉన్న వారి బంధాలు ఎలా ఉన్నాయి? నేటి యువతరం ప్రేమించి పెళ్లి చేసుకున్నా బ్రేకప్‌లు అవుతున్నాయి. రాజీ పడితే తప్ప బంధాలు నిలబడవా? అనే ప్రశ్నకు నాకు దొరికిన పరిష్కారాన్ని కూడా ఈ చిత్రంలో చూపించాం'' అన్నారు.



నవదీప్, అవనీంద్ర

సస్పెన్స్... క్రైమ్

ప్రముఖ దర్శకుడు విక్రమన్ కొడుకు విజయ్ కనిష్క హీరోగా నటించిన చిత్రం 'హిట్ లిస్ట్'. సూర్య కతిర్ కాకల్లార్, కె. కార్తికేయన్ దర్శకత్వంలో డైరెక్టర్ కేఎస్ రవికుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో శ్రీనివాస్ గౌడ్, బెక్కం రవీంద్ర రిలీజ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ ట్రైలర్ లాంచ్, ప్రీ రిలీజ్ ఈవెంట్స్‌కి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, నటుడు మురళీమోహన్ ముఖ్య అతిథులుగా హాజరై, 'హిట్ లిస్ట్' విజయం సాధించాలన్నారు. కేఎస్ రవికుమార్ మాట్లాడుతూ– ''1990లో వచ్చిన 'పుదు వసంతం' సినిమాతో విక్రమన్‌తో నాకు మంచి పరిచయం ఏర్పడింది. ఆయన తనయుడు విజయ్ కనిష్కని నేను హీరోగా లాంచ్ చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు. ''మా సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు విజయ్ కనిష్క. ''మమ్మల్ని నమ్మి తెలుగులో రిలీజ్ చేసే చాన్స్ ఇచ్చిన కేఎస్ రవికుమార్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు శ్రీనివాస్ గౌడ్, బెక్కం రవీంద్ర.



విజయ్, రవికుమార్, శ్రీనివాస్ గౌడ్, గడ్డం ప్రసాద్

ఎనిమిది మంది పనిని ఒక్కడే చేస్తుంటాడు

– విశ్వక్ సేన్

''పరాక్రమం' సినిమా ట్రైలర్ బాగుంది. నేను యానిమేషన్, ఎడిటింగ్ కోర్సులు చేస్తున్నప్పటి నుంచి మా సర్కిల్స్‌లో బండి సరోజ్ కుమార్ పేరు వింటున్నాను. ఆయన ఎనిమిది మంది పనిని ఒక్కడే చేస్తుంటాడు. ఈ సినిమా సరోజ్ కుమార్‌కు పెద్ద విజయం ఇవ్వాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. బండి సరోజ్ కుమార్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన సినిమా 'పరాక్రమం'. శ్రుతి సమన్వి, నాగలక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్ గోపు, అనిల్ కుమార్ ఇతర పాత్రల్లో నటించారు. బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి విశ్వక్ సేన్, దర్శకులు బుచ్చిబాబు, జ్ఞానసాగర్ ద్వారక తదితరులు అతిథులుగా హాజరయ్యారు. బుచ్చిబాబు మాట్లాడుతూ– ''కన్నడ పరిశ్రమలో ఉపేంద్రగారు అన్ని ముఖ్యమైన విభాగాలు ఆయనే చేసుకుంటారు. అలా తెలుగులో సరోజ్ కుమార్ ఉన్నారు'' అన్నారు. ''నేను 2004లో జూనియర్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీకి వచ్చాను. పలు చిత్రాలు చేశా. 'పరాక్రమం' అన్ని వర్గాల ప్రేక్షకులు చూసేలా ఉంటుంది'' అన్నారు బండి సరోజ్ కుమార్.



బుచ్చిబాబు, విశ్వక్ సేన్, సరోజ్‌కుమార్

ఆరెంజ్ క్యాప్
(అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్)

విరాట్ కోహ్లి (బెంగళూరు)
741 పరుగులు (15 మ్యాచ్‌లు)
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు

పర్పుల్ క్యాప్
(అత్యధిక వికెట్లు తీసిన బౌలర్)

హర్షల్ పటేల్ (పంజాబ్ కింగ్స్)
24 వికెట్లు (14 మ్యాచ్‌లు)
ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు

ఎమర్జింగ్ ప్లేయర్
నితీశ్ కుమార్ రెడ్డి (సన్‌రైజర్స్ హైదరాబాద్)

ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు
13 మ్యాచ్‌ల్లో 303 పరుగులు.
3 వికెట్లు. 2 అర్ధ సెంచరీలు.
21 సిక్స్‌లు, 15 ఫోర్లు.

మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్
సునీల్ నరైన్ (కోల్‌కతా నైట్‌రైడర్స్)

ప్రైజ్‌మనీ: రూ. 10 లక్షలు
15 మ్యాచ్‌ల్లో
488 పరుగులు
17 వికెట్లు
1 సెంచరీ, 3 అర్ధ సెంచరీలు

'బెస్ట్ క్యాచ్' ఆఫ్ ద టోర్నీ
రమణ్‌దీప్ సింగ్ (కోల్‌కతా)
ఫెయిర్ ప్లే అవార్డు
సన్‌రైజర్స్ హైదరాబాద్
అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్
అభిషేక్ శర్మ (సన్‌రైజర్స్)
16 మ్యాచ్‌ల్లో 42 సిక్స్‌లు
అత్యధిక ఫోర్లు కొట్టిన బ్యాటర్
ట్రవిస్ హెడ్ (సన్‌రైజర్స్)
15 మ్యాచ్‌ల్లో 64 ఫోర్లు

కోల్‌కతాకే కిరీటం

ఐపీఎల్ చాంపియన్ నైట్‌రైడర్స్

- మూడోసారి విజేతగా నిలిచిన జట్టు
- ఫైనల్లో సన్‌రైజర్స్‌కు తీవ్ర నిరాశ
- 8 వికెట్ల తేడాతో పరాజయం



సన్‌రైజర్స్ అభిమానులకు తీవ్ర వేదన... లీగ్ దశలో విధ్వంసకర బ్యాటింగ్‌తో ఐపీఎల్‌కు కొత్త పాఠాలు నేర్పిన టీమ్ అదే బ్యాటింగ్ వైఫల్యంతో చివరి మెట్టుపై చతికిలపడింది. 8 బంతుల వ్యవధిలో అభిషేక్ శర్మ, హెడ్ లాంటి హిట్టర్లు వెనుదిరగ్గా... క్లాసెన్‌కు కూడా కాలం కలిసిరాని వేళ జట్టంతా కుప్పకూలింది. ఏ మూలకూ సరిపోని 114 పరుగుల లక్ష్యాన్ని కోల్‌కతా నైట్‌రైడర్స్ 63 బంతుల్లోనే ఛేదించేసి సంబరాలు చేసుకుంది. దశాబ్ద కాలం తర్వాత మూడో టైటిల్ అందుకొని సగర్వంగా నిలిచింది. ఎనిమిదేళ్ల తర్వాత ట్రోఫీ గెలవాలని ఆశించిన హైదరాబాద్ 2018 తరహాలో ఫైనల్‌కే పరిమితమై నిరాశలో మునిగింది. ఆసాంతం బ్యాటర్లు చెలరేగిన 2024 టోర్నీ చివరకు బౌలర్ల అద్భుత ప్రదర్శనతో ముగిసింది. విజేతగా నిలిచిన కోల్‌కతాకు రూ. 20 కోట్లు... రన్నరప్ హైదరాబాద్ జట్టుకు రూ. 12 కోట్ల 50 లక్షలు ప్రైజ్‌మనీగా లభించాయి.


'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' స్టార్క్
అభిషేక్ బౌల్డ్

చెన్నై: పదేళ్ల తర్వాత కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) మళ్లీ ఐపీఎల్ చాంపియన్‌గా అవతరించింది. ఆదివారం చెపాక్ మైదానంలో ఏకపక్షంగా సాగిన ఐపీఎల్ 17వ సీజన్ ఫైనల్ పోరులో కోల్‌కతా 8 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 18.3 ఓవర్లలో 113 పరుగులకే ఆలౌటైంది. ఐపీఎల్ చరిత్రలో ఫైనల్ మ్యాచ్‌లో ఇదే అత్యల్ప స్కోరు. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (19 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్)దే అత్యధిక స్కోరు. అనంతరం నైట్‌రైడర్స్ 10.3 ఓవర్లలో 2 వికెట్లకు 114 పరుగులు చేసి గెలిచింది. వెంకటేశ్ అయ్యర్ (26 బంతుల్లో 52 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), రహ్మనుల్లా గుర్బాజ్ (32 బంతుల్లో 39; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు 45 బంతుల్లో 91 పరుగులు జోడించి జట్టును గెలిపించారు.

సమష్టి వైఫల్యం...

తొలి ఓవర్లో స్టార్క్ వేసిన అద్భుత బంతికి అభిషేక్ శర్మ (2) క్లీన్‌బౌల్డ్ కావడంతో మొదలైన సన్‌రైజర్స్ పతనం వేగంగా సాగింది. కోల్‌కతా కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు ఏ దశలోనూ హైదరాబాద్ తిరిగి కోలుకోలేకపోయింది. హెడ్ (0) తన వైఫల్యాన్ని కొనసాగిస్తూ ఆడిన తొలి బంతికి అవుటై మరో డకౌట్ ఖాతాలో వేసుకున్నాడు. త్రిపాఠి (13 బంతుల్లో 9; 1 ఫోర్) ఈసారి ఆదుకోలేకపోగా, నితీశ్ రెడ్డి (10 బంతుల్లో 13; 1 ఫోర్, 1 సిక్స్), షహబాజ్ (7 బంతుల్లో 8; 1 సిక్స్), అబ్దుల్ సమద్ (4) విఫలమయ్యారు. మరోవైపు మార్క్‌రమ్ (23 బంతుల్లో 20; 3 ఫోర్లు) పరుగులు తీయడానికి ఇబ్బంది పడగా... క్లాసెన్ (17 బంతుల్లో 16; 1 ఫోర్) కూడా భారీ షాట్లు ఆడలేకపోయాడు. 14 ఓవర్ల తర్వాత సన్‌రైజర్స్ స్కోరు 90/7. క్లాసెన్ క్రీజ్‌లో ఉండటంతో చివరి 6 ఓవర్లలోనైనా ఎక్కువ పరుగులు సాధించవచ్చని రైజర్స్ ఆశించింది. అయితే తర్వాతి బంతికే అతను బౌల్డ్ కావడంతో ఆశలు ఆవిరయ్యాయి. చివర్లో కమిన్స్ కొన్ని పరుగులు జత చేసి స్కోరును 100 దాటించాడు.

ఫటాఫట్...

స్వల్ప ఛేదనలో కేకేఆర్‌కు ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. నరైన్ (2 బంతుల్లో 6; 1 సిక్స్) ఆరంభంలోనే వెనుదిరిగినా... వెంకటేశ్, గుర్బాజ్ వేగంగా జట్టును గెలుపు దిశగా తీసుకెళ్లారు. భువనేశ్వర్ ఓవర్లో వరుసగా 4, 6, 6 కొట్టిన వెంకటేశ్, ఆ తర్వాత నటరాజన్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6, 4 బాది లక్ష్యాన్ని మరింత సులువగా మార్చేశాడు. 24 బంతుల్లోనే వెంకటేశ్ హాఫ్ సెంచరీ పూర్తయింది. విజయానికి 12 పరుగుల దూరంలో గుర్బాజ్ అవుటైనా... వెంకటేశ్, కెప్టెన్ శ్రేయస్ (3 బంతుల్లో 6 నాటౌట్; 1 ఫోర్) కలిసి ఆట ముగించారు.

ఐపీఎల్-17 బౌండరీ మీటర్

మొత్తం సిక్స్‌లు	మొత్తం ఫోర్లు
1260	2174

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (బి) స్టార్క్ 2; హెడ్ (సి) గుర్బాజ్ (బి) వైభవ్ అరోరా 0; త్రిపాఠి (సి) రమణ్‌దీప్ (బి) స్టార్క్ 9; మార్క్‌రమ్ (సి) స్టార్క్ (బి) రసెల్ 20; నితీశ్ కుమార్ రెడ్డి (సి) గుర్బాజ్ (బి) హర్షిత్ రాణా 13; క్లాసెన్ (బి) హర్షిత్ రాణా 16; షహబాజ్ (సి) నరైన్ (బి) వరుణ్ 8; సమద్ (సి) గుర్బాజ్ (బి) రసెల్ 4; కమిన్స్ (సి) స్టార్క్ (బి) రసెల్ 24; జైదేవ్ ఉనాద్కట్ (ఎల్బీ) (బి) నరైన్ 4; భువనేశ్వర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (18.3 ఓవర్లలో ఆలౌట్) 113. వికెట్ల పతనం: 1-2, 2-6, 3-21, 4-47, 5-62, 6-71, 7-77, 8-90, 9-113, 10-113. బౌలింగ్: స్టార్క్ 3-0-14-2, వైభవ్ అరోరా 3-0-24-1, హర్షిత్ రాణా 4-1-24-2, నరైన్ 4-0-16-1, రసెల్ 2.3-0- 19-3, వరుణ్ చక్రవర్తి 2-0-9-1. **కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్:** గుర్బాజ్ (ఎల్బీ) (బి) షహబాజ్ 39; నరైన్ (సి) షహబాజ్ (బి) కమిన్స్ 6; వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 52; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (10.3 ఓవర్లలో 2 వికెట్లకు) 114. వికెట్ల పతనం: 1-11, 2-102. బౌలింగ్: భువనేశ్వర్ 2-0-25-0, కమిన్స్ 2-0-18-1, నటరాజన్ 2-0-29-0, షహబాజ్ 2.3-0-22-1, ఉనాద్కట్ 1-0-9-0, మార్క్‌రమ్ 1-0-5-0.

'తీన్'మార్ విజయ గాథ

నైట్‌రైడర్స్ రాత మార్చిన మెంటార్ గంభీర్, హెడ్ కోచ్ పండిత్

సరిగ్గా నెల రోజుల క్రితం ఏప్రిల్ 26... సొంత మైదానం ఈడెన్ గార్డెన్స్‌లో పంజాబ్‌తో మ్యాచ్‌లో కోల్‌కతా 261 పరుగులు సాధించి నిశ్చింతగా ఉంది. కానీ పంజాబ్ 2 వికెట్లు మాత్రమే కోల్పోయి మరో 8 బంతులు మిగిలి ఉండగానే 262 పరుగులతో ఐపీఎల్ రికార్డు లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. దాంతో కేకేఆర్ బౌలింగ్‌పై అందరికీ సందేహాలు వచ్చేశాయి. ఇలాంటి బౌలింగ్‌తో ముందంజ


గంభీర్, పండిత్

వేయడం కష్టమే అనిపించింది. కానీ ఆ తర్వాత ఒక్కసారిగా నైట్‌రైడర్స్ చెలరేగింది. సీజన్‌లో కోల్‌కతాకు అది ఎనిమిదో మ్యాచ్ కాగా, ఆ తర్వాత ఓటమి అనేదే లేకుండా టీమ్ సాగింది. తర్వాత 8 మ్యాచ్‌లలో 2 రద్దయిన మ్యాచ్‌లను వదిలేస్తే మరో 6 మ్యాచ్‌ల్లో గెలిచి టీమ్ విజేతగా నిలిచింది. లీగ్ దశలో 9 విజయాలతో అగ్రస్థానంలో నిలిచింది. టోర్నీ మొత్తంలో 3 మ్యాచ్‌లలోనే ఆ జట్టు ఓడింది. కానీ కేకేఆర్ టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం తమ ఆటగాళ్లపై నమ్మకం ఉంచింది. దానిని వారు వమ్ము చేయలేదు. జట్టులోని సభ్యులంతా ఏదో ఒక రూపంలో విజయాల్లో కీలక భాగస్వాములయ్యారు.

2022 సీజన్ కోసం జరిగిన వేలంలో కోల్‌కతా కొందరు కొత్త ఆటగాళ్లను తీసుకోవడంతో పాటు శ్రేయస్ అయ్యర్‌ను కూడా ఎంచుకొని తమ కెప్టెన్‌గా నియమించుకుంది. కానీ ఫలితం మాత్రం రాక ఏడో స్థానానికి పరిమితమైంది. గత ఏడాదైతే గాయంతో శ్రేయస్ దూరం కావడంతో నితీశ్ రాణా కెప్టెన్‌గా వ్యవహరించాడు. మళ్లీ ఏడో స్థానంతోనే సరి. ఈసారి కూడా సీజన్ ఆరంభానికి ముందు ఎలాంటి అంచనాలు లేవు. ఎప్పటిలాగే లీగ్ దశలో కొన్ని విజయాలు సాధించి ప్లే ఆఫ్స్‌కు చేరే అవకాశం లేదని అనిపించింది. వరుసగా విఫలమవుతున్నా... ఈ సీజన్‌కు కూడా నరైన్, రసెల్, నితీశ్ రాణాలాంటి ఆటగాళ్లను ఇంకా కొనసాగించడం ఏమిటని వినిపించింది. ఇక స్టార్క్ కోసం ఏకంగా రూ. 24 కోట్ల 75 లక్షలు చెల్లించడంతో అందరూ ఆశ్చర్యపోయారు! కానీ తుది ఫలితం మాత్రం అద్భుతంగా వచ్చింది. దశాబ్ద కాలం తర్వాత కేకేఆర్ మళ్లీ కప్‌ను ముద్దాడింది.

ప్రత్యేకమైన బృందం కోల్‌కతా విజయంలో కీలకపాత్ర పోషించింది. తమకు కెప్టెన్‌గా రెండు టైటిల్స్ అందించిన గౌతమ్ గంభీర్ ఈసారి జట్టు మెంటార్‌గా వచ్చాడు. కోచ్‌గా 6 రంజీ ట్రోఫీలు గెలిచిన రికార్డు ఉన్న చంద్రకాంత్ పండిత్ టీమ్‌కు హెడ్ కోచ్ అయ్యాడు. మరోవైపు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ కూడా కసి మీద ఉన్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌ను తాను తొలిసారి ఫైనల్‌కు చేర్చినా... గాయం నుంచి కోలుకొని తిరిగొచ్చిన తర్వాత కెప్టెన్సీ ఇవ్వలేదని మూడేళ్ల క్రితం జట్టును వీడిన అతను గాయంతో గత సీజన్‌లో ఆడలేదు. పైగా భారత జట్టులో చోటు కోల్పోవడంతో పాటు బీసీసీఐ కాంట్రాక్ట్ కూడా చేజారింది. ఇలాంటి స్థితిలో నాయకుడిగా తన సత్తాను చూపేందుకు అతనికి సరైన అవకాశం వచ్చింది. దానిని అతను సమర్థంగా వాడుకున్నాడు. వ్యూహ ప్రతివ్యూహాలను డగౌట్‌లో గంభీర్, పండిత్ రచిస్తే మైదానంలో అతను దానిని సరిగ్గా అమలు పరిచాడు.

తొలి క్వాలిఫయర్‌లో స్టార్క్ వేసిన మొదటి ఓవర్‌ను ఎదుర్కొన్న హెడ్ డకౌటయ్యాడు. ఫైనల్‌కు వచ్చేసరికి వ్యూహం మారింది. ఈసారి తొలి ఓవర్‌ను అభిషేక్ శర్మ ఆడాడు. కానీ స్టార్క్ మళ్లీ అలాంటి బంతి, అదే తరహా క్లీన్‌బౌల్డ్! టోర్నీ మొత్తానికి హైలైట్‌గా నిలిచిన ఈ బంతి రైజర్స్ పతనానికి శ్రీకారం చుట్టింది. స్టార్క్ విలువేమిటో చూపించడమే కాదు, మానసికంగా కూడా స్టార్క్‌ను ఎదుర్కోవడంలో హెడ్ ఇబ్బంది పడ్డాడనేది స్పష్టం. రూ. 24 కోట్ల 75 లక్షల భారీ ట్యాగ్‌తో ఐపీఎల్‌లోకి అడుగు పెట్టిన స్టార్క్ ఆరంభంలో పూర్తిగా తడబడి భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. కానీ టోర్నీ సాగుతున్న కొద్దీ చెలరేగిన అతను అసలు సమయంలో సత్తా చాటాడు. తొలి క్వాలిఫయర్, ఫైనల్‌లలో అతని బౌలింగ్ చూస్తే స్టార్క్‌కు పెట్టిన విలువ గురించి మళ్లీ చర్చించకుండా అతడిని 'అమూల్యమైన' ఆటగాడిగా మార్చేసింది. 2012లో టైటిల్ గెలిచిన సభ్యుల్లో జట్టుదైన నరైన్ ఇప్పుడూ టీమ్‌లో భాగం కావడం విశేషం. 6.69 ఎకానమీతో 17 వికెట్లు తీయడమే కాదు, బ్యాటింగ్‌లోనూ ఏకంగా 180.74 స్ట్రయిక్‌రేట్‌తో 488 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవడం పెద్ద విశేషం. వరుణ్ చక్రవర్తి (21 వికెట్లు), రసెల్ (19), హర్షిత్ రాణా (19), అరోరా (11) తమ వంతు పాత్ర పోషించారు. పార్ట్‌టైమర్లు అంటూ లేకుండా ఆరుగురు రెగ్యులర్ బౌలర్లే కలిపి మొత్తం వికెట్లు పంచుకోవడం జట్టు బౌలింగ్ పదునును చూపించింది. బ్యాటింగ్‌లో సాల్ట్ (435), వెంకటేశ్ అయ్యర్ (370), శ్రేయస్ అయ్యర్ (351), రసెల్ (222) చెలరేగారు. రింకూ సింగ్ (168) ఆశించిన స్థాయిలో ఆడకపోయినా జట్టుపై దాని ప్రభావం పడలేదు. జట్టులో ఏ ఒక్కరిపైనో ఆధారపడకుండా సమష్టి ప్రదర్శనతోనే కోల్‌కతా విజేతగా నిలవగలిగింది. **-సాక్షి క్రీడా విభాగం**

5 ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టైటిల్ గెలిచిన ఐదో భారతీయ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ గుర్తింపు పొందాడు. గతంలో ధోని (చెన్నై-5 సార్లు), గౌతమ్ గంభీర్ (కోల్‌కతా-2 సార్లు), రోహిత్ శర్మ (ముంబై -5 సార్లు), హార్దిక్ పాండ్యా (గుజరాత్-ఒకసారి) ఈ ఘనత సాధించారు.

3 చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ (5 సార్లు చొప్పున) తర్వాత అత్యధికంగా మూడుసార్లు ఐపీఎల్ టోర్నీ విజేతగా నిలిచిన జట్టుగా కోల్‌కతా గుర్తింపు పొందింది.

1 గత 16 ఐపీఎల్ టోర్నీ ఫైనల్స్‌లో ఏ జట్టు కూడా ఆలౌట్ కాలేదు. ఐపీఎల్ టోర్నీ ఫైనల్లో ఆలౌటైన తొలి జట్టుగా సన్‌రైజర్స్ హైదరాబాద్ నిలిచింది.

8 ఇప్పటి వరకు జరిగిన 17 ఐపీఎల్ ఫైనల్స్‌లో 8 సార్లు ఛేజింగ్ చేసిన జట్టు చాంపియన్‌గా నిలిచింది. తొమ్మిదిసార్లు తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు విజేతగా నిలిచింది.

4 ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీ మొత్తంలో బౌలర్లు ఒక్క హ్యాట్రిక్ కూడా నమోదు చేయలేకపోయారు. ఇలా జరగడం ఇది నాలుగోసారి. 2015, 2018, 2020 సీజన్‌లలో కూడా ఒక్క హ్యాట్రిక్ నమోదు కాలేదు.

14 ఐపీఎల్-2024లో మొత్తం నమోదైన సెంచరీలు. గత ఐపీఎల్ సీజన్‌లో అత్యధికంగా 12 సెంచరీలు వచ్చాయి.

చరిత్ర సృష్టించిన దీపా కర్మాకర్



తాష్కెంట్: ఆసియా సీనియర్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్‌కు తొలిసారి స్వర్ణ పతకం లభించింది. ఆదివారం జరిగిన మహిళల వాల్ట్ ఈవెంట్‌లో 30 ఏళ్ల దీపా కర్మాకర్ 13.566 పాయింట్లతో విజేతగా నిలిచింది. తద్వారా ఈ టోర్నీ చరిత్రలో పసిడి పతకం గెలిచిన తొలి భారతీయ జిమ్నాస్ట్‌గా కొత్త చరిత్ర లిఖించింది. గతంలో దీపా ఈ టోర్నీలో 2015లో కాంస్య పతకం సాధించింది. భారత్‌కే చెందిన ఆశిష్ కుమార్ 2015లో ఫ్లోర్ ఈవెంట్‌లో కాంస్యం... ప్రణతి నాయక్ వాల్ట్ ఈవెంట్‌లో 2019లో, 2022లో కాంస్య పతకాలు సాధించారు.

న్యూయార్క్ చేరిన రోహిత్ బృందం

రెండో బ్యాచ్‌లో వెళ్లనున్న కోహ్లి, పాండ్యా



న్యూయార్క్: ఐసీసీ టి20 ప్రపంచకప్ ఆడేందుకు రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమిండియా అమెరికాలో అడుగు పెట్టింది. తొలి బ్యాచ్‌లో కెప్టెన్ సహా 11 మంది భారత ఆటగాళ్లు ఆదివారం న్యూయార్క్ చేరుకున్నారు. ఈ బృందంలో బుమ్రా, సిరాజ్, సూర్యకుమార్, రిషభ్ పంత్, శివమ్ దూబే, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌లతో పాటు రిజర్వ్ ప్లేయర్లు శుబ్‌మన్ గిల్, ఖలీల్ అహ్మద్ ఉన్నారు. హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, సహాయ సిబ్బంది జట్టుతో పాటు ఉంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి, వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా మిగిలిన వారు రెండో బ్యాచ్‌లో అక్కడికి బయల్దేరతారు. ఇంగ్లండ్‌లో ఉన్న పాండ్యా అక్కడి నుంచే అమెరికా వెళ్లే అవకాశముంది. రెండో క్వాలిఫయర్ ఆడిన రాజస్తాన్ రాయల్స్ జట్టు సభ్యులు సంజూ సామ్సన్, యశస్వి జైస్వాల్, యుజువేంద్ర చహల్, ఆవేశ్ ఖాన్ (రిజర్వ్ ప్లేయర్) సోమవారం అక్కడికి పయనమవుతారు. మెగా టోర్నీకి ముందు భారత్... బంగ్లాదేశ్‌తో జూన్ 1న ఏకైక వార్మప్ మ్యాచ్ ఆడుతుంది. టీమిండియా లీగ్ దశ పోటీలన్నీ కూడా అమెరికాలోనే ఆడుతుంది. గ్రూప్ 'ఎ'లో ఉన్న భారత్ తమ తొలి మ్యాచ్‌ను జూన్ 5న ఐర్లాండ్‌తో ఆడుతుంది. టోర్నీకే హైలైట్‌గా నిలిచే చిరకాల ప్రత్యర్థుల (భారత్, పాక్) సమరం జూన్ 9న న్యూయార్క్‌లో జరుగుతుంది.

అల్‌కరాజ్ శుభారంభం

రెండో రౌండ్‌లోకి స్పెయిన్ స్టార్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో స్పెయిన్ స్టార్, ప్రపంచ మూడో ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్ శుభారంభం చేశాడు. ఆదివారం మొదలైన ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో అల్‌కరాజ్ 6-1, 6-2, 6-1తో జేజే వుల్ఫ్ (అమెరికా)పై గెలుపొందాడు. గంటా 51 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ఐదు ఏస్‌లు సంధించాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను తొమ్మిది సార్లు బ్రేక్ చేసి తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయాడు. ఆరో సీడ్ రుబ్లెవ్ (రష్యా) కూడా రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. తొలి రౌండ్‌లో రుబ్లెవ్ 6-2, 6-7 (3/7), 6-3, 6-5తో టారో డానియల్ (జపాన్)ను ఓడించాడు.
మహిళల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ నయోమి ఒసాకా (జపాన్), మాజీ విజేత, తొమ్మిదో సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా) రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్‌లో ఒసాకా 2 గంటల్లో 6-1, 4-6, 7-5తో బ్రాన్‌జెట్టి (ఇటలీ)పై నెగ్గగా... ఒస్టాపెంకో 6-4, 7-5తో జాక్వెలిన్ క్రిస్టియన్ (రొమేనియా)పై నెగ్గింది.

లెక్‌లెర్క్ ఘనత

సొంతగడ్డపై ఎఫ్1 గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



మోంటెకార్లో: సొంతగడ్డపై ఎఫ్1 రేసులో విజేతగా నిలవాలన్న తన కలను ఫెరారీ జట్టు డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ నిజం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన మొనాకో గ్రాండ్‌ప్రి ఎఫ్1 రేసులో మొనాకోకు చెందిన లెక్‌లెర్క్ టైటిల్ సాధించాడు. తద్వారా 95 ఏళ్ల చరిత్ర కలిగిన మొనాకో గ్రాండ్‌ప్రి రేసులో టైటిల్ నెగ్గిన తొలి మొనాకో డ్రైవర్‌గా 26 ఏళ్ల లెక్‌లెర్క్ రికార్డు సృష్టించాడు. నిర్ణీత 78 ల్యాప్‌లను 'పోల్ పొజిషన్'తో ఆరంభించిన లెక్‌లెర్క్ ఆద్యంతం ఆధిపత్యం కొనసాగించి అందరికంటే వేగంగా 2 గంటల 23 నిమిషాల 15.554 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో లెక్‌లెర్క్‌కిది తొలి విజయంకాగా కెరీర్‌లో ఆరోది. ఆస్కార్ పియాస్ట్రీ (మెక్‌లారెన్) రెండో స్థానంలో, కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) మూడో స్థానంలో నిలిచారు. ప్రపంచ చాంపియన్, ఈ సీజన్‌లో ఐదు విజయాలు నమోదు చేసిన వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. తొలి ల్యాప్ మలుపు వద్ద కార్లు ఢీకొట్టుకోవడంతో నలుగురు డ్రైవర్లు ఒకాన్ (అల్పైన్), పెరెజ్ (రెడ్‌బుల్), హుల్కెన్‌బర్గ్ (హాస్), మాగ్నుసెన్ (హాస్) రేసు నుంచి వైదొలిగారు. సీజన్‌లోని తదుపరి రేసు కెనడా గ్రాండ్‌ప్రి జూన్ 9న మాంట్రియల్‌లో జరుగుతుంది.

రన్నరప్ సింధు

మలేసియా ఓపెన్ ఫైనల్లో పరాజయం



కౌలాలంపూర్: రెండేళ్లుగా అంతర్జాతీయ టైటిల్ కోసం నిరీక్షిస్తున్న భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు మరోసారి నిరాశ ఎదురైంది. మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో సింధు 21-16, 5-21, 16-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ వాంగ్ జి యి (చైనా) చేతిలో ఓడిపోయింది. సింధుకు 15,960 డాలర్ల (రూ. 13 లక్షల 25 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 7800 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. వాంగ్ జి యితో 79 నిమిషాల పాటు జరిగిన తుది పోరులో సింధు కీలకదశలో ఒత్తిడికిలోనై మూల్యం చెల్లించుకుంది. నిర్ణాయక మూడో గేమ్‌లో సింధు ఒకదశలో 11-3తో ఆధిక్యంలో నిలిచింది. అయితే ఈ భారీ ఆధిక్యాన్ని ఆమె కాపాడుకోవడంలో విఫలమైంది. 2022 సింగపూర్ ఓపెన్ ఫైనల్లో వాంగ్ జి యిపై నెగ్గి చివరిసారి అంతర్జాతీయ టైటిల్ గెలిచిన సింధు గత ఏడాది స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ ఫైనల్లో గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది.

నిశాంత్ ముందంజ



బ్యాంకాక్: వరల్డ్ బాక్సింగ్ ఒలింపిక్ చివరి క్వాలిఫయింగ్ టోర్నీలో భారత బాక్సర్ల విజయపరంపర కొనసాగుతోంది. ఆదివారం జరిగిన రెండు వెయిట్ కేటగిరీల్లో బరిలోకి దిగిన భారత బాక్సర్లు నిశాంత్ దేవ్ (71 కేజీలు), అబినాశ్ జమ్వాల్ (63.5 కేజీలు) గెలుపొందారు. అమాండో బిగాటె (గినీ బిసావో)తో జరిగిన తొలి రౌండ్ బౌట్‌లో నిశాంత్ 5-0తో నెగ్గగా... అబినాశ్ 5-0తో ఆండ్రిజెస్ లవ్రెనొవాస్ (లిథువేనియా)ను ఓడించాడు. ఇదే టోర్నీలో భారత బాక్సర్లు అభిమన్యు (80 కేజీలు), సచిన్ సివాచ్ (57 కేజీలు) కూడా తొలి రౌండ్‌లో గెలిచి ముందంజ వేశారు.

మళ్లీ ఓడిన భారత్



ఆంట్‌వర్ప్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రొ లీగ్ యూరోపియన్ అంచె పోటీల్లో భారత మహిళల జట్టు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. అర్జెంటీనాతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సలీమా టెటె నాయకత్వంలోని భారత జట్టు 0-3 గోల్స్‌తో ఓడిపోయింది. భారత జట్టుకిది వరుసగా నాలుగో ఓటమి కావడం గమనార్హం. అర్జెంటీనా తరఫున సెలీనా (1వ ని.లో), కంపోయ్ (39వ ని.లో), గ్రనాట్టో (47వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. తొమ్మిది జట్ల మధ్య జరుగుతున్న ప్రొ లీగ్‌లో ప్రస్తుతం భారత జట్టు 12 మ్యాచ్‌లు పూర్తి చేసుకొని ఎనిమిది పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది. జూన్ 1న లండన్‌లో జరిగే తదుపరి మ్యాచ్‌లో జర్మనీతో భారత్ తలపడుతుంది.

కాంస్య పతక మ్యాచ్‌లో దీపిక కుమారి ఓటమి



యెచోన్ (కొరియా): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నీలో భారత స్టార్, మాజీ నంబర్‌వన్ దీపిక కుమారి పతకాన్ని గెలవడంలో విఫలమైంది. ఆదివారం జరిగిన మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగం కాంస్య పతక మ్యాచ్‌లో దీపిక 4-6 (26-29, 26-28, 28-25, 27-25, 26-29)తో ప్రపంచ మూడో ర్యాంకర్ అలెజాంద్రా (మెక్సికో) చేతిలో ఓడిపోయింది. అంతకుముందు సెమీఫైనల్లో దీపిక 2-6 (26-28, 28-28, 27-28, 27-27)తో ప్రపంచ రెండో ర్యాంకర్ లిమ్ సిహైన్ (దక్షిణ కొరియా) చేతిలో ఓటమి పాలైంది. గత నెలలో షాంఘైలో జరిగిన ప్రపంచకప్ స్టేజ్-1 టోర్నీలో దీపిక రజత పతకం గెలిచింది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 8	74,410
నిఫ్టీ ▽ 11	22,957

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	16,921	△	185
డోజోన్స్	39,070	△	4
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,318	▽	22
డాక్స్	18,693	△	2
షాంఘై	3,088	▽	28
నికాయ్	38,647	▽	457

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.91	83.93
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.77	107.33
€	యూరో	ఎస్‌బీఐ	89.37	91.74
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.80	53.96
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.65	56.59
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.54	64.19
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.31	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.45

ప్రీమియం భారమైతే.. పరిష్కారం?



ఏడాదిలో 25-50 శాతం పెరిగిన ప్రీమియం

- రేట్లను ఏటా సవరిస్తున్న బీమా సంస్థలు
- భరించలేకపోతే పోర్ట్‌తో కంపెనీ మార్చొచ్చు
- ప్రీమియం తక్కువే కాదు, మెరుగైన ఫీచర్లూ ఉండాలి
- తక్కువ బేస్ కవరేజీ.. అదనంగా సూపర్ టాపప్
- దీనివల్ల ప్రీమియంతో కొంత ఆదా



హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు మరోసారి ప్రీమియం బాదుడు షురూ చేశాయి. 'కర్ణుడి చావుకి కోటి కారణాలన్నట్టు'.. బీమా సంస్థలు కూడా ప్రీమియం పెంచడానికి ఎన్నో కారణాలు చూపిస్తుంటాయి. లోకల్ సర్కిల్స్ సంస్థ ఇటీవలే నిర్వహించిన ఒక సర్వేలో.. గడిచిన ఏడాది కాలంలో తమ వ్యక్తిగత హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియం 25 శాతం పెరిగినట్టు 52 శాతం మంది చెప్పారు. హెల్త్ ఇన్సూరెన్స్ నూతన పాలసీల ప్రీమియం సైతం ఈ ఏడాది మొదటి మూడు నెలలల్లోనే 5.54 శాతం మేర పెరిగినట్టు బీమా పంపిణీ ప్లాట్‌ఫామ్ 'పాలసీఎక్స్' చెబుతోంది. రెక్కలు తొడిగిన పక్షి మాదిరిగా ఇలా ప్రీమియం గణనీయంగా పెరుగుతూ పోతుంటే కొత్తగా పాలసీ తీసుకునే వారికే కాదు, అప్పటికే పాలసీ తీసుకున్న వారిపైనా అదనపు భారం పడుతుంది. మరి ఈ పరిస్థితుల్లో ప్రీమియం భారం కొంత తగ్గించుకునే మార్గాలేంటన్నది చూద్దాం.

హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీల ప్రీమియం గణనీయంగా పెరిగిపోవడానికి వైద్య ద్రవ్యోల్బణం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. సాధారణంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ద్రవ్యోల్బణం నిత్యావసరాలకు (వినియోగ ధరల, టోకు ధరల ఆధారిత) సంబంధించినది. ఇది 5-6 శాతం మధ్య ఉంటోంది. కానీ, వైద్య రంగంలో ద్రవ్యోల్బణం ఇంతకు రెట్టింపు 14-15 శాతంగా ఉంటోంది. చికిత్సల వ్యయాలు ఈ స్థాయిలో ఏటా పెరిగిపోతుండడం

ప్రీమియం ఎందుకు పెరుగుతోంది..

తో, బీమా సంస్థలకు పెద్ద మొత్తంలో క్లెయిమ్‌లు వస్తున్నాయి. దీంతో వాటిపై చెల్లింపుల భారం పడుతోంది. ''వైద్య రంగంలో ఎప్పటికప్పుడు అధునాతన టెక్నాలజీలు, చికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణ వసతులు మెరుగుపడడం, ప్రాణాలను కాపాడే అధునాతన చికిత్సలు అందుబాటులోకి రావడం.. ఇవన్నీ వ్యయాలు పెరగడానికి దారితీస్తున్నాయి'' అని రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ సీఈవో రాకేశ్ జైన్ తెలిపారు. ఔషధాలు, ఇంప్లాంట్లు, ఇతరత్రా వ్యయాలు పెరగడం వల్లే ఆస్పత్రుల చికిత్సల ధరలు పెరిగేందుకు కారణమవుతున్నట్టు కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ అండర్ రైటింగ్, క్లెయిమ్స్ హెడ్ మనీష్ డొడేజా సైతం పేర్కొన్నారు. జీవనశైలి, ఇతర వ్యాధుల రిస్క్ పెరగడం కూడా అధిక క్లెయిమ్‌లకు దారితీస్తున్నట్టు చెప్పారు. ''మనదేశం ప్రపంచ మధుమేహం రాజధానిగా మారుతోంది. అధిక రక్తపోటు, గుండె జబ్బులు, కేన్సర్ రిస్క్ సైతం పెరుగుతోంది''అని ఇన్సూరెన్స్ సమాధాన్ సంస్థ సహ వ్యవస్థాపకురాలు శిల్పా అరోరా తెలిపారు. కరోనా సమయంలో, ఆ తర్వాత కూడా ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరే వారి సంఖ్య పెరిగింది. దీంతో బీమా సంస్థలకు పరిహారం కోరుతూ వచ్చే క్లెయిమ్‌లు గణనీయంగా పెరిగాయి. ఈ భారాన్ని దింపుకునేందుకు బీమా సంస్థలు విడతల వారీగా పాలసీదారులకు ప్రీమియం వాత పెడుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. కరోనా తర్వాత ఆరోగ్య బీమా ప్రీమియం సవరణ ఇప్పుడే మొదటిసారి కాదు. లోగడ ఒకటి రెండు సార్లు కూడా అవి సవరించాయి.

అందరికీ కవరేజ్ లేకపోవడమూ కారణమే...

ఇక మనదేశంలో హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ అందరికీ లేకపోవడం కూడా ప్రీమియం అధికంగా ఉండడానికి మరొక కారణమంటున్నారు నిపుణులు. ఎక్కువ మంది హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటే బీమా సంస్థలు వ్యయాలను మరింత మంది పాలసీదారులతో పంచుకోవడానికి వీలు ఏర్పడుతుంది. దీంతో విడిగా ఒక్కొక్కరిపై పడే ప్రీమియం భారం తగ్గుతుంది. ప్రీమియంపై 18 శాతం జీఎస్‌టీ సైతం మరో పిడుగులాంటిదే. ఉదాహరణకు రూ.10వేల వార్షిక ప్రీమియంపై రూ.1,800 జీఎస్‌టీని కేంద్రం వసూలు చేస్తోంది. బీమా సంస్థలు వయసుల వారీగా ప్రీమియం పెంచుతుంటాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి 35 ఏళ్లు నిండి 36వ సంవత్సరంలోకి ప్రవేశించినప్పుడు ప్రీమియం పెరిగిపోతుంది. అలాగే 45 ఏళ్లు నిండి 46లోకి ప్రవేశించినప్పుడు కూడా ప్రీమియం



టారిఫ్‌లను బీమా సంస్థలు సవరిస్తుంటాయి. ఎందుకంటే వయసు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్య సమస్యలు అధికమవుతుంటాయి. దీంతో చికిత్సల క్లెయిమ్‌ల రిస్క్ పెరిగిపోతుంటుంది. దీన్ని ఎదుర్కొనేందుకు బీమా సంస్థల ముందున్న ఏకైక పరిష్కారం ప్రీమియం బాదుడే. ఇక బీమా పాలసీ తీసుకున్న వారు కూడా పెద్ద పట్టణాల్లోని ప్రముఖ హాస్పిటల్స్‌లో చికిత్సలు తీసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పేరొందిన కార్పొరేట్ ఆస్పత్రుల్లో సాధారణంగానే వైద్య చికిత్సల చార్జీలు ఎక్కువగా ఉంటాయి. దీంతో బీమా సంస్థలకు పెద్ద మొత్తంలో క్లెయిమ్ బిల్లులు వస్తున్నాయి. ఇది కూడా ప్రీమియం పెరిగేందుకు కారణమవుతోంది. ఇటీవలే బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ముందస్తు వ్యాధులకు వెయిటింగ్ పీరియడ్‌ను నాలుగేళ్ల నుంచి మూడేళ్లకు తగ్గించింది. మారటోరియం పీరియడ్‌ను ఎనిమిదేళ్ల నుంచి ఐదేళ్లకు తగ్గించింది. దీని వల్ల కూడా క్లెయిమ్‌లు పెరుగుతాయన్న అంచనాతో బీమా సంస్థలు ప్రీమియంను సవరిస్తున్నాయి. వచ్చే 12 నెలల కాలంలోనూ ప్రీమియంలు పెరుగుతాయన్న విశ్లేషణలు ఉన్నాయి.

అసలు హెల్త్ ప్లాన్ అవసరమా?

హెల్త్ ప్లాన్ లేకపోతే ఆర్థికంగా కుటుంబం గుల్ల కాక తప్పదు. ప్రీమియం భారంగా మారిందని హెల్త్ ప్లాన్ ప్రీమియం కట్టడం మానేయవద్దు. ఎందుకంటే జీవనశైలి వ్యాధులు పెరిగిపోయాయి. అదే సమయంలో అత్యాధునిక చికిత్సా విధానాలతో వ్యయాలు కూడా పెరిగాయి. హెల్త్ ప్లాన్ తీసుకోకపోతే.. అనుకోకుండా ఏదైనా అనారోగ్యం బారిన పడినప్పుడు లేదా రోడ్డు ప్రమాదం కారణంగా ఆస్పత్రిలో చేరాల్సి వస్తే, రుణాలతో గట్టెక్కాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. అందుకని ఆరోగ్య బీమా రక్షణ ఉండేలా చూసుకోవడం తప్పనిసరి.

21 % మంది గడిచిన ఏడాదిలో తమ పాలసీ ప్రీమియం 50 శాతం కంటే ఎక్కువే పెరిగినట్టు చెప్పారు.

31 % మంది 25-50 % మధ్య ప్రీమియం గతేడాదితో పోలిస్తే పెరిగినట్టు తెలిపారు.

15 శాతం మంది తమ ప్రీమియంలో ఎలాంటి మార్పు లేదన్నారు. వీరిలో ఎక్కువ మంది గ్రూప్ హెల్త్ ప్లాన్‌లో ఉన్నవారే.

మొత్తం 11,000 మంది ఈ సర్వేలో పాల్గొన్నారు.



- లోకల్ సర్కిల్స్ సర్వే వివరాలివి...

భారం ఎలా తగ్గించుకోవాలి?

పోర్టింగ్: ఆరోగ్య బీమా ఒకసారి కొనుగోలు చేసి మర్చిపోయే వస్తువు కాదు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మీ పాలసీలోని సదుపాయాలు ఉన్నాయా? అన్నది ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. సహేతుక ప్రీమియంపై మరింత మెరుగైన ఫీచర్లను వేరొక బీమా సంస్థ ఆఫర్ చేస్తుంటే, అందులోకి మారిపోవడం మంచి నిర్ణయమే అవుతుంది. హెల్త్ ఇన్సూరెన్స్‌ను ఒక కంపెనీ నుంచి మరో కంపెనీకి పోర్ట్ పెట్టుకోవచ్చు. కేవలం ప్రీమియం కొంత తక్కువగా ఉందని చెప్పి పోర్టింగ్ ఆప్షన్‌ను పరిశీలించడం సరైనది కాదు. ప్రీమియంలో చెప్పుకోతగ్గ వ్యత్యాసానికి తోడు, కొత్త సంస్థ ప్లాన్‌లో సదుపాయాలు మెరుగ్గా ఉన్నప్పుడే పోర్టింగ్‌ను పరిశీలించొచ్చు. పోర్టింగ్‌తో వేరొక బీమా సంస్థకు మారిపోయిన తర్వాత.. అక్కడ కూడా పాలసీ రెన్యువల్ (పునరుద్ధరణ) సమయంలో ప్రీమియం పెంచరని చెప్పలేం. అన్ని బీమా సంస్థలూ తమ క్లెయిమ్, ప్రీమియం నిష్పత్తి ఆధారంగానే ప్రీమియం పెంపు నిర్ణయాలు తీసుకుంటూ ఉంటాయి. కనుక ప్రీమియం పెంచినప్పుడల్లా దాన్ని తగ్గించుకునేందుకు కంపెనీని మారడం సరైన నిర్ణయం అనిపించుకోదు.



నో క్లెయిమ్ బోనస్: దాదాపు అన్ని బీమా సంస్థలు నో క్లెయిమ్ బోనస్‌ను ఆఫర్ చేస్తున్నాయి. అంటే ఒక పాలసీ సంవత్సరంలో ఎలాంటి క్లెయిమ్ లేకపోతే, మరుసటి సంవత్సరం రెన్యువల్ అనంతరం 10-100 శాతం వరకు ఏటా కవరేజీని పెంచుతుంటాయి. ఇలా గరిష్టంగా 100-200 శాతం వరకు కవరేజీ పెరుగుతుంది. ఉదాహరణకు రూ.10 లక్షల హెల్త్ ప్లాన్‌పై 50 శాతం నో క్లెయిమ్ బోనస్ ఆఫర్ ఉందనుకుంటే.. ఒక ఏడాదిలో క్లెయిమ్ లేకపోతే మరుసటి సంవత్సరం కవరేజీ రూ.15 లక్షలకు పెరుగుతుంది. రెండో ఏడాది కూడా క్లెయిమ్ లేకపోతే రూ.20 లక్షలకు పెరుగుతుంది. మూడో ఏడాది క్లెయిమ్ వస్తే, అప్పుడు పెరిగిన రూ.10 లక్షల నుంచి 50 శాతం అంటే రూ.5 లక్షలను తగ్గిస్తాయి. కానీ కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ అయితే సుప్రీమ్ ప్లాన్‌లో సమకూరిన నో క్లెయిమ్ బోనస్‌ను క్లెయిమ్ చేసుకున్నా డిడక్షన్ అమలు చేయడం లేదు. అంటే నో క్లెయిమ్ బోనస్ కూడా కవరేజీగానే మిగిలిపోతుంది. కనుక బేస్ కవర్ రూ.5 లక్షలు తీసుకోవడం ద్వారా ఈ ప్లాన్‌లో మెరుగైన కవరేజీని పొందొచ్చు. దీనివల్ల ప్రీమియం కూడా తగ్గుతుంది. పెద్దలు ఉంటే వారిని ప్రత్యేక ప్లాన్ కింద వేరు చేయాలి.

ఒకేసారి మూడేళ్లు: ప్రీమియంను ఒకేసారి మూడేళ్లకు చెల్లించే ఆప్షన్ కూడా ఉంది. ఇలా ఒకేసారి మూడేళ్లకు ప్రీమియం చెల్లిస్తే 10-15 శాతం ప్రీమియంలో తగ్గింపు లభిస్తుంది. దీని వల్ల మూడేళ్ల పాటు ప్రీమియం పెంపు భారాన్ని తప్పించుకోవచ్చు. వయసువారీ శ్లాబు మారే ముందు మూడేళ్ల ప్రీమియం ఒకేసారి చెల్లించడం వల్ల.. అక్కడి నుంచి మూడేళ్ల పాటు పెంపు లేకుండా చూసుకోవచ్చు.

సూపర్‌టాపప్: ప్రస్తుత పాలసీలో ఎంత కవరేజీ ఉందన్నది ఒక్కసారి గమనించండి. ఒకవేళ రూ.10 లక్షల కవరేజీ ఉంటే, దాన్ని రూ.5 లక్షలకు తగ్గించుకుని, రూ.5 లక్షల డిడక్టబుల్‌తో రూ.20-50 లక్షలకు సూపర్ టాపప్ ప్లాన్ తీసుకోవడం మరో మార్గం. దీనివల్ల బేస్ ప్లాన్ ప్రీమియం తగ్గుతుంది. సూపర్ టాపప్ చౌకగా వస్తుంది. దీనివల్ల మొత్తం మీద ప్రీమియంలో 10-15 శాతం తగ్గుతుంది.

ఫ్లోటర్ ప్లాన్: అవివాహితులు ఇండివిడ్యువల్ ప్లాన్ తీసుకుని ఉంటే.. వివాహం తర్వాత జీవిత భాగస్వామితో కలసి కొత్త ప్లాన్‌కు వెళ్లొద్దు. అప్పటికే ఉన్న ప్లాన్‌ను ఫ్లోటర్‌గా మార్చుకుని, జీవిత భాగస్వామిని చేర్చుకోవాలి. దీనివల్ల జీవిత భాగస్వామి ఒక్కరికే వెయిటింగ్ పీరియడ్ తదితర నిబంధనలు వర్తిస్తాయి. కొంత ప్రీమియం కూడా తగ్గుతుంది.

గ్రూప్ ప్లాన్: ప్రీమియం భారంగా పరిణమిస్తే.. అప్పుడు పనిచేస్తున్న సంస్థ నుంచి గ్రూప్ ప్లాన్ తీసుకోవడాన్ని పరిశీలించొచ్చు. లేదంటే దాదాపు అన్ని ప్రైవేటు బ్యాంక్‌లు గ్రూప్ హెల్త్‌ప్లాన్లను తమ కస్టమర్లకు తక్కువ ప్రీమియానికే ఆఫర్ చేస్తున్నాయి. వీటిని పరిశీలించొచ్చు.

యాక్టివ్ హెల్త్ ప్లాన్: కొన్ని బీమా సంస్థలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించే వారికి ప్రీమియంలో రాయితీ ఇస్తున్నాయి. రోజువారీ వ్యాయామం, నడక తదితర సాధనాలు చేయడం వల్ల అనారోగ్యం రిస్క్ తగ్గుతుందని తెలుసు. దీనివల్ల బీమా సంస్థలకు క్లెయిమ్‌ల రిస్క్ తగ్గుతుంది. పాలసీదారులను ఆరోగ్య సంరక్షణ దిశగా ప్రోత్సహించి, తమ క్లెయిమ్‌లను తగ్గించుకునేందుకు బీమా సంస్థలు ఇలాంటి ప్లాన్‌లను ఆఫర్ చేస్తున్నాయి. వీటిల్లో 50 శాతం వరకు ప్రీమియం ఆదా చేసుకోవచ్చు.

కోపే: బీమా ప్రీమియం కట్టలేనంత భారంగా మారిపోతే.. అప్పుడు హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ రద్దు కావడం కంటే.. కో పే ఆప్షన్‌కు వెళ్లొచ్చు. ఉదాహరణకు 20 % కో పే ఎంపిక చేసుకుంటే.. ప్రీమియంలోనూ అంతే మేర డిస్కౌంట్ వస్తుంది. హాస్పిటల్‌లో చేరి చికిత్స తీసుకున్నప్పుడు వచ్చే బిల్లులో 80 శాతాన్నే బీమా సంస్థ చెల్లిస్తుంది. 20 శాతాన్ని పాలసీదారు సొంతంగా భరించాల్సి వస్తుంది.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ప్లాటినం యులిప్ ప్లాన్



ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ కొత్తగా ప్లాటినం ప్లాన్‌ను ఆవిష్కరించింది. డిస్ట్రిబ్యూటర్లకు జరపాల్సిన చెల్లింపులనేవి వారి కస్టమర్ల ఫండ్ వేల్యూ ఆధారంగా ఉండే విధంగా దీన్ని రూపొందించింది. ఈ తరహా యులిప్ పాలసీల్లో తమ కంపెనీ నుంచి ఇది మొదటిదని సంస్థ తెలిపింది. పాలసీ వ్యవధి ఆసాంతం పెట్టుబడులను కొనసాగించే విధంగా కస్టమర్లను డిస్ట్రిబ్యూటర్లు ప్రోత్సహించేందుకు ఇది ఉపయోగపడగలదని వివరించింది. ఈ ప్లాన్ కింద కస్టమర్లు 21 ఫండ్స్ నుంచి దేన్నయినా ఎంచుకోవచ్చు. ఎలాంటి వ్యయాలు, పన్నులపరమైన భారాలు లేకుండా వివిధ అసెట్ క్లాస్‌కు ఉచితంగా, ఎన్నిసార్లయినా మారొచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-5-2024 ఫామ్ ధర...

విశాఖ	500-00
చిత్తూరు	628-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	485-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	530-00
వరంగల్	532-00
రిటైల్ ధర	5.90

ఫార్మాలో ఆకర్షణీయ అవకాశాలు

నిప్పన్ ఇండియా ఫార్మా ఫండ్

ఈక్విటీ పెట్టుబడులకు సంబంధించి ఫార్మాను 'సురక్షిత' రంగంగా చూస్తుంటారు. ఫార్మా వినియోగం ఏటేటా పెరుగుతూనే ఉంది. 10-20 ఏళ్ల క్రితంతో పోల్చి చూస్తే నేడు ఔషధ వ్యయాలు గణనీయంగా పెరిగాయి. దీర్ఘకాలంలో ఈ రంగానికి ఎప్పటికీ మంచి భవిష్యత్తు ఉంటుంది. 2020లో కరోనా సమయంలో ఫార్మా స్టాక్స్ మంచి ర్యాలీ చేశాయి. ఆ తర్వాత అవి దిద్దుబాటుకు గురయ్యాయి. మరోసారి వీటిల్లో ర్యాలీని అనలిస్టులు అంచనా వేస్తున్నారు. కనుక దీర్ఘకాలం కోసం ఫార్మాలో ఇన్వెస్ట్ చేయాలనుకునేవారు థీమ్యాటిక్ (ఒకే రంగంలో ఇన్వెస్ట్ చేసేవి) ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఈ విభాగంలో నిప్పన్ ఇండియా ఫార్మా ఫండ్ పనితీరు దీర్ఘకాలానికి ఆకర్షణీయంగా ఉంది.

పనితీరు

నిప్పన్ ఇండియా ఫార్మా ఫండ్ 2011-16 మధ్య కాలంలో బీఎస్ఈ హెల్త్‌కేర్ ఇండెక్స్‌తో పోటీపడి మరీ రాబడులను ఇచ్చింది. ఆ కాలంలో వార్షికంగా 23.8 శాతం చొప్పున రాబడిని అందించింది. అలాగే, 2016-19 మధ్య కాలంలో బీఎస్ఈ హెల్త్‌కేర్ ఇండెక్స్ కంటే నిప్పన్ ఇండియా ఫార్మా ఫండ్ అధిక రాబడిని అందించింది. కరోనా తర్వాత వార్షిక రాబడి 31.9 శాతంగా ఉంది. కానీ, బీఎస్ఈ హెల్త్‌కేర్ ఇండెక్స్ 26.9 శాతం రాబడినే ఇచ్చింది. ఈ పథకం ట్రైలింగ్ రాబడులను పరిశీలిస్తే.. గడిచిన ఏడాది కాలంలో 53.51 శాతం, మూడేళ్లలో 15 శాతం, ఐదేళ్లలో 25 శాతం, ఏడేళ్లలో 19 శాతం, 10 ఏళ్లలో 17.56 శాతం చొప్పున ఉన్నాయి. ఈ పథకం 2004 జూన్ 5న ప్రారంభం కాగా, నాటి నుంచి చూసుకుంటే వార్షిక రాబడి 20.79 శాతంగా ఉంది. ఫార్మా రంగంలో పెట్టుబడులు ఎప్పుడూ దీర్ఘకాల దృష్టితోనే ఉండాలి. స్వల్పకాల పెట్టుబడులకు ఈ రంగం అనుకూలం కాదు. ఎందుకంటే ఫార్మా కంపెనీలు ఎన్నో కఠినమైన నియంత్రణల మధ్య పనిచేస్తుంటాయి. ముఖ్యంగా యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీల ప్రభావం స్టాక్స్‌పై ఉంటుంది. దీర్ఘకాలంలో అయితే ఈ తరహా అస్థిరతల దశ నుంచి కంపెనీలు బయటకు వచ్చి, మరింత మెరుగైన పనితీరు చూపించగలవు. తాత్కాలిక ఒడిదుడుకులు ఈ రంగంలో సాధారణం. కనుక దీర్ఘకాలం కోసమే (5-10 ఏళ్లు) సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవడాన్ని పరిశీలించొచ్చు.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్ (అంకెలు శాతాల్లో)

కంపెనీ	పెట్టుబడులు
సన్‌ఫార్మా	13.81
లుపిన్	8.55
సిప్లా	6.8
అపోలో హాస్పిటల్స్	5.41
దివిస్ ల్యాబ్	5.5
డాక్టర్ రెడ్డీస్	4.78
గ్లాండ్ ఫార్మా	4.80
జేబీ కెమికల్స్	3.7
జైడస్ లైఫ్	3.61
అబాట్ ఇండియా	3.2



పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతానికి ఈ పథకం నిర్వహణలో రూ.47,133 కోట్ల ఇన్వెస్టర్ల పెట్టుబడులు (ఏయూఎం) ఉన్నాయి. ఇందులో స్టాక్స్‌లో 96 శాతం మేర ఇన్వెస్ట్ చేసి, మిగిలినది నగదు రూపంలో కలిగి ఉంది. 57 శాతం పెట్టుబడులు లార్జ్‌క్యాప్ కంపెనీలకు, మిడ్‌క్యాప్ కంపెనీలకు 31.50 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 11 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది. ఫార్మా స్టాక్స్, హాస్పిటల్స్, హెల్త్‌కేర్, డయాగ్నోస్టిక్స్ కంపెనీల్లో ఈ పథకం ఇన్వెస్ట్ చేస్తుంటుంది. సన్ ఫార్మాకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ 13.81 శాతం పెట్టుబడి పెట్టింది. హెల్త్‌కేర్ సేవలు మరింత విస్తరించే కొద్దీ ఈ కంపెనీల వ్యాపార అవకాశాలు విస్తృతం అవుతాయి. ఈ పథకం బహుళజాతి ఫార్మా కంపెనీలకు తక్కువ కేటాయింపులు చేస్తుంటుంది.

రిస్క్ ఎక్కువ

సెక్టోరల్ లేదా థీమ్యాటిక్ ఫండ్స్‌లో రిస్క్ ఎక్కువగా ఉంటుంది. వీటిల్లో వైవిధ్యానికి పెద్దగా అవకాశం ఉండదు. ఒకే రంగంలోనే మొత్తం ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఆయా రంగాల్లో సంక్షోభాలు ఏర్పడినప్పుడు నష్టాలు కూడా ఎదుర్కోవాల్సి రావచ్చు. కనుక ఒకరి పోర్ట్‌ఫోలియోలో సెక్టోరల్ ఫండ్స్‌కు కేటాయింపులు 10 శాతం మించకుండా చూసుకోవాలి.

అరబిందో ఫార్మా లాభం రూ. 909 కోట్లు

క్యూ4లో 80 శాతం అప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా నికర లాభం గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో దాదాపు 80 శాతం ఎగిసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 909 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో ఇది రూ. 506 కోట్లు. మరోవైపు, సమీక్షాకాలంలో ఆదాయం రూ. 6,473 కోట్ల నుంచి రూ. 7,580 కోట్లకు పెరిగింది. అమెరికా మార్కెట్ల నుంచి ఫార్ములేషన్స్ విభాగం ఆదాయం 22 శాతం వృద్ధితో రూ. 3,588 కోట్లకు, యూరప్ మార్కెట్లలో 10 శాతం వృద్ధితో రూ. 1,832 కోట్లకు, భారత్ సహా వర్ధమాన మార్కెట్లలో ఆదాయం 49 శాతం వృద్ధితో రూ. 852 కోట్లకు చేరింది. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై కంపెనీ రూ. 392 కోట్లు వెచ్చించింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను లాభం రూ. 1,928 కోట్ల నుంచి రూ. 3,173 కోట్లకు పెరగ్గా ఆదాయం రూ. 24,855 కోట్ల నుంచి రూ. 29,002 కోట్లకు ఎగిసింది.

బీఎస్ఈలో ఈ కంపెనీ షేరు శుక్రవారం అరశాతం పెరిగి రూ. 1,235 వద్ద ముగిసింది.



తల్లడిల్లిన పేగుబంధం

కొండగట్టు (చొప్పదండి): ఏ ప్రాణుల్లోనైనా.. ఏ భాషలోనైనా అమ్మ ప్రేమ ఒకటే.. బిడ్డకు ఏం జరిగినా తల్లడిల్లిపోతుంది. ఓ కోతి కూడా తన బిడ్డ నిర్జీవంగా పడి ఉండటంతో విలవిల్లాడింది. బిడ్డను లేపడానికి ప్రయత్నించి అలసిపోయి రోదించింది. జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయ పరిసరాల్లో వేల సంఖ్యలో కోతులు ఉన్నాయి. తాగునీరు, ఆహారం లేక వాటి పరిస్థితి దయనీయంగా మారింది. శనివారం ఆలయ పరిసరాల్లో ఓ కోతిపిల్ల చనిపోవడంతో తల్లి కోతి దాన్ని లేపేందుకు విఫలయత్నం చేసింది. ఈ నేపథ్యంలో ఆలయం తరఫున వాటికి ఆహారం, నీటి వసతి కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా...

కోల్‌కతా విమానాల రాకపోకలు రద్దు

శంషాబాద్: పశ్చిమబెంగాల్‌లో తుపాను ప్రభావంతో హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే విమాన సర్వీసులు రద్దయ్యాయి. కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే విమానాలు మధ్యాహ్నం వరకు యథావిధిగా నడిచాయి. అయితే, సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఉన్న రెండు ఇండిగో, ఒక ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం కోల్‌కతా నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోలేదు. ఇక్కడి నుంచి బయలుదేరే సర్వీసులు కూడా రద్దయ్యాయి. సోమవారం ఉదయం 9 గంటల తర్వాత షెడ్యూల్ ప్రకారం విమానాలు నడుస్తాయని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. సాంకేతిక, ఇతరత్రా కారణాలతో జైపూర్, విశాఖపట్నం, బెంగళూరుకు వెళ్లే మూడు విమాన సర్వీసులు కూడా రద్దయినట్లు చెప్పాయి.

అంధులకు ప్రత్యేక దర్శనం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వచ్చిన అంధులకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆదివారం భారీగా భక్తులు తరలి రావడంతో కొండంతా కిక్కిరిసిపోయింది. దీంతో హైదరాబాద్ నుంచి వచ్చిన భక్తులను సురక్ష సిబ్బంది గుర్తించి ప్రత్యేక ప్రవేశ మార్గంలో దర్శనానికి తీసుకెళ్లారు. అంధులు, ఇతర దివ్యాంగులను ప్రత్యేక మార్గంలో పంపించి శ్రీస్వామి వారి దర్శనం కల్పించాలని ఇటీవల ఆలయ ఈవో భాస్కర్‌రావు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎనిమిది మంది అంధ భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు.

విద్యార్థినుల ఆత్మరక్షణ కోసం షీల్డ్ అప్ శిక్షణ

- ఎన్జీఓ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ శిబిరం
- పాల్గొన్న 120 మంది విద్యార్థినులు



సాక్షి, హైదరాబాద్: స్వీయ ఆత్మరక్షణ ఎలా పొందాలన్న అంశాలపై రాష్ట్ర మహిళా భద్రతా విభాగం, గర్ల్ అప్ రహా అనే స్వచ్ఛంద సంస్థ, ద్రిష్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో షీల్డ్ అప్ పేరుతో ఆదివారం సెల్ఫ్ డిఫెన్స్ కార్నివాల్‌ను నిర్వహించారు. గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో నిర్వహించిన ఈ సెల్ఫ్ డిఫెన్స్ కార్నివాల్‌లో మొత్తం 120 మంది యువతులకు స్వీయ ఆత్మరక్షణ మెళకువలను నేర్పినట్లు గర్ల్ అప్ రహా ఎన్జీఓ ఫౌండర్, ప్రెసిడెంట్ పాఖి అగర్వాల్ తెలిపారు. వీరిలో ఉత్తమ ప్రతిభకనబరిచేవారిని ఎంపిక చేసి వలంటీర్లుగా నియమిస్తామని వెల్లడించారు. వలంటీర్ల ద్వారా వారి ప్రాంతాల్లోని కళాశాలలు, పాఠశాలలు, ఇతర ప్రాంతాల్లో ఈ తరహాలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా భద్రతా విభాగం నుంచి షీ టీమ్స్ నోడల్ అధికారి, అదనపు ఎస్పీ ఏ.లక్ష్మి, మహిళా భద్రతా విభాగం ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణరెడ్డి, ఎస్సై పి.హరీశ్ పాల్గొన్నారు.

తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా సల్మాన్ నాయక్ రాథోడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా తిరుపతి నాయక్, కోశాధికారిగా మధుమోహన్, సహాధ్యక్షులుగా నిశాంత్ కుమార్, భాస్కర్, ఉపాధ్యక్షులుగా కిశోర్ బాబు, లింగుస్వామి, రామారావు నాయక్, సంయుక్త కార్యదర్శులుగా నాగరాజు ఎన్నికయ్యారు. అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం వ్యవస్థాపకుడు కె.రాములు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. పదోన్నతులు చేపట్టాలని, సుదీర్ఘ కాలంగా బదిలీల కోసం వ్యవసాయ అధికారులు ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం ఈమేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని నూతన కార్యవర్గం కోరింది. అతిత్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి అగ్రి వైద్యుల సమస్యలను నివేదించనున్నట్లు తెలిపింది.

‘సైబర్’ ముప్పును గుర్తించండిలా!

సాక్షి, హైదరాబాద్

స్మార్ట్‌ఫోన్లు వాడే వారు తప్పక మొబైల్ యాప్‌లను వాడుతూనే ఉంటారు. పలు రకాల పనుల కోసం ఎన్నో రకాల వెబ్‌సైట్లను వినియోగిస్తుంటారు. దీంతో ఇదే అదునుగా సైబర్ నేరగాళ్లు ఫిషింగ్ లింక్‌లను పంపి మోసాలకు తెరతీస్తున్నారు. అయితే ఇలాంటి అనుమానాస్పద వెబ్‌సైట్‌లు, లింక్‌లను ఓపెన్ సోర్స్ సైబర్ టూల్స్‌తో గుర్తించవచ్చని తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్ సీఎస్‌బీ) అధికారులు చెబుతున్నారు. అవి ఏమిటంటే..



నకిలీ వెబ్‌సైట్‌లు, లింక్‌లను పసిగట్టేందుకు ఎన్నో మార్గాలు

ఓపెన్ సోర్స్ సైబర్ టూల్స్‌తో సులువే అంటున్న టీఎస్‌సీఎస్‌బీ అధికారులు

యూఆర్ఎల్, అడ్రస్ బార్ పరిశీలన తప్పనిసరి

ప్రతి వెబ్‌సైట్ యూనిఫాం రిసోర్స్ లొకేటర్ (యూఆర్ఎల్) అడ్రస్‌లో https:// అని ఉంటే ఆ వెబ్‌సైట్ ఓపెన్ చేసేందుకు భద్రమైనదని గుర్తించాలి. అలాగే అడ్రస్ బార్‌లో లాక్ సింబల్ ఉంటే కూడా దాన్ని సురక్షితమైన వెబ్‌సైట్‌గా నిర్ధారించుకోవాలి. లేదంటే అది డేటా హ్యాక్ అయ్యే అవకాశం ఉన్నట్లు గుర్తించాలి.

కాంటాక్ట్ పేజీ తనిఖీ అవసరమే..

ఏదైనా కంపెనీకి సంబంధించి వెబ్‌సైట్ లింక్ మనకు వస్తే దానిలో కంపెనీ ఫోన్ నంబర్, ఈమెయిల్, కంపెనీ అడ్రస్ ఉన్నాయా లేదో చూడాలి. ఈ వివరాలు లేకపోతే అది నకిలీ వెబ్‌సైట్ అయ్యే అవకాశాలే ఎక్కువ.

కంపెనీకి సోషల్ మీడియా ఖాతాలున్నాయా?

చట్టబద్ధమైన కంపెనీలు తప్పకుండా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటాయి. కంపెనీ చిరునామా కింద యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ‘ఎక్స్’వంటి సోషల్‌మీడియా ఐకాన్‌లు జోడించి ఉంటాయి. వాటిలో సంబంధిత సమాచారంపై యూజర్ల రివ్యూలు ఉంటాయి. మోసపూరిత వెబ్‌సైట్‌లకు అలాంటి లింక్‌లు ఉన్నా అందులో ఏమీ నిజమైన అంశాలు ఉండవు.

వెబ్‌సైట్ల అక్షరాలు మారుస్తూ మోసాలు

సైబర్ నేరగాళ్లు నిజమైన వెబ్‌సైట్లను పోలి ఉండేలా పేర్లు పెడుతూ మోసగిస్తుంటారు. ఉదాహరణకు ‘yahoo.com’ను కొద్దిపాటి మార్పులతో అందులోని అక్షరాలకు సున్నాలు చేర్చి ‘Yah00.com’గా మారుస్తుంటారు. అలాగే అమెజాన్ వెబ్‌సైట్‌ను ‘ AmaZ0 b. net’గా పెడుతున్నట్లు సైబర్ భద్రత నిపుణులు వివరిస్తున్నారు. నిజమైన వెబ్‌సైట్లను గుర్తించేందుకు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని సూచిస్తున్నారు.

డొమైన్ ఏజ్ సరిచూసుకోవాలి..: సదరు వెబ్‌సైట్ డొమైన్ ఎవరి పేరిట రిజిస్టర్ అయ్యింది..ఎన్నాళ్లుగా యాక్టివ్‌గా ఉంది..ఎక్కడి నుంచి ఈ వెబ్‌సైట్‌ను నడుపుతున్నారు తదితర వివరాలు ఓపెన్ సోర్స్ టూల్ https://whois.domaintools.com/ లోకి వెళ్లి సదరు వెబ్‌సైట్‌లో సరిచూసుకోవచ్చు..

గ్రామర్ తప్పులతో పసిగట్టొచ్చు..: నకిలీ వెబ్‌సైట్‌ల పేర్లలో అక్షర దోషాలు ఉంటాయి. అందులోని కంటెంట్‌లోనూ వ్యాకరణ దోషాలు ఎక్కువ ఉంటాయి. ఇది కూడా నకిలీ వెబ్‌సైట్ గుర్తించేందుకు ఒక సూచన.

ప్రైవసీ పాలసీ ఉందా?..: డేటా ప్రైవసీ, చట్టాలు ఇతర అంశాలను నిజమైన వెబ్‌సైట్‌లు తమ ప్రైవసీ పాలసీలో క్షుణ్ణంగా పేర్కొంటాయి. కానీ నకిలీ వెబ్‌సైట్లలో ఈ వివరాలు సరిగ్గా ఉండవు.

ఇంటర్నెట్ టూల్స్ సాయంతో..: ఒక వెబ్‌సైట్ సురక్షితమైందో లేదో గూగుల్ సేఫ్ బ్రౌజర్ ట్రాన్స్‌పరెన్సీ రిపోర్ట్ ద్వారా తెలుసుకోవచ్చు. ఇందుకోసం https:// transparencyreport. google. com/ safe& browsing/ search? hl= en లోకి వెళ్లి మనం చెక్ చేయాలనుకొనే వెబ్‌సైట్ యూఆర్ఎల్‌ను నమోదు చేస్తే అది నిజమైనదో లేక నకిలీదో చిటికెలో తెలుస్తుంది. మనకు వచ్చిన లింక్‌లోని వెబ్‌సైట్‌లో ఉన్న కంపెనీ విశ్వసనీయత గురించి తెలుసుకునేందుకు https://www.bbb.org/లో సెర్చ్ చేయవచ్చు. అలాగే isithacked, virustotal, phishtank, ftc, scamalert లాంటి ఓపెన్ సోర్స్ వెబ్‌సైట్లు, టూల్స్‌తో నకిలీ వెబ్‌సైట్ల నుంచి వచ్చే వైరస్, ఫిషింగ్ లింక్‌లు, మాల్‌వేర్‌లను గుర్తించొచ్చు.

మీషో కూపన్ల పేరిట సైబర్‌మోసం!

- స్క్రాచ్ చేస్తే గిఫ్ట్‌లు అంటూ సైబర్ నేరగాళ్ల గాలం
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న సైబర్ భద్రత నిపుణులు

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ షాపింగ్‌లో ప్రముఖ వెబ్‌సైట్ అయిన మీషో పేరిట సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసానికి తెర తీస్తున్నారని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీషో కంపెనీ నుంచి వచ్చిందని భ్రమపడేలా ఓ ఫామ్‌ను, స్క్రాచ్ కార్డును డిజైన్ చేసి సైబర్ నేరగాళ్లు పోస్ట్ చేస్తున్నారు. వీటిని అందుకున్న వారిని అందులోని కార్డును స్క్రాచ్ చేయాలని సూచనల్లో పేర్కొంటున్నారు. అలా స్క్రాచ్ చేసిన తర్వాత అందులో మీరు లక్కీ కస్టమర్ కింద లక్కీ కూపన్‌లో కారు, బంగారం వంటి ఖరీదైన బహుమతులు గెలుచుకున్నారని ఉంటుంది. ఇలా లక్కీ డ్రా తగిలిన వారు వెంటనే మీ స్క్రాచ్ కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, మేం అడిగే వివరాలు నమోదు చేయాలని చెబుతారు. ఏదైనా సందేహాలుంటే మీకు ఇచ్చిన దరఖాస్తులోని నంబర్లకు ఫోన్ చేయాలని సూచిస్తున్నారు.

వివరాలిస్తే అసలుకే మోసం...

ఎవరైనా అమాయకులు ఈ ఉచ్చులో చిక్కితే ఇక సైబర్ నేరగాళ్లు తమ విశ్వరూపం చూపిస్తున్నారు. ఇలా స్క్రాచ్ కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అందులో సూచించిన విధంగా వివరాలు నమోదు చేస్తే ఇక అసలు మోసం మొదలవుతుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే అనుమానాస్పద యాప్‌లు మనకు తెలియకుండానే మన ఫోన్‌లోకి ఇన్‌స్టాల్ అవుతాయి. అదేవిధంగా మనం నమోదు చేసే బ్యాంకుఖాతా, వ్యక్తిగత వివరాలన్నీ తీసుకుంటున్న సైబర్ నేరగాళ్లు బ్యాంకుఖాతాల్లోని డబ్బులు కొల్లగొడుతున్నారు. ఇలాంటి కూపన్లు వస్తే నమ్మవద్దని, ఎలాంటి వివరాలు వారితో పంచుకోవద్దని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో పట్టణప్రాంతాలకే పరిమితమైన ఈ తరహా మోసాలు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా జరుగుతున్నాయని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి మోసాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

‘అడ్వాన్స్‌డ్’ ఈసారి పర్లేదు

మధ్యస్థంగా ప్రశ్నలు.. 200 మార్కులొస్తే 5 వేలలోపు ర్యాంకు వచ్చే వీలు

తెలుగు రాష్ట్రాల నుంచి పరీక్ష రాసిన 50 వేల మంది విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఐఐటీల్లో ప్రవేశానికి ఆదివారం జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సుమారు 2 లక్షల మంది హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 50 వేల మంది పరీక్ష రాశారు. ఐఐటీ మద్రాస్ నిర్వహించిన పరీక్ష ఈసారి కాస్త తేలికగానే ఉందని పలువురు విద్యార్థులు తెలిపారు. పేపర్-1 మధ్యస్థం నుంచి కొంత కష్టంగానే ఉందని మేథ్స్ నిపుణులు ఎంఎన్ రావు తెలిపారు. కానీ పేపర్-2 మధ్యస్థంగానే ఉన్నట్లు విశ్లేషించారు. కెమిస్ట్రీలో కొన్ని ప్రశ్నలు తేలికగా మరికొన్ని మధ్యస్థంగా ఉన్నాయని చెప్పారు. ఫిజిక్స్ రెండు పేపర్లు కాస్త సులువుగానే ఉన్నట్లు వివరించారు. అడ్వాన్స్‌డ్ పేపర్‌లో ఇచ్చిన ప్రశ్నలు, ప్రశ్నపత్రం తీరును పరిశీలిస్తే మొత్తం 360 మార్కులకుగాను 200 మార్కులకుపైగా సాధిస్తే 5 వేల ర్యాంకు వరకు వచ్చే వీలుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 150 నుంచి 200 మధ్య మార్కులొస్తే 5 వేల నుంచి 9 వేల మధ్య ర్యాంకు రావొచ్చని చెబుతున్నారు. జనరల్ కేటగిరీ విద్యార్థులు మొత్తంగా 70 మార్కులు సంపాదిస్తే (ప్రతి సబ్జెక్టులో 6% తప్పనిసరి) అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించే వీలుంది. ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో 5% మార్కులు తెచ్చుకొని మొత్తంగా 60 మార్కులు సాధిస్తే అర్హత పొందుతారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో 3 శాతంతోపాటు 30 మార్కులు తెచ్చుకుంటే అర్హత పొందే వీలుంది.



గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు

ఒక్కరోజే 40 వేలకు పైగా వాహనాల రాకపోకలు

ఫాస్టాగ్ స్కానింగ్ ఆలస్యంతో 2 కి.మీ. మేర నిలిచిన వాహనాలు

బీబీనగర్ (యాదాద్రి భువనగిరి జిల్లా): యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, నూతనంగా నిర్మించిన భువనగిరిలోని స్వర్ణగిరి ఆలయాల సందర్శనకు భక్తుల తాకిడి పెరుగుతూ వస్తుండటంతో బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. దీనికితోడు టోల్‌ప్లాజా బూత్‌ల వద్ద వాహనాల ఫాస్టాగ్ స్కానింగ్ ఆలస్యం అవుతుండటంతో ఆదివారం రాత్రి 2కిలో మీటర్ల మేర వాహనాలు హైదరాబాద్ వైపు నిలిచిపోయాయి. సుమారు ఒక్కో వాహనం వెళ్లడానికి గంటకు పైగా సమయం పట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఒక్కరోజే 40వేలకు పైగా వాహనాలు టోల్ గుండా రాకపోకలు సాగించాయి. వేసవి సెలవులు ముగిసిపోతుడంటంతో హైదరాబాద్ జంట నగరాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు పుణ్య క్షేత్రాలను దర్శించుకునేందుకు వస్తుండటంతో వాహనాల సంఖ్య పెరుగుతోంది.

రాష్ట్రంలో గుట్కా, పాన్‌మసాలాపై నిషేధం

ఏడాది పాటు నిషేధం విధిస్తూ ఫుడ్ సేఫ్టీ విభాగం ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్యం దృష్ట్యా తెలంగాణ రాష్ట్రంలో పొగాకు, నికోటిన్ కలిగిన గుట్కా, పాన్ మసాలా తయారీ, నిల్వ చేయడం, రవాణా చేయడం, సరఫరా చేయడం, విక్రయించడంపై నిషేధం విధిస్తూ ఫుడ్ సేఫ్టీ విభాగం కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మే 24, 2024 నుంచి ఏడాదిపాటు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. పాన్‌మసాలా, గుట్కా సాచెట్లు, పౌచ్‌లు, డబ్బాలు.. ఏ రూపంలో ప్యాక్ చేసి విక్రయించినా ఈ నిషేధం వర్తిస్తుందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

గుట్కా నిషేధం హర్షణీయం: రఘునందన్

తెలంగాణ ప్రభుత్వం గుట్కా విక్రయాలపై నిషేధం విధించడం హర్షణీయమని, నిజంగా ఇది చారిత్రక నిర్ణయమని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ నయాబ్ తసిల్దార్, పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత మాచన రఘునందన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాలలు, యువకులు గుట్కా మహమ్మారి బారిన పడకుండా పొగాకు నియంత్రణ చర్యలు చేపట్టడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

గురుకులాల్లో బదిలీల తర్వాతే కొత్త పోస్టింగ్‌లివ్వాలి

- గురుకుల డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలి.. స్కూళ్లు తెరిచే నాటికి పదోన్నతులివ్వాలి
- తెలంగాణ గురుకుల జేఏసీ ఏకగ్రీవ తీర్మానం

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టిన తర్వాతే కొత్తవారికి పోస్టింగ్ ఇవ్వాలని తెలంగాణ గురుకుల జేఏసీ తీర్మానించింది. ఆదివారం తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్(టిగారియా) ఆధ్వర్యంలో గురుకుల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టిగారియా అధ్యక్షుడు మామిడి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో గురుకులాల సంఖ్య భారీగా పెరిగినప్పటికీ వసతుల కల్పన మాత్రం అధ్వాన్నంగా ఉందని, దీంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే అన్ని గురుకులాల్లో కామన్ అడ్మినిస్ట్రేషన్ కోసం గురుకుల డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి 317 జీవో బదిలీలు జరిపి పదోన్నతులు ఇవ్వాలని కోరారు. నిత్యావసర ధరలు పెరిగిన క్రమంలో డైట్ చార్జీలు పెంచాలన్నారు. గురుకుల టీచర్లు అందరికీ నైట్ స్టే(రాత్రి బస)ఎత్తివేయాలని, రాబోయే పీఆర్సీలో గురుకుల టీచర్లకు ప్రత్యేక వేతన స్కేలు, స్పెషల్ టీచర్స్‌కు టీజీటీలకు సమానమైన స్కేలు వర్తింపజేయాలని కోరారు. దాదాపు పది అంశాలపై చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.మధుసూదన్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.రామకృష్ణయ్య, నేతలు నరసింహులు గౌడ్, కె.జనార్దన్, బిక్షం పాల్గొన్నారు.

ఐసెట్‌కు భారీగా దరఖాస్తులు

ఇప్పటివరకు 84,750 అప్లికేషన్లు

- 15 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా దరఖాస్తులు
- రూ.500 అపరాధ రుసుముతో నేటితో ముగియనున్న గడువు



కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం 2024-2025లో ప్రవేశాలకు గానూ నిర్వహించనున్న టీఎస్ ఐసెట్-2024కు ఈ ఏడాది భారీగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. గత పదిహేనేళ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డుస్థాయిలో దరఖాస్తులొచ్చాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుండగా ఆదివారం వరకు 84,750 మంది దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది 75,520 దరఖాస్తులు రాగా, ఈసారి ఆ సంఖ్య కంటే 9,230 దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. రూ.500 అపరాధ రుసుముతో సోమవారం వరకు చివరి గడువు ఉంది. ఇంకా కూడా దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందని టీఎస్ ఐసెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆచార్యులు నర్సింహాచారి వెల్లడించారు. ఈ నెల 28వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్లను సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు.

ఆన్‌లైన్‌లోనే పరీక్ష.. వచ్చే నెల 28న ఫలితాలు

ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ విధానంలో జూన్ 5వ తేదీన మొదటి సెషన్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12-30గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2-30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని నర్సింహాచారి ఆదివారం తెలిపారు. 6వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12-30గంటల వరకు ఒక సెషన్‌ను నిర్వహిస్తారని వివరించారు. మొత్తంగా మూడు సెషన్‌లలో ఈ ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రాథమిక కీని జూన్ 15వ తేదీన వెల్లడిస్తామని ఆయన తెలిపారు. ఆ కీపై అభ్యంతరాలను జూన్ 16 నుంచి 19వరకు స్వీకరిస్తామన్నారు. ఫైనల్ కీతో పాటు టీఎస్‌ఐసెట్ ప్రవేశపరీక్ష ఫలితాలను జూన్ 28న విడుదల చేస్తామని నర్సింహాచారి వెల్లడించారు.

పలు సంస్థలకు ‘రెరా’ షోకాజ్ నోటీసులు

- ప్రీలాంచ్ ఆఫర్లు నమ్మి రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టుల్లో ఫ్లాట్లు కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: నిబంధనలు ఉల్లంఘించిన పలు రియల్ ఎస్టేట్ కంపెనీలకు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. షోకాజ్ నోటీసులు జారీ అయిన సంస్థల్లో మియాపూర్ ప్రజ్ఞ ఎకోస్పేస్, చింతల్‌కుంట శ్రీ సిద్ధి వినాయక ప్రాపర్టీ డెవలపర్స్, కొండాపూర్ నార్త్ ఈస్ట్ హెబిటేషన్, సంగారెడ్డి జిల్లా వి.ఆర్.ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్, కేపీహెచ్‌బీ కాలనీ ఇన్వెస్ట్ ఇన్ఫ్రా ప్రాజెక్టు, కొంపల్లి భారతి లేక్‌వ్యూ టవర్ బిల్డర్స్ ఉన్నాయి. ‘రెరా’నిబంధనలు ఉల్లంఘించినందున 15 రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ‘రెరా’ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రీలాంచ్ ఆఫర్లను నమ్మి రెరా రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టులలో ఫ్లాట్లు కొని మోసపోరాదని ‘రెరా’విజ్ఞప్తి చేసింది.

8,270 ప్రాజెక్టులకు రిజిస్ట్రేషన్లు జారీ

‘రెరా’అథారిటీ పూర్తిస్థాయిలో ఏర్పడిన 11 నెలల కాలంలోనే 2,338 ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయడంతోపాటు ఫామ్-ఎం ద్వారా అందిన 210 ఫిర్యాదులను పరిష్కరించినట్లు అథారిటీ తెలిపింది. ఇప్పటివరకు 8,270 ప్రాజెక్టులకు రిజిస్ట్రేషన్లు జారీ చేసినట్లు అథారిటీ పేర్కొంది. 918 ప్రాజెక్టులు ‘రెరా’నిబంధనలు అతిక్రమించినట్లు గుర్తించి రూ.30.99 కోట్లు ఫైన్ విధించి అందులో 13.70 కోట్లు రికవరీ చేసినట్లు అథారిటీ పేర్కొంది.

హైదరాబాద్‌లో చోరీ.. సూడాన్‌కు స్మగ్లింగ్

సెల్‌ఫోన్ దొంగల ముఠా గుట్టురట్టు
- వ్యవస్థీకృతంగా సాగుతున్న వ్యవహారం
- 31 మందిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- రూ.2 కోట్ల విలువైన 713 సెల్‌ఫోన్లు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఇటీవల సెల్‌ఫోన్ చోరీలు పెరిగిపోతున్నాయి. ఈ విషయంలో తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు చోరీలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్-సూడాన్ మధ్య ఉన్న అంతర్జాతీయ నేర బంధం వెలుగులోకి వచ్చింది. ఇక్కడ చోరీకి గురైన స్మార్ట్‌ఫోన్లను థర్మకోల్ బాక్సుల్లో పార్సిల్ చేసి సూడాన్‌కు స్మగ్లింగ్ చేస్తున్న వ్యవస్థీకృత ముఠా వ్యవహారాలు బయట పడుతున్నాయి. గత నెల ఆఖరి వారంలో 17 మందిని అరెస్టు చేసి 703 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. తాజాగా మరో 31 మందిని పట్టుకుని వీరి నుంచి రూ.2 కోట్ల విలువైన 713 ఫోన్లు సీజ్ చేశారు. ఈ ముఠాల వ్యవహారంపై టాస్క్‌ఫోర్స్ డీసీపీ ఎస్.రష్మి పెరుమాళ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

చోరీ చేసి.. వ్యాపారులకు విక్రయం

హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన చిన్న చిన్న ఉద్యోగులు, చిరు వ్యాపారులు, ఆటోడ్రైవర్లు ఓ ముఠాగా ఏర్పడ్డారు. విలాసాలకు అవసరమైన డబ్బును తేలిగ్గా సంపాదించడానికి సెల్‌ఫోన్ల చోరీలు చేయాలని పథకం వేశారు. రద్దీ ప్రాంతాల్లో తిరుగుతూ అదును చూసుకుని ప్రజల సెల్‌ఫోన్లు చోరీ చేస్తారు. వాటిని జగదీశ్ మార్కెట్ సహా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సెల్‌ఫోన్ మార్కెట్లలో కొందరు వ్యాపారులకు విక్రయిస్తుంటారు.

ఆపై వాటిని ఏం చేస్తున్నారు?

ఇలా చోరీ చేసిన ఫోన్లలో దాదాపు అన్నీ లాక్ చేసే ఉంటాయి. వీటిని అన్‌లాక్ చేయడం కోసం ప్రత్యేకంగా కొందరు సెల్‌ఫోన్ టెక్నీషియన్లు పని చేస్తున్నారు. వీళ్లు చోరీ ఫోన్ల లాక్‌లు తీయడంతో పాటు అవసరమైన వాటి ఐఎంఈఐ నంబర్లు ట్యాంపర్ చేస్తుంటారు. అంటే.. తక్కువ ఖరీదు ఉండే బేసిక్ ఫోన్లకు చెందిన ఐఎంఈఐ నంబర్లను ఖరీదైన ఫోన్లలో వేసి పోలీసుల సాంకేతిక నిఘాకు చిక్కకుండా చేస్తారు. ఆపై ఆ ఫోన్లను వ్యాపారులు సూడానీయులకు అమ్మేస్తున్నారు. ఆ దేశంలోని వ్యాపారులతో సంబంధాలు కలిగి ఉండే వీళ్లు.. సెకండ్ హ్యాండ్ ఫోన్ల పేరుతో థర్మకోల్ బాక్సుల్లో పార్సిల్ చేసి, తప్పుడు పత్రాలతో సముద్ర మార్గంలో అక్కడకు పంపేస్తున్నారు.

ఈ నెట్‌వర్క్‌లో ఎవరెవరు ఏం చేస్తున్నారు?

హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆటోడ్రైవర్లు.. సయ్యద్ ఫయాజ్ హష్మి, మహ్మద్ దస్తగిర్, సయ్యద్ సాజిద్, సయ్యద్ షరీఫ్, సయ్యద్ సలావుద్దీన్, టైల్స్ వర్కర్లు మహ్మద్ హమీద్, షేక్ మునావర్, వెల్డింగ్ వర్కర్లు షేక్ అన్సార్, మహ్మద్ ఖాన్, డెకరేషన్ వర్కర్ మహ్మద్ అంజాద్, వంట పని చేసే మహ్మద్ ఖాలిద్, పెయింటర్ మహ్మద్ మహమూద్ అలీ, చిరుద్యోగి సోహైల్ ఖాన్, కూరగాయల వ్యాపారి మహ్మద్ ముస్తాక్ ఫోన్లు చోరీ చేస్తారు. మొబైల్ వ్యాపారులైన షేక్ షాజవాజ్ ఖాన్, మహ్మద్ ఆసిఫ్ అహ్మద్, మహ్మద్ గౌస్, మహ్మద్ అర్షద్ మొయినుద్దీన్, మహ్మద్ నవీదుద్దీన్ సల్మాన్, మహ్మద్ నజీరుద్దీన్, మహావీర్ జైన్, మహ్మద్ అబ్దుల్ సిరాజ్, మజీద్ ఖాన్, అబ్దుల్ హజీమ్, షేక్ జావేద్ అలీ ఈ చోరీ ఫోన్లు కొంటారు. వీటిని సయ్యద్ రహీమ్, మహ్మద్ అర్బాజ్ ఖాన్, నజీముద్దీన్, సాదిక్ అహ్మద్ అన్‌లాక్ చేస్తుండగా.. ఇవన్నీ తక్కువ ధరకు కొనే సూడానీ మూసా హసన్ తమ దేశానికి స్మగ్లింగ్ చేస్తున్నాడు. నానల్‌నగర్‌లో ఉండే మూసా మొబైల్ విడిభాగాల వ్యాపారం చేస్తున్నాడు. స్మగ్లింగ్ వ్యవహారంలో మూసానే కీలకంగా వ్యవహరిస్తున్నాడు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

ఇలా పట్టుకున్నారు..

వీరి వ్యవహారాలపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్లు షేక్ జకీర్ హుస్సేన్, డి.వెంకట్‌రెడ్డి, ఎ.నాగరాజు తమ బృందాలతో రంగంలోకి దిగారు. వరుసదాడులు చేసి చోరులు, రిసీవర్లు, టెక్నీషియన్లు, సూడాన్ జాతీయుడు మూసాతో కలిపి మొత్తం 31 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి 713 సెల్‌ఫోన్లు, ఒక ఆటో, రెండు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం వీరిపై హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలోని వివిధ పోలీసుస్టేషన్లలో 27 కేసులు నమోదై ఉన్నాయి. నిందితుల్లో కొందరికి నేరచరిత్ర ఉన్నట్లు గుర్తించారు. ఈ ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లలో ఐఫోన్ నుంచి బేసిక్ మోడల్స్ వరకు ఉన్నాయి. ఇలాంటి ముఠాలు మరి కొన్ని ఉన్నట్లు అనుమానిస్తున్న పోలీసులు నిఘా ముమ్మరం చేశారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.